ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్







# యుగశక్తి గాయత్రి

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య



సంపుటి 15 - సంచిక 12
**మే 2011**

**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

*Please send Drafts & Money Orders in favour of*
**"SRI VEDAMATA GAYATRI TRUST"**
**GAYATRI CHETANA KENDRAM**
H.P. Road, Moosapeta,
Near Aswini House, Hyderabad-18.


## ప్రతిభ

జీవితంలో ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానాన్నివ్వగలిగినదే ప్రతిభ. జీవితము ఎల్లప్పుడూ సహజంగా ఉండాలి. సంప్రదాయమార్గాలను అనుసరించిగానీ, కట్టిపడవేసేటటువంటి ఆచారవ్యవహారాల కనుగుణంగా కానీ జీవితము సాగదు. జీవితంలో సంభవించే అన్నివిధములైన అంతరంగ, బహిరంగ సంఘటనలన్నీ సంపూర్ణంగా సహజమైనవి, ఒక విలక్షణమైన క్రొత్తదనంతో ఉద్భవించినవే. జీవితంలో అడుగడుగునా ఎదురయ్యే స్పర్థలూ, తలెత్తే ప్రశ్నలూ, పూర్తిగా తమ క్రొత్తదనాన్ని పరిచయము చేస్తూఉంటాయి. ఈ ప్రశ్నలన్నింటికీ సోదాహరణ పూర్వకమైన సృజనాత్మకతతో కూడిన చక్కని సమాధానాలను ఇవ్వగలిగినవారే ప్రతిభావంతులు.

జీవన ప్రవాహంలో ప్రతి నిమిషమూ, ప్రతిక్షణమూ కూడా అప్రమత్తంగా క్రియాత్మకంగా ఉండటము ఎంతో అవసరము. అప్పుడే జీవితము మననుండి ఏమి కోరుతున్నది? నేటి పరిస్థితులలో ఎదుర్కొనవల్సిన సవాళ్ళేమిటి? అన్న విషయాన్ని తెలుసుకొనడము సాధ్యపడుతుంది. ప్రతిభావంతులు పరిస్థితులకు మరియు సమస్యలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. కానీ మూఢులు, సంప్రదాయవాదులూ, ప్రాచీనకాలపు ధర్మగ్రంథాలలోనివి, అవతారపురుషులూ లేదా మతప్రవక్తలు ఎవరైనా చెప్పిన అతి పురాతన సమాధానాలను పదేపదే వల్లెవేస్తూ ఉంటారు.

వివేకహీనులైన వ్యక్తులు శాస్త్రములు, ధర్మగ్రంథాలనే ప్రాచీనకాలపు భారాన్ని మోస్తూ ఉంటారు. వాళ్ళు ఎవరో ఒక అవతారపురుషునిపైననో, ప్రవక్తమీదనో, మతబోధకుని మీదనో తమ భారాన్నంతా పడవేసి నిశ్చింతగా ఉంటారు. ఎందుకంటే తమపైన తాము నమ్మకము పెట్టుకొనటానికి వాళ్ళకి భయము. ఐతే అంతర్దృష్టి సంపన్నులైన ప్రతిభావంతులు తమపైన తాము విశ్వాసాన్ని కలిగియుంటారు. వాళ్ళు అవతారపురుషులపైనా, ప్రవక్తలపైనా, ధర్మశాస్త్రవేత్తలపైనా శ్రద్ధావిశ్వాసాలు కలిగిఉంటూ, వారి ప్రవచనాలకు క్రొత్తయుగానికి అనుగుణ్యమైన క్రొత్త వ్యాఖ్యానాలను ఏర్పరచుకుంటారు. ఇలాంటి ప్రతిభ జీవితంలో ఎదురయ్యే అన్నివిధములైన సమస్యలకు సరియైన సమాధానాన్ని అందించగలదు.


పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
**9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


మనస్సులో సానుకూల భావాలు ఉత్తేజాన్ని కలుగజేస్తాయి.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** ప్రతిభ 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** మతాల మధ్యనున్న ఏకత్వం 2
3. **వేదమంత్రం :** సదాచరణ 3
4. **వర్తమాన భారతం :** యుగపరివర్తన కొరకు విశిష్ఠ వ్యక్తులకు ఆహ్వానం 4
5. **గాయత్రీ విద్య-8 :** ఆత్మబల సముపార్జనకు సరళమైన ఉపాయం గాయత్రి సాధన 7
6. **బాలల భవితకు బంగారు బాట-19 :** ధన్యులైన దొంగలు 10
7. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ : ప్రథమ మండలం - 5వ అధ్యాయం :** ఉదారభక్తి భావనా ప్రకరణం 11
8. **యుగ గీత-9 : రెండవ అధ్యాయం-సాంఖ్య యోగము :** ప్రజ్ఞావంతుని నిజమైన గుర్తింపు - స్థిత ప్రజ్ఞత్వం 13
9. **సూర్య విజ్ఞానం - 8 :** విరాట్ ప్రాణ పురుషులు - సవితా దేవత 16
10. **జన్మ శతాబ్ది ప్రత్యేకం :** 21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్తు తీసుకువస్తున్నది 19
11. **గాయత్రీ 24 శక్తి ధారలు (24) :** త్రిపుర 22
12. **ఆదిశక్తి లీలా కథలు-11 :** నవార్ణ మంత్రం యొక్క రహస్యార్థం-సాధనా మర్మం 24
13. **కుటుంబ నిర్మాణం :** బాధ్యత, సంస్కారం లేని కుటుంబాలు 26
14. **పూజ్య గురుదేవుల అమృత వాణి :** యుగ పరివర్తన కాలంలో పంచశీలములు పాటించండి - 4 28
15. **జీవించేకళ :** నవ్వే నవనీతం - నవ్వే సంజీవని 33
16. **సాధనా విజ్ఞానం :** ఉపాసన తప్పనిసరి - సాధన దానిని మించినది 34
17. **ధారావాహిక హనుమత్ కథామృతం-34 :** హనుమంతునిలో అంకురించిన సేవా ధర్మం 35
18. **వ్యక్తి నిర్మాణం :** విజయానికి ఏడు మెట్లు 37
19. **నా వారితో నా మాట : జన్మశతాబ్ది 2011-2012** అనుదానములు పొందే విషయంలో చివరివారు కావద్దు 40
20. **ఆరోగ్యమే మహాభాగ్యం-6 :** హోమియో వైద్య సేవ 42
21. **వేమన వేదం-జీవన నాదం - 7** 44
22. **వార్తలు** 46
23. **అక్షరాల ఆట :** పదగాయత్రి-7 48


# సద్గురు వచనామృతం



## మతాల మధ్యనున్న ఏకత్వం

మనుష్యులకు వాస్తవాలపై కాక అవాస్తవాలపై భేదాభిప్రాయాలు వస్తుంటాయి. సత్యం అనే పేరుతో కొట్టుకొంటుంటారు. ఏ మతం వారైనా సత్యం గురించి తెలుసుకోవాలంటే ఇతరులతో కలహించడం మాని, వారి పట్ల ప్రేమతో ఉదారంగా ఉండటం అలవరచుకోవాలి. తన పొరుగువాని ధర్మాన్ని తప్పుగా భావించి, దానిని సమూలంగా నాశనం చేయడం తన పరమ కర్తవ్యం అని భావించితే ఎలా? ఇతరులు మనతో ఎలా ప్రవర్తించాలని కోరుకుంటామో మనం ఇతరులతో అలా ప్రవర్తించాలి. సత్యం వాస్తవికత అన్ని దేశాలలో, అన్ని కాలాలలో తమదైన రూపంలో ఉంటాయి. పవిత్రుడైన క్రైస్తవుడికి, పవిత్రుడైన బౌద్ధునికి తేడా ఏ మాత్రం లేదు. హృదయంలో శుద్ధత, జీవనంలో పవిత్రత, అందరిపట్ల ప్రేమ ఇద్దరిలోనూ కనిపిస్తాయి. బౌద్ధుని మంచి పనులకు క్రైస్తవుని మంచి పనులకు తేడా ఏమి లేదు. పాపానికి ప్రాయశ్చితం అన్ని మతాలవారికి ఒకటే. సహృదయత అత్యంత అవసరం, ప్రేమ అనివార్యం. ఈ విధమైన మౌళిక సిద్ధాంతాల కారణంగా అన్ని మతాలు ఒక్కటే. కాని మనిషికి ఈ సత్యాలు పట్టవు. అనుభవానికి, జ్ఞానానికి అతీతమైన అభిప్రాయాలలో మీమాంసలలో చిక్కుకుంటాడు. దీనిలోనించి బయటపడాలి. సత్యం తెలుసుకోవాలి.

*- అఖండజ్యోతి, సెప్టెంబరు 1953*

*అనువాదం : శ్రీ ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

## పండుగలు

**మే 2011**

| | |
|---|---|
| **08-05-2011** | **ఆది శంకరాచార్య జయంతి** |
| **17-05-2011** | **బుద్ధ పూర్ణిమ** |

**జూన్ 2011**

| | |
|---|---|
| **11-06-2011** | **గాయత్రీ జయంతి** |
| **15-06-2011** | **కబీరుదాసు జయంతి** |

మనస్సులో ప్రతికూల భావాలు నిరాశ నిస్పృహలకు కారణమవుతాయి.

వేద మంత్రం

# సదాచరణ

**అథేన్వా చరతి మాయయైష వాచం**
**శుశ్రువాం అఫలమపుష్పామ్ ॥ – (ఋగ్వేదం 10/71/5)**

**భావార్థం :** గారడీవాని ఆవు పాలు ఇవ్వనట్లే, సదాచరణ లేని విద్యావంతుడు ఫలితాన్ని పొందలేడు.

**సందేశం :** మనకు మానవ జీవితం వంటి అమూల్య అవకాశం లభిస్తే దానిని సద్వినియోగం చేసుకుందామని తోచకపోవటం, దానిని పిల్లచేష్టలలోనే వృథా చేసుకోవటం – ఎంత ఆశ్చర్యకరమైన విషయం? వృథా చేసుకోవటమే కాక దురాచారాలతో పాడు చేసుకొని, పాపం మూట కట్టుకొని, నరకానికి ఏర్పాటు చేసుకొని, వీడ్కోలు పల్కుతున్నారు. మనకంటే పశువులు నయం. ఎలా వస్తున్నాయో అలానే వెళ్తున్నాయి. ఇదేనా మనిషి తెలివి? ఇంత జ్ఞానం, విజ్ఞానం, చదువు మొదలైనవన్నీ పొందిన తర్వాత అతడు తన వివేకాన్ని ఉపయోగించుకోలేడా?

ప్రాపంచిక సాఫల్యం ఆధారంగా మనం ఎంత జ్ఞానులమో, చతురులమో, తెలివిగలవారమో చెప్పవచ్చు. మన జీవిత మూల ఉద్దేశ్యం తెలుసుకొని మన స్వరూపం, కర్తవ్యం తెలుసుకొని, వాటి కొరకు లోతుగా ప్రయత్నించడం అవసరం కాదా? మనం ఏమిటి, ఎవరు అని ఆలోచించాలి. మన అస్తిత్వానికి సార్థకతను ఏ విధంగా సిద్ధించుకోగలం? ఈ ఆత్మబోధ లేకపోతే మనుష్య శరీరం కలిగి ఉన్నా నరపశు, నరపిశాచాలవలె నికృష్ట జీవితం గడపవలసి వస్తుంది.

వివేకవంతుడైన ప్రతి వ్యక్తి తన వర్తమాన స్థితిని గురించి విమర్శించుకోవాలి. జీవితాన్ని పతనం నుండి రక్షించుకొని సృష్టికర్త లక్ష్యసాధనకు వినియోగించుకొనేందుకై సాహసాన్ని కూడగట్టుకోవాలి. ఇటువంటి స్ఫురణ అంతఃకరణలో మేల్కొంటే, అంతరాత్మలో ఈశ్వరుని ప్రకాశం ప్రవేశించిందని, భగవంతుని అనుగ్రహం కలిగిందని తెలుసుకోవాలి.

అనేకమంది తమ ఆచరణను సరిచేసుకోరు. దురాచారాలను వదలి సదాచారాలను ఆచరించేందుకు సిద్ధం కారు. పైగా భగవంతుడు తమ కోర్కెలన్నీ తక్షణమే నెరవేర్చాలని ఆశిస్తారు. పూజ, అర్చన, కీర్తన, కర్మకాండ ఈ భావనతోనే చేస్తారు. భగవంతుణ్ణి ప్రశంసించి, లంచం ఇచ్చి ఆయనను ప్రసన్నం చేసుకొని తమ పబ్బం గడుపుకోవచ్చని వారు అనుకుంటారు. **పూజ, ఉపాసనల ఉద్దేశ్యం ఈశ్వరీయ గుణాలను తమ స్మృతిలో ఉంచుకొని తమ మనస్సులో నిర్మలత్వము, వివేకం, పవిత్రతలను తెచ్చుకొనుటే.**

తమ స్థితిననుసరించి ప్రతి వ్యక్తి విశ్వమానవుని, జనతా జనార్ధనుని, భావనాత్మక స్థితిని పెంచుటలో ఎంతో కొంత ఇవ్వగలడు. దీని కొరకు సమయం, శ్రమ, బుద్ధి, ధనం మొదలైనవి ఎంత ఇవ్వగలిగితే మనం భగవంతుని ఇచ్ఛాపూర్తికి అంతగా ప్రయత్నం చేశామని అనుకోవచ్చు. ఇందుకోసం **ఆలోచనలలో, మనోభూమిలో, గుణకర్మలలో, స్వభావంలో, కార్యకలాపాలలో పవిత్రత, ఉదారత, ఉత్కృష్టత, ఆదర్శవాదములను తెచ్చుకోవాలి.** దానితోపాటు మన ప్రతిభ, సామర్థ్యములను లోకకల్యాణము కొరకు వీలైనంత ఎక్కువగా ఉపయోగించడానికి ప్రయత్నం చేయాలి.

★★★

## గాయత్రీ పరివార్ పరిజనులకు విజ్ఞప్తి

*యుగఋషి వేదమూర్తి పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులు అనేకమార్లు తనను తన సాహిత్య మాధ్యమము ద్వారా ఇంటింటికి చేర్చమని విజ్ఞప్తి చేసియున్నారు. యుగపరివర్తన–సత్యయుగ పునరాగమనము ఆనాడే సుసాధ్యం కాగలదు అని సెలవిచ్చారు.*

*పై విజ్ఞప్తిని పురస్కరించుకొని జన్మశతాబ్ది వేడుకల సందర్భముగా మీ, మీ కుటుంబ సభ్యులు మరియు బంధు మిత్రుల వివాహ మరియు జన్మదినముల వేళ, ఒక్కొక్కరు 5గురు యుగశక్తి గాయత్రి పత్రికకు చందాదారులను చేర్పించ మనవి. ఇదియే నిజముగా మనము చెల్లించెడి గురుదక్షిణ. ఈ క్రింది చిరునామాకు మీ చందాను పంపించమనవి. (మీ పేరు చిరునామా పిన్‌కోడ్‌తోసహా ఫోన్ నం. వ్రాసి పంపించగలరు).*

*మా చిరునామా :*
**గాయత్రీ చేతనా కేంద్రము,** *హెచ్.పి.రోడ్, మూసాపేట, అశ్విని హౌస్ ప్రక్కన, హైదరాబాద్ – 500 018.*

**మనో కాలుష్యానికి, అనారోగ్యానికి అవినాభావ సంబంధం ఉన్నది.**

వర్తమాన భారతం

# యుగపరివర్తన కొరకు విశిష్ఠ వ్యక్తులకు ఆహ్వానం

ఈ వ్యాసం అఖండజ్యోతి పత్రిక డిశంబరు 1972 నుంచి సేకరించబడింది. ఈ వ్యాసంలోని విషయాలు ఆనాడు ఎంత ప్రాముఖ్యత వహించాయో ఈనాడు కూడా అంతే ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. మనుష్యులందరు భగవంతుని పుత్రులే. అయినప్పటికీ కొందరిలో కొన్ని ప్రత్యేకతలు, గొప్పదనాలు కనిపిస్తాయి. ఎక్కడెక్కడ గొప్పదనం ఉన్నదో, ఎక్కడెక్కడ విశిష్ఠతలు ఉన్నాయో అక్కడక్కడ తనున్నానని అంటాడు శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో. ఇటువంటి విశిష్ఠమైన వ్యక్తులను ఏడు వర్గములుగా విభజించవచ్చు. 1) భావనాశీలురు (ధర్మం, ఆధ్యాత్మిక క్షేత్రములో) 2) శిక్షణ–సాహిత్యం 3) కళారంగం 4) విజ్ఞానం 5) శాసించే శక్తి (ప్రభుత్వం) 6) సంపన్నులు 7) ప్రతిభావంతులు. ఇటువంటి వారి వల్లనే ఏ సమయంలో అయినా సమాజమునకు ఉపయోగం, లాభం కలిగేది.

**1) భావనాశీలురు (ధర్మం, ఆధ్యాత్మిక క్షేత్రం) : వ్యక్తిత్వాన్ని ఉత్కృష్ఠంగా, జీవితాన్ని ఆదర్శవంతంగా చేసే అంతః ప్రేరణను భావన అని అంటారు.** ధర్మధారణ, ఆధ్యాత్మిక సాధనలన్నీ ఈ ప్రయోజనం కొరకే తయారుచేయబడ్డవి. యుగనిర్మాణయోజన ఈ క్షేత్రమునకు సవ్యమైన ఆలోచన అందించింది. **శీలనిర్మాణమే ధర్మం. తమ శక్తి సామర్థ్యాలను సమాజాన్ని చక్కగా తీర్చిదిద్దటానికి ఉపయోగించడమే ఆధ్యాత్మికత.** ధర్మం, ఆధ్యాత్మికలకు ఇచ్చిన నిర్వచనం ఇదే. భావనలతో ఊహాజగత్తులో విహరించడమేగాక తనకు సమాజ నిర్మాణంలో ఉపయోగపడాలి.

అనాది కాలం నుంచి వస్తున్నదే ధర్మం అని అనాది కాలం నుండి వస్తున్న సంప్రదాయాలను కాపాడుకోవడంలో సమయాన్ని వ్యర్థం చేసుకొనకూడదు. అన్ని ధర్మాలపట్ల సహనం, సమభావం, సమన్వయం కొరకు ప్రయత్నం చేయాలి. తమని తాము ఇలా మలచుకుంటూ విశ్వధర్మానికి ఒక పూసలా తయారవాలి. అలవాటయిన ఆచార వ్యవహారాలు ముఖ్యం కాదు. ధర్మాన్ని జీవింపచేస్తూ దానిని ఉపయోగించుకోగలగాలి. ధర్మక్షేత్రంలో ఉన్నటువంటి ధనసంపత్తిని, జనశక్తిని, దాని ప్రభావమును స్వార్థ ప్రయోజనముల కొరకు ఉపయోగించకూడదు. **భావనా శీలురయిన ప్రజలు తమ అవసరాలను వీలయినంత తగ్గించుకుని, తమ సామర్థ్యములను మానవజాతి ప్రగతి కొరకు ఉపయోగించడమే నిస్సందేహముగా సర్వోత్తమమైన యుగ సాధన అవుతుంది.**

**2) శిక్షణ - సాహిత్యం : మానవుని స్థాయి అతని మనఃస్థితిపై, ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుంది. దీనిని శిక్షణ, సాహిత్యం ద్వారానే వికసింపజేయగలము.** భౌతిక జగత్తును గురించి వివరించే ప్రభుత్వ శిక్షణ కార్యక్రమాల లాభం పొందవలసినదే. కాని భావనాత్మక నవనిర్మాణ శిక్షణా పద్ధతి సామాన్య ప్రజానీకమునకు అందాలి. **దృష్టికోణాన్ని సరిజేయడం, జీవన విద్యను అందించడం, ఈనాటి పరిస్థితులలో వ్యక్తిత్వ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.** సమాజ నిర్మాణం యొక్క అద్భుత ప్రయోగం, సమస్యల నివారణ. విశ్వ పరివార్ సృజన కొరకు అనుకూలమైన వాతావరణ నిర్మాణం జరగాలి. భావనాత్మక నవ నిర్మాణ కార్యక్రమంలో ప్రభుత్వం పాలుపంచుకొనడం అనివార్యం కాదు.

అనేకమంది జాగృతాత్మలు లోకశిక్షణా భూమికను నిర్వహించగలవు. **లోకశిక్షణను చేసే అటువంటి విద్యాలయాలను ప్రతి గ్రామం-పల్లె-నగరాలలో స్థాపించాలి.** సాహితీవేత్తలు ఈ దిశగా రచనలు సాగించాలి. మూర్ఛితులను – జాగృతవంతులుగా ఉత్సాహపరచే పాటలను రచించమని కవులకు చెపుతున్నాం. **కథా రచయితలు-పత్రికారచయితలు-ప్రచురణకర్తలు అందరూ నేటి పరిస్థితులలో క్రాంతికారకమైన అనగా వ్యక్తిత్వమును చక్కగా తీర్చిదిద్దే ఆలోచనలు కలిగించే రచనలు చేసి-ముద్రించాలి.** తద్వారా మనిషి–మనిషికి రచనాత్మకమైన మార్గదర్శనం లభిస్తుంది. విభిన్న భాషలలో వీటిని అనువదించే ప్రతిభావంతులు ముందుకురావాలి.

**3) కళారంగం :** నాటకం, నటన, సంగీతం, చలనచిత్ర నిర్మాణం, చిత్రములు, చలనచిత్రములు మొదలైనవి కళారంగంలోకి వస్తాయి. అన్నిచోట్ల సంగీత విద్యాలయములు స్థాపించబడాలి. **సంగీతంలో ధ్వనులు, వాయిద్యములు రెండూ మితంగానూ ఉండాలి.** ఆ విద్యాలయాలలోని విద్య సంవత్సరముల తరబడి కాక, నెలలలోనే నేర్చుకొనగలిగే సరళమైన

సమస్యలను పరిష్కరించుకునే శక్తి ప్రతి ఒక్కరికి ఉన్నది.

సంగీత పాఠ్యక్రమాలు ఉండాలి. ఈ విద్యాలయముల ద్వారా ప్రచండ ప్రేరణల నందించే గీతములను అందించాలి. సంగీత సమ్మేళనము, గోష్ఠులు జరగాలి. కీర్తనలు ఆలపించుట-ప్రవచనాలు ఇచ్చుట చేపట్టాలి. అభినయంతో కూడిన పాటలు, నాటకములు, నాట్యవేదికలు సర్వత్రా స్థాపించబడాలి. అవి మనస్సును రంజింపచేయగలగాలి. గ్రామఫోన్ రికార్డ్, టేప్‌రికార్డరు, చలనచిత్రరంగంలో నూతన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని సదుపయోగం చేసుకోవాలి. చక్కని చిత్రాల నిర్మాణ క్రమమును కూడా చేపట్టాలి. చలనచిత్రములను చూసేవారి సంఖ్య చాలా అధికంగా ఉంది. **కళారంగం వివేకవంతులైన, దూరదృష్టి కలవారి చేతిలో ఉన్నట్లయితే జనమానసములను సంస్కరించవచ్చును.** రాబోయే రోజులలో ఈ రంగంలో నిశ్చయంగా అనుకున్న మార్పులు జరుగుతాయి.

**4) విజ్ఞానరంగం :** విజ్ఞానరంగంలోని విజయాలు, లాభాలు ఆశ్చర్యజనకమైనవి. అవి మానవుడి సుఖ-సౌకర్యాలలో ఆశ్చర్యకరమైన పరిణామాలను తీసుకొచ్చాయి. వైజ్ఞానిక పరిశోధనలు సృజనాత్మకమైన పరిస్థితులను ఉత్పన్నము చేయాలి. **ఆయుధాల నిర్మాణంలో నిమగ్నమైన మానవ మేథస్సు, ధనము మానవుల లోటుపాట్లు పోగొట్టుటకు-శోకసంతాపాలను నివారించుటలో నియోగించినట్లయితే, ఈ ప్రపంచం స్వర్గంగా మలచబడుతుంది.** సముద్రపు ఉప్పునీటిని తియ్యటి త్రాగునీరుగా మార్చవచ్చును, భూమిలోపల ప్రవహించే తియ్యని నీటినందించే విశాలమైన నదీజలాలను భూమి పైభాగానికి చేర్చవచ్చును. భూమినంతటిని సస్యశ్యామలంగా చేయవచ్చును. వ్యవసాయం, పశుపాలన, ఉద్యానవనాల పెంపకం, అటవీసంపద, స్వాస్థ్య సంవర్ధనము మొదలైన క్షేత్రాలలో విజ్ఞానం సాధించవల్సినది, చేయవల్సినది ఇంకా ఎంతో ఉంది. ఆపదలను ఎదుర్కొనేందుకు క్రొత్త సాధనాలను కనిపెట్టవచ్చును. విజ్ఞానం-అధ్యాత్మము కలిసి వైజ్ఞానిక ఆధ్యాత్మికతగా మారి **'శక్తి యొక్క మూలము జడపదార్థముల అణుసత్తా యొక్క శక్తిలో లేదు, అది చేతనా జగత్తు యొక్క సంకల్పములలో-ఆత్మబలంలో దాగివుంది'** అని నిరూపించేటటువంటి అతి పెద్ద పనులు జరగాలి. విశాలమైన పెద్ద యంత్రాలన్నింటితో పోలిస్తే మానవ శరీరము మరియు మస్తిష్కము, అంత:కరణములు అధిక శక్తివంతమైనవి. తెలియని విషయమును-కళ్ళకు కట్టినట్లుగా చూపించే ఈ కార్యమును రాబోయేరోజులలో విజ్ఞానం-అధ్యాత్మముతో పాటు భుజం, భుజం కలిపి సాధించవల్సివుంది. **వైజ్ఞానిక ఆధ్యాత్మిక వాదమే రాబోయే యుగధర్మం.** వైజ్ఞానిక లాభాలను వాటిలోనే వెచ్చించాలి.

**5) పరిపాలనాశక్తి :** రాజకీయశక్తి ఈ రోజులలో ఎవరి చేతులలో ఉన్నదో రాబోయే రోజులలో ఎవరి చేతుల్లోకి రానున్నదో వారు తమ దేశమని, తమ వారనే భావన విడనాడి, సమస్త విశ్వంలో సుఖశాంతులను సమానంగా నింపే, వాటిని వికసింపజేసే విషయమును గురించి ఆలోచించాలి. సమస్త ప్రపంచమును ఒక కుటుంబంగా చేసే నీతిని ఏర్పరచాలి. యుద్ధాల గూర్చి ఆలోచించుటను వదిలివేయాలి. వర్గభేదం, జాతిభేదం, వర్ణభేదముల వేళ్ళను పెరికివేయాలి. అన్యాయం, పీడన, అపరాధం, లంచం, భ్రష్టాచారములవంటి నిజమైన శత్రువులతో తలపడుట ప్రభుత్వముల పని. రోగం, పేదరికములను నిర్మూలించే దిశలో కూడా పరిపాలనా శక్తి చాలా చెయ్యగలదు. దీనికొరకు ప్రజాస్వామ్య దేశాలలో ఉన్న ఓటరులకు, పౌరులకు యోగ్యులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకొనేవిధంగా వారి బాధ్యతలను అర్థమయ్యేటట్లు వివరించాలి.

**6) సంపన్నులు :** ధనం యొక్క గొప్పతనం సర్వత్రా విదితమే. సంపత్తిలో ఏ దోషం లేదు. అయితే దోషం దాని దురుపయోగంలో ఉంది. వ్యక్తిగత విలాసాలలో, అహంను పెంచుకొనుటలో దాన్ని ఉపయోగించినట్లయితే కూడబెట్టిన ధనం ఇంకా వృద్ధిచెందవచ్చు. దాని లాభం పుత్ర-పౌత్రులకే పరిమితమయ్యే ప్రయత్నం జరుగుతుంది. అటువంటప్పుడు ఆ ధనం మంచిది కాదు. **రాబోయే రోజులలో ఆర్థికమైన సమానత ఆధారంగానే సమాజ వ్యవస్థ ఏర్పడుతుంది. సంపద మీద వ్యక్తులకు కాక, సమాజానికి అధికారం ఉండాలి.** అప్పుడు పేదవారూ కనిపించరు, ధనవంతులూ గోచరించరు. ఈ పరిస్థితులు రానంతవరకు కూడబెట్టిన ధనము లోకమంగళమునకు వెచ్చించే ప్రేరణ ధనవంతులకు ఇవ్వాలి, ప్రభావితులను చెయ్యాలి. **ధనవంతులకు కాలం చెల్లిందని వారికి విశదపరచాలి.** కాలం మారింది, ఇప్పుడు వారుకూడా మారాలని చెప్పాలి. యుగపరివర్తన ప్రవాహంలో సానుకూలత ఉత్పన్నం చేసే పని ఈ ధనవంతుల ధనం చేయాలి. సాహిత్య ప్రచురణ చేయుట, చిత్రముల ముద్రణ-సద్వాక్యములు వ్రాయుట, అభినయ మండలులు ఏర్పరుచుట, రికార్డింగ్-క్యాసెట్లు చేయుట(నేటి తరహా డివిడి, ఆడియో మరియు వీడియో సీడిలు) చిత్రనిర్మాణము అనే ఈ ఐదు ఎటువంటి పనులంటే వాటితో జనమానసములను సంస్కారవంతం గావించవచ్చును.

మానసిక కాలుష్యం సమస్యాపరిష్కార శక్తిని క్షీణింపజేస్తుంది.

ఇందులో సహకారమును అందించే ధనవంతులు అన్నివిధాలా లాభంలోనే ఉంటారు. శ్రేయస్సు పొందుతారు.

**7) ప్రతిభావంతులు :** ప్రతిభ ఒక విశిష్ట మరియు విలక్షణ విభూతి. ప్రతిభవున్నవారిలో **యుక్తాయుక్త విచక్షణ, ఆత్మవికాసం, కఠోరశ్రమ చేయుట వంటి పలు సద్గుణములు ఉంటాయి. సఫలతలు వారి వెనుక-నీడవలె అనుసరిస్తూవుంటాయి.** ఎందుకంటే కఠిన పరిస్థితులనుండి ఎలా బయటపడాలి; వాటిని తేలికగా ఎలా మార్చాలి అనే విషయములు వారికి తెలుసు. **ప్రతిభాశీలురైన వ్యక్తులే సఫలురైన సంతులు, రాజకీయ నాయకులు, సమాజసేవకులు, సాహిత్యకారులు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు, వైజ్ఞానికులు మరియు వ్యాపారులు అవుతారు. ఈ ప్రతిభ తప్పుడు మార్గంలో వెళ్ళినప్పుడు ఆ ప్రతిభే దోపిడి, దొంగతనం, డబ్బును మోసంతో కాజేసే దుస్సాహసభరితమైన పనులను చేస్తుంది.** సృజనాత్మకమైన ప్రతిభయే క్రాంతికారకంగా పరిణమిస్తుంది. యుగనిర్మాణయోజనలోని ప్రతి అంశమును ప్రకాశవంతము గావించుటకు అటువంటి ప్రతిభావంతులే కావాలి. ప్రతిభాశీలమైన తత్త్వము ఎక్కడ వున్నా, ఏ రంగంలో ఉన్నా, ఏ క్షేత్రంలో మెరుస్తున్నా వారందరికీ ఆహ్వానం పలుకుతున్నాం. ఈ ప్రతిభావంతులు తమ శక్తిని నవనిర్మాణ కార్యక్రమంలో వెచ్చించి, వారికీ, వారి ప్రతిభకు మరియు సమస్త ప్రపంచము యొక్క మేలుకోరేవారిగా అవ్వాలనేది మా ఆకాంక్ష.

పైన చెప్పిన సప్తవిభూతుల క్షేత్రంలో ప్రపంచంలోని కోట్లాది మంది ప్రతిభావంతులు వస్తారు. **వారిని ప్రత్యక్ష లేక పరోక్ష రూపంలో ప్రభావితులను చేసే పని అసాధారణమైనది. యుగ నిర్మాణ అభియానం ఇందుకొరకే జరుగుతున్నది. భావికాలంలో ఈ ఏడు రంగాలలోని మహాపురుషులు ఒకటౌతారు. వారంతా కలిసి యుగపరివర్తన సాధిస్తారు.**

ఈ పంక్తులను వ్రాసి నేటికి 38 సంవత్సరముల కంటే ఎక్కువ సమయమే గడిచింది. పరిజనులు, పాఠకులకు ఈ మహా కార్యంలో పాలుపంచుకునేందుకు హృదయపూర్వక ఆహ్వానము. ఇది దేశ జాగరణ మహాయజ్ఞ సమయము. స్వతంత్రం లభించిన 64 సంవత్సరముల తరువాత తిరిగి ఒక ఉద్యమం ఎగసిపడింది. శతాబ్ది సంవత్సర కాలంలో పరిజనులు ముందుకొచ్చి దీనిని వేగవంతం చేయాలి.

*- అఖండజ్యోతి, ఏప్రిల్ 2011*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

## దృశ్య జీవితము యొక్క అదృశ్య మూలములు

*కనిపించే సృష్టి యొక్క మూలం ఎప్పుడూ అదృశ్యంగానే ఉంటుంది. ఆకుల పచ్చదనముతో, సువానస వెదజల్లే రంగురంగుల పూలతో నిండి గాలికి ఊగిసలాడే కొమ్మలతో నిండిన చెట్ల యొక్క వేళ్ళు ఎప్పుడూ భూమి లోపలే ఉంటాయి. పచ్చని చెట్లు అందరి జీవితాలలోనూ ఆనందమును నింపుతాయి. వీటి సమీపానికి వెళ్ళిన వారందరికీ మొక్కల జీవితపు సంగీతము అనుభూతికొస్తుంది.*

*ఈ చెట్లను, మొక్కలను వాటి వేళ్ళ నుండి వేరుచేసినప్పుడు ఈ సత్యము తెలుస్తుంది. వేళ్ళతో సంబంధము తెగిపోగానే వాటి శ్వాస ఆగిపోతుంది. వాటి చేతన, చైతన్యము సమాప్తమౌతాయి. భూమినుండి వేరుపడగానే అంతా అంతమైపోతుంది. ఈ ఆట అంతా వాటి వేరు(వేళ్ళ)లదే. కనిపించకపోయినప్పటికి అదృశ్యంగా ఉన్నప్పటికి కూడా జీవిత రహస్యమంతా వీటియందే ఉంటుంది. మొక్కలకు, చెట్లకు వేళ్ళు ఉన్నట్లే మానవులకు కూడా వేళ్ళు అనగా మూలాలు ఉంటాయి. కనిపించే ఈ జీవితానికి గల రహస్యమంతా అదృశ్యంగా దాగివుంది. కనిపించని సంస్కారాలు, కర్మబీజాలే జీవితము యొక్క వివిధ శుభ-అశుభ సంఘటల ద్వారా ప్రకటీకరించబడతాయి. ఇదేవిధంగా చక్రములు, గ్రంథులు, ఉపత్యికలు బయట ఎక్కడా కనిపించనే కనిపించవు. కానీ వీటి మాధ్యమంగానే మనకు విరాట్ బ్రహ్మాండము యొక్క అదృశ్య సూక్ష్మశక్తి యందు వ్యాప్తమైన ప్రాణము లభిస్తుంది.*

*ఆల్వేయర్‌కామూ తన గ్రంథమందు ఇలా వ్రాశాడు. మానవ జీవితమునందలి ఒకే ఒక మహత్వపూర్ణమైన సమస్య ఏమిటంటే దృశ్య జీవితానికి సంబంధించిన అదృశ్య మూలములను తెలుసుకొనలేకపోవటమే. మానవుని జీవితమునకు ఏవిధమైన ప్రయోజనము కనిపించక పోవటానికి ఇదే కారణము. అంతా వ్యర్థంగానూ, నిష్ప్రయోజనంగానూ ఉంటుంది. జీవన ప్రవాహము యొక్క మూలము పోగొట్టుకోవటం వలన ఈ పరిణామము స్వాభావికమే. సమస్యకు సమాధానము మనిషి తన మూలాన్ని పట్టుకోవాలి. ఇది జరిగినప్పుడే మానవత్వము తిరిగి పల్లవించి పుష్పిస్తుంది.*

మన బలహీనతలే మన శత్రువులు.

# ఆత్మబల సముపార్జనకు సరళమైన ఉపాయం గాయత్రీ సాధన

**కుండలినీ శక్తికి మరో పేరు జీవాగ్ని, 'ఫైర్ ఆఫ్ లైఫ్'.** తేజోవంతమైన, ఆశావాద ఉత్సాహఉల్లాసాలతో, మెరుస్తూ కనిపించే ప్రతీదాన్నీ ఆ అగ్ని ప్రవాహంగానే చెప్పవచ్చు. **ఇదే శక్తి శరీరంలో బలం, ఆరోగ్యం, స్ఫూర్తి, క్రియాశీల రూపాలలో మరియు మస్తిష్కంలో బుద్ధి, దూరదర్శిత, స్మరణశక్తి, తెలివి, ఊహలు మొదలైన సామర్థ్యాల రూపంలో ఉంటుంది. ఆత్మ విశ్వాసం, ప్రగతిశీలత, ధైర్యం, సాహసం మొదలైనవన్నీ ఈ శక్తి యొక్క చమత్కారాలే.**

ఈ జీవాగ్ని శరీరమంతటా ఒక విద్యుత్‌ధార రూపంలో ప్రవహిస్తూంటుంది. కాని నిజానికి ఈ శక్తికి కేంద్రం మూలాధారంలోని సుమేరు పర్వతం దరిదాపుల్లో సర్పాకార విద్యుత్ ప్రవాహంగా చుట్ట చుట్టుకుని ఉంటుంది. దీన్నే మహాసర్పిణి కుండలిని అంటారు. దీనిని విద్యుత్ భ్రమరంగా కూడా పేర్కొంటారు. తీవ్రవేగంతో ప్రవహించే నదులలో అక్కడక్కడా సుడిగుండాలు ఏర్పడుతుంటాయి. ఇలా సుడిగుండం ఏర్పడ్డ చోట నీరు ముందుకు సాగకుండా, అక్కడే వృత్తాకారంలో సుడిలాగా తిరుగుతూ ఉంటుంది. మానవ శరీరమంతటిలో సామాన్య విద్యుత్ ప్రవాహం నాడీమండలం ద్వారా సంచాలితమయినప్పటికీ, అది మూలాధారంలోని సుమేరు దగ్గరకు వెళ్ళి సుడిగుండంగా మారి చక్రాకారంలో తిరుగుతుంటుంది. దీన్ని సర్పిణి స్థితి అంటారు. కుండలిని సర్పాకారంలో ఉంటుందని భావిస్తారు.

నదీ ప్రవాహంలో పుట్టే సుడిగుండాలకు అద్భుత శక్తి ఉంటుంది. వాటిలో ఇరుక్కుంటే పెద్ద పెద్ద ఓడలు కూడా మునిగిపోతాయి. సాధారణ నదీ ప్రవాహం కన్నా 60 రెట్లు ఎక్కువ శక్తి ఈ సుడిగుండాలకు ఉంటుంది. **శరీరంలోని మిగతా చోట్ల విద్యుత్ ప్రవాహం వల్ల కలిగే శక్తి కన్నా కుండలినీ శక్తి కొన్నివేల రెట్లు ఎక్కువ.** ఈ శక్తికి సంబంధించిన విజ్ఞానాన్నీ, స్వరూపాన్నీ సమగ్రంగా తెలుసుకోగలిగితే, ఈ విద్యుత్ ప్రవాహాన్ని ప్రయోగించడం వల్ల కలిగే ఉపయోగాలను తెలుసుకోగలిగితే, నిస్సందేహంగా మనిషి సర్వసమర్థుడిగా, సంపన్నుడిగా, సిద్ధ పురుషుడుగా మారగలడు.

మూలాధారం మొదలుకొని మేరుదండం గుండా బ్రహ్మ రంధ్రం వరకు విస్తరించిన సర్పాకృతమైన కుండలినీ యొక్క మహాసర్పిణీ స్వరూపాన్ని పూర్తిగా చూడవచ్చు. పైకీ కిందకి తిరిగున్న రెండు మహాశక్తివంతమైన కేంద్ర చక్రాలే దాని రెండు ముఖాలు.

మేరుదండం, వెన్నుముక బోలుగా ఉంటుందంటారు. స్థూల దృష్టితో చూస్తే శరీర శాస్త్రం దీని గురించి వేరే విధంగా వర్ణిస్తుంది. శస్త్ర చికిత్స ద్వారా దర్శించబడే రచనాక్రమం వేరుగా ఉంటుంది. కాని మనం సూక్ష్మ ప్రక్రియలో భాగంగా యోగశాస్త్ర పరిధిలోని దివ్యశక్తుల గురించి తెలుసుకోవాలి. యోగశాస్త్రం ప్రకారం మేరుదండంలో ఒక బ్రహ్మనాడి ఉంది, దానిలో 'ఇడ', 'పింగళ' అనే రెండు రక్తనాళాలున్నాయి. నిజానికి వీటిని రక్తనాళాలు అనుకోకూడదు, అవి విద్యుత్ ధారలు. కరెంటు తీగలో ఏ విధంగా అయితే పైన రబ్బరు ఉండి, లోపల రెండు కాపర్ తీగలున్నట్టే ఈ ఇడ, పింగళ ధారలు బ్రహ్మనాడిలో ప్రవహిస్తుంటాయి. వీటికి స్థూలకాయం కానీ అస్థిత్వం కానీ లేవు. శస్త్రచికిత్స ద్వారా ఈ నాడులను చూడలేము. దీన్నంతటినీ సూక్ష్మ విద్యుత్‌ధారల దివ్య సంరచనగా భావించాలి.

పైపైన చూస్తే అందరి మస్తిష్కాలు ఒకేలా ఉంటాయి. కానీ సూక్ష్మంగా పరిశీలిస్తే భూమీ ఆకాశాలంత తేడాలు కనిపిస్తాయి. వాటి ఆధారంగానే వ్యక్తిత్వంలోని ఔన్నత్యము, నీచత్వము తెలుస్తాయి. కుండలినీ విషయంలో కూడా ఈ సూక్ష్మమే వర్తిస్తుంది.

మూలాధారం, సహస్రారం, బ్రహ్మనాడి, ఇడ, పింగళ, వీటిల్లో వేటినీ శస్త్రచికిత్స ద్వారా స్థూలంగా చూడలేము. ఈ దివ్య సంరచనాన్ని చూడలేకపోయినప్పటికీ వాటి అస్తిత్వాన్ని ప్రత్యక్షంగా అనుభవించవచ్చు. మలద్వారము, జననేంద్రియము మధ్యలోని సుమారు నాలుగంగుళాల స్థలంలో ఒక త్రికోణ పరమాణువు ఉంటుంది. శరీరంలోని కణాలన్నీ వృత్తాకారంలో ఉన్నప్పటికీ, ఇదొక్కటే త్రికోణాకారంలో ఉంటుంది. ఇక్కడ ఒక విధమైన శక్తికేంద్రం ఉంది. శరీరంలో ప్రవహించే శక్తి, మెషీన్లలో

**భయం అనేక భ్రాంతులను కలుగజేస్తుంది.**

ఉపయోగపడే శక్తి ప్రవాహ విధానం ఇది. ముందుకు వెళ్ళాక కాస్త వెనక్కి వచ్చి, మళ్ళీ ముందుకు సాగుతుంది, మళ్ళీ కాస్త వెనక్కి వచ్చి, అది ఉద్దేశింపబడ్డ దిక్కులో ముందుకు ప్రయాణిస్తుంది. చెట్టుకు పెనవేసుకున్న లతవలె ఈ త్రికోణ కణంలోని శక్తిగుండంలోని విద్యుత్తు వృత్తాకారంలో పయనిస్తుంది. ఈ సంచారక్రమం సుమారు మూడున్నర చుట్లు చుట్టి ఆ తరువాత ఈ విద్యుద్ధార ఈ విలక్షణగతిని వీడి సామాన్యంగా ప్రవహిస్తుంది.

ఈవిధంగా నిరంతరం మేరుదండం నుండి మస్తిష్కంలోని మధ్య బిందువు (సహస్రార కమలం లేదా బ్రహ్మరంధ్రం) వరకు సాగుతూనే ఉంటుంది. మన పురాణాలలో సహస్రార కమలాన్ని అందంగా, సారగర్భితంగా వర్ణించారు. పాల సముద్రంలోని విష్ణుమూర్తి వేయి పడగల శేషతల్పం మీద నిద్రిస్తూంటాడంటారు. శంఖ, చక్ర, గద పద్మాలను చేతపట్టిన ఆయన కాళ్ళను లక్ష్మీదేవి వొత్తుతూంటుంది. ఆయన చుట్టూ కొందమంది గణాలు నుంచునుంటారు. మస్తిష్కంలో నిండి ఉన్న తెల్లటి, చిక్కటి 'గ్రే మాటర్' పాల సముద్రం. బ్రహ్మరంధ్రంలోని విశిష్ఠమైన పరమాణువులే వేయి పడగలు. మనిషి శరీరంలోని బ్రహ్మసత్తాకి ఇదే కేంద్రం. అందుకే అది విష్ణు నివాసం అన్నారు. ఇక్కడ విష్ణుమూర్తి పడుకుని ఉంటాడు. దాని అర్థం, సాధారణ మానవులందరిలోనూ ఈశ్వరుని అంశ సమానంగానే ఉన్నప్పటికీ, జాగృతంగా కనపడదు. చాలా మంది అసహ్యాకరమైన, ద్వేష, అసూయల, పశుస్థాయి జీవితాన్నే గడుపుతూంటారు.

ఏ విధంగానైతే పృథ్వికి చైతన్యం మరియు క్రియాశక్తి ధృవకేంద్రాల నుండి వస్తుందో, అదేవిధంగా మానవపిండానికి కూడా రెండే అతిసూక్ష్మ శక్తి సంస్థానాలున్నాయి. ఉత్తరధృవం – బ్రహ్మరంధ్రం, మస్తిష్కంలోని సహస్రదళ పద్మం. దక్షిణ ధృవం – సుషుమ్నా సంస్థానం, కుండలినీ కేంద్రం, మూలాధారచక్రం. పురాణాలలో పాలసముద్రం మీద వేయిపడగల శేషతల్పంపై విష్ణుమూర్తి నిద్రిస్తున్నట్టు వర్ణించారు. మస్తిష్కంలో నిండి ఉన్న తెల్లటి, చిక్కటి సరోవరమే ఈ పాల సముద్రం. మిగితా కోశాలలో లాగా సహస్రారచక్రపరమాణు సముదాయం వృత్తాకారంలో ఉండదు. రంపపు పళ్ళ లాంటి కోణాలతో నిండి ఉంటుంది. ఈ పళ్ళనే పాము పడగలంటారు. ఈ ధృవకణంలో చైతన్యకేంద్ర బిందువు ప్రతిష్ఠితమై ఉంటుంది. మస్తిష్కంలోని అనంతమైన చైతన్య మరియు అచేతన భాగాలు ఏ ఇంద్రియజనితమైన మరియు అతీంద్రియ జ్ఞానాన్ని సంపాదిస్తుందో, దానిని ఆధారం ధృవ విష్ణువు లేదా సహస్రార కమలం. ధ్యానం నుండి సమాధి వరకు, ఆత్మచింతన నుండి భక్తి యోగం వరకు కావలసిన ఆధ్యాత్మిక సాధనలు, మనోబలం, ఆత్మబలం మరియు సంకల్ప సిద్ధులకు ఇదే కేంద్రస్థానం.

రెండవదైన దక్షిణ ధృవం, మూలాధారచక్ర సుమేరు సంస్థానం, సుషుమ్న కేంద్రం. ఇది మలమూత్ర సంస్థానాలకు మధ్యన ఉంటుంది. కుండలినీ మహాసర్పిణి ప్రచండ క్రియాశక్తి ఇక్కడే నిద్రిస్తూ ఉంటుంది. ఉత్తర ధృవంలోని మహాసర్పం తన సహచరి అయిన సర్పిణి లేకుండా, మరియు దక్షిణ ధృవ మహాసర్పిణి తన సహచరి మహాసర్పం లేకుండా నిరానంద (ఆనందములేని) మూర్ఛిత జీవితం గడుపుతూంటాయి. అందుకే ప్రపంచంలోని అన్ని గొప్పతనాలు ఉన్నప్పటికీ మనిషి తుచ్ఛమైన జీవనాన్ని గడుపుతూ క్రిమికీటకముల చావు చస్తాడు. చెప్పుకోదగ్గ గొప్పవేమీ సాధించలేకపోతాడు. అందుకు ఒకే కారణం – మనలో ఈ రెండు ధృవాలు మూర్ఛావస్థలో ఉన్నాయి. ఇవి జాగృతమైతే బ్రహ్మాండం వంటి మహాచైతన్యం మనలో కూడా వికసిస్తుంది.

సాధారణంగా **మూత్ర స్థానాన్ని అసహ్యించుకుంటారు, దానిని లెక్కచేయరు. నిజానికి మస్తిష్కంలోని బ్రహ్మరంధ్రంతో సమానమైన సామర్థ్యం కలిగి ఉంటుంది.** అది మన సక్రియతకు కేంద్రం. ముక్కు, చెవులు కూడా మలిన పదార్థాల విసర్జనకు ఉపయోగించే రంధ్రాలైనప్పటికీ వాటిని ఎవరూ మూసుకోరు. మూత్రశయాన్ని కప్పి, భద్రంగా ఉంచడమనే అనాదిగా వచ్చిన ఆచారానికి ఆధారం – ఈ సంస్థానంలో ఏ శక్తి ప్రవాహమైతే పారుతూంటుందో, దాన్ని రక్షించడం. **శరీర కణాలన్నీ వృత్తాకారంలో ఉన్నప్పటికీ రెండు మాత్రమే వేరే ఆకారంలో ఉంటాయి. మొదటిది ఉత్తరధృవమైన బ్రహ్మరంధ్రం. దీని చుట్టు రంపపు పళ్ళ ఆకారం ఉంటుంది. దీన్నే సహస్రార కమలం అంటారు. రెండవది దక్షిణ ధృవం మూలాధారం – త్రికోణకణమైన ఇది ఒకవైపు పర్వతంలా లేదా తాబేలులా ఉబ్బి మరోవైపు చట్టిగా ఉంటుంది. దీనిని సుమేరు లేదా కూర్మం అంటూంటారు.** ఈ రెండింటిమీదనే జీవం ఆధారపడి ఉంటుంది. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలకు, అంతఃకరణ చతుష్టయం యొక్క సప్త ప్రాణాలకు మూలం ఈ రెండు ధృవాలు. ఈ రెండింటి శక్తి, ప్రవృత్తుల వల్లనే మన బాహ్య, అంతరంగ జీవన క్రమం సమర్థవంతంగా సాగుతూంటుంది.

**వైఫల్యం చెందుతామనే భయం ప్రయత్నానికి అడ్డు తగులుతుంది.**

**లోభం, మోహం, క్రోధం, అహంకారం వంటి దుష్ప్రవృత్తుల దోషాల వల్లనే సహస్రారంలో విక్షోభం ఏర్పడి, దాని శక్తి చిందరవందవుతుంది.** మస్తిష్కం చింతలలో మునిగి అంటే ఆత్మచింతనకి, బ్రహ్మశక్తి సంచయానికి తీరిక దొరకదు. అదే విధంగా మూలాధారంలో నిండి ఉన్న ప్రచండ సామర్థ్యాన్ని కార్యశక్తిగా మలుచుకోగలిగితే మనిషి పర్వతాలను అధిరోహించగలడు. సముద్రాన్ని మధించగలడు. **మానవ ప్రాణంలో అనంతమైన క్రియాశక్తి ఉంది, కాని కోరికలు, విషయ వికారాల వల్ల అది తగ్గుతూ ఉంటుంది. ఈ ప్రవాహాన్ని తప్పుదోవ నుండి తప్పించి సరైన దారిలోకి మళ్ళించగలిగితే దేవతలకున్నంతటి సామర్థ్యం మనిషికి కూడా వస్తుంది.**

**పురాణాలలో సముద్రమథనం గురించి చెప్పారు. మానవ శరీరంలోని కుండలినీ శక్తిని ప్రయోగించి, ఉపయోగించుకోవడానికి సూక్ష్మంగా చిత్రీకరించిందే ఈ వర్ణన.** మన మూత్రసంస్థానం ఉప్పు నీటితో నిండిన సముద్రం. దాన్ని అనంతమైన రత్న భాండాగారం అని చెప్పవచ్చు. స్థూల సూక్ష్మ శక్తుల విశాల రత్నరాశి ఇక్కడే దాగి ఉంది. ప్రజాపతి సూచన మీద ఒకసారి సముద్రం మథించబడింది. దేవదానవులంతా మథనానికి నడుం బిగించారు. అసురులు దాన్ని తమవైపుకు లాగేవారు, **అంటే కాముకత వైపుకు ఆకర్షించేవారు,** దేవతలు దాన్ని రచనాత్మక ప్రయోజనాలకు ఉపయోగించాలని ఉవ్విళ్ళురుతూండేవారు. పాలలోంచి వెన్న చిలికినట్టుగా, మథనంగా దీన్ని చిత్రీకరించారు.

పురాణం ప్రకారం, విష్ణుమూర్తి కూర్మావతారమెత్తి ఆధారంగా నిలిస్తే ఆ తాబేలు వీపుపై సుమేరు పర్వతం కవ్వంగా పనిచేసింది. శేషనాగుని దాని చుట్టూ మూడున్నర సార్లు త్రిప్పిదాని ద్వారా మథనాన్ని మొదలుపెట్టారు. మూలాధార చక్రంలోని ఈ తాబేలు, సుమేరువు శక్తి బీజాలు, వీటి చుట్టూ కుండలినీ మూడున్నర చుట్లు తిరిగి ఉంటుంది. నిరంకుశ వాసనల వెలికితీత, అణిచివేత రూపంలో ఈ శక్తి జాగృతపరచదుతుంది. మథనం జరుగుతుంది. అసురులు, దేవతలు ఇద్దరు వారి వారి పక్షాలు బలపరచడానికి మంథన కార్యం మొదలుపెడతారు.

గాయత్రి ఉపాసన దైవీపక్షాన్ని బలపరుస్తుంది, సుసంపన్నం చేస్తుంది. వికసించిన దైవశక్తివల్ల ప్రచండమైన కాముకతను ప్రతిరోధించి, నియంత్రించగలిగితే సముద్ర మథనం వల్ల రత్నాభాండారం చేజిక్కినట్టే. సింహానికి కోపం తెప్పించి, ఉసిగొలిపి తర్వాత దాంతో పోరాడడం ఎలాంటిదో ఈ కాముకతను కూడా ఉసిగొలిపి ఆ తరువాత నిరోధించడం కూడా అలాంటిదే. **ఆత్మబలం ద్వారానే సాహసాన్ని పెంపొందించుకోగలం. ఆత్మబలాన్ని సంపాదించడానికి సరళమైన, అమోఘమైన గురితప్పని ఉపాయం గాయత్రీ సాధన.**

– అఖండజ్యోతి, మే 2005

అనువాదం: శ్రీమతి జయలక్ష్మి

## శ్రీ గాయత్రీ శతకం

49. *సత్య సద్బుద్ధి మాన్యతా సాత్త్వికతను*
*నీదు మనసున దృఢముగ పాదుకొలిపి*
*నిత్య సన్మార్గ గామిగా నిన్ను నిలుపు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– సత్యమైన వాక్కును, సద్బుద్ధిని, గౌరవాన్ని తెచ్చి పెట్టే సత్త్వగుణాన్ని నీ మనసులో పరిపూర్ణంగా ఏర్పరచి నిత్యం సన్మార్గంలో పయనించేలా నిన్ను నడుపుతుంది వేదమాత తనను జపిస్తే.*

50. *సహన సద్భావనోదార సంయమనము*
*భ్రాతృ భావాది సుగుణాల ప్రతినిధిమయి*
*ప్రేమ భావమ్ము నీలోన పెంపుజేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– గాయత్రీ మంత్రమును జపిస్తూ ఉంటే సహనము, సద్భావము, ఉదారము, సంయమనము, సోదర భావము వంటి సుగుణాలకు ప్రతినిధిగా తానుండి సాధకునిలో ప్రేమభావాన్ని పెంచుతుంది వేదమాత.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి ! చదివించండి !!**

**ఇతరులు విమర్శిస్తారనే భయం, నిర్ణయాలను వాయిదా వేయిస్తుంది.**



## బాలల భవితకు బంగారు బాట-19

# ధన్యులైన దొంగలు

"మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ'' అనే ఉపనిషద్ వాక్యాలలో ''అతిథి దేవోభవ'' అన్న వాక్యానికి అంకితం అయిపోయిందా కుటుంబం. అతిథి సేవలతో, అన్న దానాలతో, దీన జనోద్ధరణతో నిరుపేదగా మారిపోయిందా కుటుంబం! 'కూడబెట్టాలి' అన్న ఆలోచనే లేకుండా వచ్చిన దానితో ఆనందంగా, తృప్తిగా జీవిస్తూ ఆధ్యాత్మిక చింతనలో అలరారుతూ ఉన్నదా కుటుంబం. సత్యాసత్యాలతో నిండి ఉన్న ఈ ప్రపంచంలో సత్యానికి మాత్రమే పట్టం కట్టిందా కుటుంబం. అతిథి సేవలోనే భగవంతుని సందర్శించిందా కుటుంబం.

ఆ కుటుంబానికి ఒకానొక రాత్రి అగ్ని పరీక్ష ఎదురయింది. హఠాత్తుగా, అర్థరాత్రి దాటాక, ఆధ్యాత్మిక తత్వవేత్తలైన ఇద్దరు అతిథులు వచ్చారు. ఆకలి బాధతో నీరసించి ఉన్నారు. కుటుంబ యజమాని భార్యను నిద్రలేపి, వారికి భోజనం ఏర్పాటు చేయమన్నాడు. ఆమె ఇంటి పరిస్థితిని చెప్పలేక కంట నీరు పెట్టుకుంది. అర్థరాత్రి సమయం. అందరూ ఆదమరచి నిద్రపోతున్నారు. ప్రక్క ఇంటి నుండి అప్పు తెచ్చుకునే పరిస్థితి కూడా లేదు. ఏం చేయాలో తోచలేదు. త్రాగడానికి మంచి నీరిచ్చి కూర్చోపెట్టాడు. కొడుకుతో సంప్రదించాడు. ఒక ఉపాయం తట్టింది. పై పంచలు భుజాన వేసుకుని చిన్నిపాటి పలుగు తీసుకుని బయటకు నడిచారు. ఒక కిరాణాషాపుకు వెనుక నుండి కన్నం వేశారు. తండ్రి బయట కాపలా కాస్తూ ఉన్నాడు. కుమారుడు లోపలకు వెళ్ళాడు. "ఇద్దరకు మాత్రమే సరిపోయే సరుకులు తీసుకునిరా. రేపు ఉదయమే సేటుకు క్షమాపణ చెప్పి, డబ్బు అందగానే ఇచ్చేద్దాం'' అంటూ కుమారుని హెచ్చరించి పంపించాడు.

కుమారుడి జాగ్రత్తగా కావలసిన సరుకులు మూట కట్టుకున్నాడు. కన్నం దగ్గరకు వచ్చాడు. హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. ఈ కన్నం చూచి మరొకరు ప్రవేశిస్తే లోపల చాలా సరకు ఉంది. పాపం సేటు అమితంగా నష్టపోతాడు ఎలాగైనా ఇప్పుడే అతనికి చెప్పాలి అని నిర్ణయించుకున్నాడు. తండ్రిని మరికొంతసేపు అక్కడే కాపలాగా ఉండుమని ముందువైపుకు వెళ్ళి సేటును నిద్ర లేపాడు.

"అయ్యా! మా తప్పును క్షమించండి. మేము దొంగలం కాదు. అతిథి సేవకు అవసరమై కొద్దిపాటి సరుకులు మాత్రమే దొంగిలించాం. వెనుక భాగాన కన్నం వేశాం. అక్కడ మా నాన్న కాపలా ఉన్నాడు. మా చేతికి డబ్బు అందగానే వడ్డీతో సహా చెల్లిస్తాం. మీరు వెళ్ళి ఆ కన్నం పూడ్చుకోండి. ఇప్పటికే మాకు చాలా ఆలస్యం అయింది. నాతోపాటు వెనక్కు రండి. లేకపోతే మరెవరైనా షాపులో దూరే అవకాశం ఉంది" అంటూ సేటు చెయ్యి పుచ్చుకుని వెనుక భాగానికి బిరాబిరా లాక్కుపోయాడు.

సేటు దిగ్భ్రమలో పడిపోయాడు. నోట మాట రాలేదు. యంత్రంలాగా చూస్తూ ఉండిపోయాడు. తండ్రీ కొడుకులు మరొక్కమారు క్షమాపణలు చెప్పుకుని గబగబా ఇంటికి వెళ్ళిపోయారు. వింత దొంగలయిన ఆ కుటుంబ యజమాని ఎవరో కాదు. లోకప్రసిద్ధిగాంచిన కబీరుదాసు. అతని భార్యా బిడ్డలు కూడా ఆయన అడుగుజాడల్లోనే నడిచారు. ఆనాడు తృప్తిగా అతిథిసేవ చేసి ధన్యతగాంచిందా కుటుంబం.

బాలలూ ! విన్నారు కదా ! తప్పు చేసిన ప్రతివాడూ నేరస్థుడు కాదు.

**కం॥ తప్పులు చేసేవారిని**
**తప్పుగ భావింపవలదు తప్పుల వెనుకన్**
**తప్పని సరియగు వేవో**
**తిప్పలుగలిగుందురనుచు తెలియుము బాలా !**

– మధుర కవయిత్రి, పొన్నూరు హైమవతీ శాస్త్రి

### ఆహ్వానం
### హిందీ నుండి తెలుగు అనువాదకులకు

*యుగఋషి పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యుల జన్మశతాబ్దిని పురస్కరించుకొని వారిచే విరచితమైన ఎంపిక చేసిన పుస్తకాలను, హిందీ నుండి తెలుగు భాషలోనికి అనువదించుటకు నిర్ణయించడమైనది. కావున ఆధ్యాత్మిక గ్రంథములను, సులభ శైలిలో తెలుగులో అనువాదం చేయగల సామర్థ్యమున్న వారికి గాయత్రీ చేతనా కేంద్రము ఆహ్వానము పలుకుచున్నది.*

**సంప్రదించవలసిన ఫోన్ నెం. 9949111175**

**సంతృప్తి కలుగజేసే ఆలోచనల వల్ల ఉత్సాహం, ఉత్తేజం పెల్లుబికి వస్తాయి.**

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం-5వ అధ్యాయం

# ఉదారభక్తి భావనా ప్రకరణం

**కర్మణః సమయస్యాపి కుర్వంతస్తే సమన్వయమ్ ।**
**మహత్వాకాంక్షిణో మోహగ్రస్తాదృశ్యంత ఏవహి ॥ 11**

సమయాన్ని, కర్మలతో సమన్వయం చేయాలి. మోహగ్రస్తమైన వ్యామోహభరితమైన కోరికలుగలవారు, వాటిని అదుపుచేసుకుని, చేసే పనిని, చేయవలసిన సమయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. మహాత్ముల వచనం ప్రకారం రేపు చేయవలసిన పనిని నేడే చేయవలెను. ఈరోజు చేయవలసిన పనిని ఇప్పుడే చేయవలెను. కాలం మనం చేతిలో లేనిది. ఎవరికోసం కాలం ఒక్క క్షణమైనా వేచి ఉండదు. కావున సమయవివేచన, క్రమశిక్షణ చాలా అవసరం. మహాత్ములు కార్యసాఫల్యము మాత్రమే కాకుండా కార్యము యొక్క పారమార్థికతను సామాజిక ప్రయోజనాన్ని ఆశిస్తారు.

**శ్రమశీలా అనేకేచ ప్రయాసపరితత్పరాః ।**
**ప్రాప్యంతే, భిన్నమేతన్న సంతి తే కర్మయోగినః ॥ 12**

శ్రమశీలురైనవారు ఎన్నో ప్రయాసలను ఓర్చుకుంటూ, కార్యములను నిర్వర్తిస్తూ, లౌకికపరమైన ప్రయోజనాన్ని పొందేయత్నం చేస్తూ ఉంటారు. కానీ కర్మయోగులు (కర్మనే యోగముగా ఆచరించేవారు) ఇందుకు భిన్నమైన ఆలోచనతో ప్రవర్తిస్తూ, పరిపూర్ణతను పొందే లక్ష్యంతో, అలౌకికమైన పారమార్థం కొరకు ప్రయత్నిస్తారు. కావున మానవులు ఆ పరమార్థ తత్వాన్ని గ్రహించి, జీవనాన్ని సాగిస్తే తప్పక కర్మయోగులై, ధన్యజీవులవుతారు.

**పురుషార్థానస్తు ప్రోచ్యంతే సంపన్నాః సఫలా అపి ।**
**ప్రాప్యంతే కృతయోగాస్తే, నైవ జీవన సంపదామ్ ॥ 13**

పురుషార్థాలను ఆచరించేవారు (ధర్మ, అర్థ, కామ, మోక్షాలు) సంపన్నులు, సత్ఫల సంపన్నులు అయినప్పటికీ, జీవన సంపదలు (యదార్థ జీవన సాఫల్యము) పొందలేకపోవుచున్నారు. ఆ యోగాన్ని పొందే అవకాశం లేనివారుగా ఉంటున్నారు. అంటే లౌకికపరమైన శ్రేష్టత్వానికి దగ్గర కాగలుగుతున్నారే తప్ప, అలౌకిక తత్వాన్ని అవగాహన చేసుకోలేకపోవుచున్నారు.

**మీయతే సమయస్యాథ, కర్మణస్తు సమన్వయాత్ ।**
**అతిరిక్తం కిమప్యాస్తే తథ్యం గుప్తం సదైవతు ॥ 14**

కాలాన్ని, కర్మయోగాన్ని సమన్వయం చేయగలగడం ఒక యదార్థ యోగం. దానికి అతీతంగా వ్యవహరిస్తున్న తత్వాన్ని నియంత్రించగలిగే రహస్యం (మార్గం) ఒకటి ఉన్నది. దానిని తెల్సుకుని ఆచరించగల్గితే, కాలాన్ని సద్వినియోగం చేస్తే శక్తివంతుడు కావచ్చు. అట్టి జీవన రహస్యం ఏదైనా ఉన్నదా? అని యోచించాలి.

**యద్యేవం కృపయోర్బోధ్యా, రహస్యం నః కృపానిధే ।**
**మూర్ధన్యస్తత్వ వేత్రూణాం, సూత్ర, సూత్రస్య చాలకమ్ ॥15**

"ఓ కృపానిధీ! (పిప్పలాద మహర్షీ!) అటువంటి రహస్య సూక్ష్మాన్ని మాకు వివరించండి. అటువంటి తత్వాన్ని తెల్సిన తత్త్వవేత్తలలో మీరు అగ్రణ్యులు. అట్టి సూత్రాన్ని సూత్ర సారథ్య విధానాన్ని మాకు వివరించండి" అని ప్రార్థించారు.

**బ్రహ్మజ్ఞః పిప్పలాదస్తాం జిజ్ఞాసాం, ధ్యాన పూర్వకమ్**
**శృత్వా ప్రసన్నతాం యాతో విపులాం సంజగాదచ ॥16**

బ్రహ్మతత్వాన్ని తెల్సిన పిప్పలాద మహర్షి, ఇతర ఋషులలోని ఆసక్తిని, తెల్సుకోవాలన్న జిజ్ఞాస, శ్రద్ధలను గమనించి, ఆనంద పరవశుడై, వారి ఉత్సుకతకు తగిన రీతిలో ఇలా స్పందించారు.

**అహం క్రమిక చర్చాయాం, తస్మిన్నేవ ప్రాసంగకే ।**
**ఆసం చర్చితు కామస్తు, సాధు తత్స్మారితుం త్వయా ॥ 17**

అటువంటి అర్థవంతమైన చర్చలో పాల్గొనడం, అట్టి సందర్భాన్ని గురించి యోగించే అవకాశం నాకు మీవల్ల లభించింది. ఆ అపారజ్ఞానవంతమైన విషయాన్ని స్మరించుకునే సందర్భం మీ ద్వారా నాకు ప్రాప్తించింది. మీ ఆసక్తి, ఉత్సాహాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని వివరించే ప్రయత్నం చేస్తాను. సావధానంగా ఆలకించండి.

**అధునా తత్ప్రసంగేతు వక్తుముత్సాహ హేతుమే ।**
**వృద్ధిగతో భవద్భిశ్చ, శ్రవ్య మగ్రే సచిత్తకైః ॥ 18**

ఓ ఋషులారా! ప్రస్తుతం, ఆ ప్రసంగం ద్వారా వృద్ధిని పొందాలన్న మీ తపనను తెల్సుకొన్న నా హృదయం మిక్కిలి ఉత్సాహంతో, మీకు ఆ విషయాన్ని తెలుపవలెనని ఉవ్విళ్ళూరుతున్నది. ఈ విషయాన్ని ఏకాగ్రచిత్తంతో, తదేక

మనస్సు నిరాశ నిస్పృహలతో నిండితే నిర్వీర్యమైపోతారు.

ధ్యానంతో విని తరించగలరు' అని పిప్పలాద మహర్షి తన ప్రసంగాన్ని ఇలా ఆరంభించారు.

**త్రిధాత్మికాయాం విశ్వస్య, వ్యవస్థాయాం ఋషీశ్వరాః ।**
**ప్రకృతీశ్వర జీవానామివ క్షేత్రే చిత్తే రపి ॥ 19**

ఓ ఋషులారా! ఈశ్వరుడు, జీవము, బ్రహ్మ అనే త్రిగుణాత్మక త్రిపథను తెల్సుకోవాలి. విద్వాంసులు దీనిని జ్ఞాన, కర్మ, భక్తిగా పేర్కొన్నారు. విశ్వములో ప్రకృతి, ఈశ్వరుడు, జీవము అనేవి ప్రతి జీవి యొక్క ఆత్మయందు, చిత్తములోను ఉన్నది. వాటిని, వాటి తత్త్వాన్ని ముందుకు తెల్సుకొనగలగాలి.

**త్రిసో నిర్ధారణాః సంతి ప్రగతేస్తు క్రమస్యతాః ।**
**జ్ఞానం కర్మచ భక్తిశ్చ నామ్నోచ్యంతే మనీషిభిః ॥ 20**

చేతనా క్షేత్రంలో ప్రగతి క్రమం మూడు విధాలుగా తెలుపబడినది. అవి జ్ఞానము, కర్మ మరియు భక్తి అని విజ్ఞులు, ప్రాజ్ఞులు పేర్కొంటున్నారు అభ్యాసం చేసేవారికి ఒక్కొక్కటిగా బోధించే ప్రయత్నం చెయ్యాలి.

సాధారణంగా రెండు ప్రక్రియలు గాని పదార్థములు గాని జతచేసినపుడు, మూడవ పదార్థము ఏర్పడుతుంది. రాత్రి పగళ్ళను కలిపే సంధ్య (ప్రభాత సంధ్య, సాయం సంధ్య) అటు పగలుకు, రాత్రికి చెందినది కాదు. ఈ రెండింటి మధ్య వారధిగా నిల్చి మూడవదాని అస్తిత్వాన్ని తెలుపుతున్నది. అదే విధంగా జ్ఞానము, కర్మలను ఆశ్రయించి ఉండేదే జీవము. అటు జ్ఞానానికి, ఇటు కర్మకు వారధిగా ఉంటూ ముక్తి మార్గాన్ని అందించే తృతీయార్థమే జీవము అని విద్వాంసులు తెలుపుతున్నారు.

**ఛాత్రాధ్యయన సంబంధి విషయాణా మివక్రమాత్ ।**
**ఏకమేకం సమాదాయ యోజయేత్ పరివర్ధయేత్ ॥ 21**

శిష్యులు, విద్యార్థులు అధ్యయన విషయంలో క్రమ పద్ధతి ప్రకారం, ప్రకృతి, ఈశ్వరుడు, జీవములను జ్ఞాన, కర్మ, భక్తులతో సమన్వయపరచి సాధన చేసినచో ఒక్కొక్కటిగా విషయ పరిజ్ఞాన మేర్పడి, పరిపూర్ణమైన శక్తిని పొందే అవకాశం కలుగుతుంది. సృష్టికి అతీతంగా చేతనా జగత్తులో సత్, చిత్, ఆనందములతో మూర్తీభవించిన పరబ్రహ్మతత్త్వము ఈ పైన వివరించబడిన జ్ఞాన, కర్మ, భక్తి మార్గములతో సాధ్యపడునని అవగతమగుచున్నవి.

**అధ్యాత్మనస్తు క్షేత్రస్య వికాస క్రమ పద్ధతౌ ।**
**సర్వ ప్రథమమధ్యాత్మ జ్ఞానస్యాస్తి హి భూమికా ॥ 22**

ఆధ్యాత్మిక క్షేత్రము యొక్క వికాసము క్రమక్రమంగా కొనసాగుతుంది. అందులో మొదటి స్థాయి ఆత్మ-జ్ఞానముల నేపథ్యంలో కొనసాగుతుంది. ఇవి లేకున్నచో లౌకిక బంధాల ప్రభావం నుండి విముక్తిని పొందలేడు. కేవలం పుట్టుక, ఉదర పోషణ, సంసారబంధం మొదలైన బంధాల నుండి తేరుకోలేక, బురదలోని పశువులవలే కొట్టుమిట్టాడుతుంటారు. రాగము, బంధము, కుటుంబవాసనలు ప్రతిబంధకాలుగా తయారై మనిషిని వ్యామోహంలో ఉండేటట్లు చేస్తాయి. కావునే ఆత్మజ్ఞానము ప్రథమంగా ప్రముఖ పాత్రను పోషిస్తుంది.

**సా న చేత్ మానవజాద్య భవబంధన పాశితః ।**
**తిరశ్చామివ సంబద్ధః శిశినోదర పరాయణః ॥ 23**

ఆత్మజ్ఞానము తెలియనటువంటి మానవుని బుద్ధి, లౌకిక బంధాలకు బద్ధుడై కేవలము ఇంద్రియ సంతృప్తి, ఉదారపోషణ వంటి విషయాలకే పరిమితమై, పరమార్థ తత్త్వాన్ని తెల్సుకునే ప్రయత్నం చేయలేడు. కేవలం వర్తమానం పట్ల, తన ఉదర పోషణ ఎలా జరుగుతున్నది, ఎలా జరిగితే బాగుంటుందన్న ఆలోచనలకే పరిమితమై **అన్ని జన్మలకన్నా ఉత్తమమైన జన్మ మానవజన్మ. అట్టి జన్మ యొక్క పరమార్థం కేవలం ఉదరపోషణ, ఇంద్రియ సంతృప్తి మాత్రమేనా? అన్న ఆలోచన లేకుండా పోతుంది.** కావున ఆత్మజ్ఞానం, పరమాత్మ (పరార్థ) తత్త్వము తప్పక తెల్సుకొనవలెను.

– స్వేచ్ఛానువాదం : శ్రీ మారెళ్ళ కామరాజు

## గాయత్రీ మాత విగ్రహ ప్రతిష్ఠ

**"గయాన్ త్రాయతి ఇతి గాయత్రి" అంటే ప్రాణముల రక్షించేది గాయత్రీ అని అర్థము**

గాయత్రీ మాత విగ్రహ ప్రతిష్ఠ 2011 మే 6,7 మరియు 8 తేదీలలో, కొత్తపాలెం గ్రామము, చెరుకూరు పోస్టు, పర్చూరు మండలం, ప్రకాశం జిల్లాలో శాంతికుంజ్ హరిద్వార్ ప్రతినిధులతో నిర్వహించబడును. పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు ప్రవచించెదరు. తదుపరి శ్రీ అశ్విని సుబ్బారావు, దక్షిణ భారత ప్రధాన సంచాలకులు గారి ప్రజ్ఞా పురాణ కథా కార్యక్రమం. అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.

07.05.2011 కలశయాత్ర మరియు దీపయజ్ఞం

08.05.2011 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞం

**ఇట్లు**
**గాయత్రీ ప్రజ్ఞా పీఠము**, కొత్త పాలెం.

**భౌతిక స్వరూపం లేని మనో కాలుష్యం భౌతిక భారంగా అనుభూతిలోకి వస్తుంది.**

## యుగ గీత-9 : రెండవ అధ్యాయం-సాంఖ్య యోగము

# ప్రజ్ఞావంతుని నిజమైన గుర్తింపు - స్థిత ప్రజ్ఞత్వం

మనీషులు, మహాపురుషులు కరువవుతున్న ఈ కాలంలో, ఆసక్తిని వీడిన స్థితప్రజ్ఞునికి ఆధ్యాత్మిక ప్రగతి ఎలా కలుగుతుందో, పరమాత్మ సాక్షాత్కారం ఎలా కలుగుతుందో తెలుసుకున్నాము. **స్థిరబుద్ధికలవాడే స్థితప్రజ్ఞుడు. ఆసక్తి తొలగితేనే ప్రజ్ఞ జాగృతమవుతుంది.** ఇంద్రియాలు బలీయమైనవి, అవి బుద్ధిమంతులనే తీవ్రంగా భ్రమింపజేసి దారితప్పిస్తాయి కాబట్టి సామాన్య జనులు మరింత జాగురూకులై ఉండాలని శ్రీ కృష్ణుడు అర్జునుడికి వివరిస్తాడు. అందుకే **'తాని సర్వాణి సంయమ్య'**, సంయమనం కలిగి ఉండాలని పదేపదే చెప్తాడు. అలా లేని పక్షంలో విషయాలపట్ల కోరికలు ఉత్పన్నమవుతాయి. **అవి తీరకపోతే కోపం, దానివల్ల మూర్ఖత్వం కలిగి, స్మృతి నశించి, జ్ఞానం కోల్పోయి చివరికి సాధకుడు పతనమవుతాడు.** వీటన్నిటినీ దాటి, స్వయం ఉన్నతిని సాధించే జీవిత శీర్షాసనాన్ని ఆధ్యాత్మికత అంటారు. **ఈ ప్రక్రియ ద్వారా మనిషి అంతఃకరణలో ప్రసన్నతను నింపుకుని దుఃఖ నివృత్తిని పొంది స్థితప్రజ్ఞుడవుతాడు.**

శ్రీ భగవానువాచ -

**ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽను విధీయతే**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి** **2.67**

నీటిపై తేలుతున్న నావను గాలి నెట్టివేస్తుంది. అలాగే ఇంద్రియార్థములయందు సంచరిస్తున్న ఇంద్రియాలలో మనస్సు ఏ ఒక్క ఇంద్రియంతో కూడినా ఆ ఒక్క ఇంద్రియమే మనోనిగ్రహం లేని మనుజుని బుద్ధిని అనగా విచక్షణా శక్తిని హరించివేస్తుంది.

ఉపనిషత్ శైలిలో చెప్పబడిన భావగర్భిత శ్లోకం ఇది. నీటి మీద తేలుతున్న నావ, గాలి రాగానే ఆ గాలి వాటానికి ఎక్కడ్నించి తేలిపోతుంది. నావకి తెర కట్టడంలో ఉద్దేశ్యమే శ్రమ లేకుండా గాలి సహాయంతో నావ లక్ష్యాన్ని చేరడం. భగవంతుడు మనస్సును నావతో పోల్చారు. ఏ ఒక్క ఇంద్రియం వల్ల ప్రభావితమైనా, దాని వశంలోఉన్నా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తూ దాని ప్రవాహంలో కొట్టుకుపోతూంటుంది. **యోగభ్రష్టుడైన పురుషుని ఈ ఒక్క ఇంద్రియం బుద్ధిని దుర్బుద్ధిగా మార్చగలదు.** ఆసక్తితో పుట్టిన వాసన అంతటి ప్రబలమైనది, ఆ ఒక్క ఇంద్రియమే చాలు మనిషిని పతనంవైపుకు తోయడానికి. వాణి చాలు, రుచి చాలు, కర్మేంద్రియాల వల్ల, జ్ఞానేంద్రియాల వల్ల కలిగే వాసనలే చాలు. **ఇంద్రియాలు మనస్సుతో కలిస్తే వాటి జట్టు బలపడి బుద్ధి పనిచేయడం మానేస్తుంది. బుద్ధి దుర్బుద్ధిగా మారి అనర్థాలకు దారితీస్తుంది. ఇలా కాకుండా, బుద్ధికి అనుకూలంగా మనస్సు, మనస్సుకు అనుకూలంగా ఇంద్రియాలు ఉంటే జీవన వ్యవహారం అంతా ఆత్మకు అనుకూలంగా మారుతుంది.** "స్థితప్రజ్ఞ దర్శనం" అనే పుస్తకంలో సంత్ వినోభా ఇలా రాసారు, "నావ సాగరాన్ని దాటించినట్లే బుద్ధి ఈ భవసాగరాన్ని దాటించేదే. కానీ ఆ బుద్ధి గనుక మనస్సు యొక్క ఆధీనంలోకి వస్తే, ఆ నావే మనల్ని ముంచేస్తుంది. రౌతు చేతిలో కళ్ళెము, కళ్ళెం ఆధీనంలో గుర్రం ఉన్నంతవరకు తప్పకుండా గమ్యం చేరుకుంటాం; కాని అలా కాకుండా, గుర్రం ఆధీనంలో కళ్ళెం, కళ్ళెం చేతిలో రౌతు ఉంటే మాత్రం గమ్యం చేరుకునే ఆశ వదులుకోవలసిందే.'' కఠోపనిషత్తులో కూడా ఇదే విషయం ప్రస్తావించబడింది. ఆ విషయాన్నే శ్రీకృష్ణుడు పడవని ఉపయోగించి వివరించారు. బుద్ధి అనే పడవ మనస్సనే గాలివాటానికి లోనైతే నదిని దాటే ప్రసక్తే లేదు. బుద్ధిని మనస్సు వశపరుచుకుంటే దానికున్న శక్తి నశించిపోయి వ్యక్తిని ముంచి వేస్తుంది.

సంత్ జ్ఞానేశ్వర్ ఇలా అన్నారు. **'ప్రాప్తే హి పురుషేం । ఇంద్రియేం లాలిలీం కవతికేం । తరీ ఆక్రమిలా జాణ దుఃఖేం । సంసారికేం ॥'** వారు చెప్పిన ఈ మరాఠీ సూక్తికి భావం – 'అన్నీ సాధించిన మనిషైనా సరే, కుతూహలంతో ఇంద్రియాలను లాలిస్తే ప్రాపంచిక దుఃఖాలు అతన్ని ఆక్రమించినట్టే అని తెలుసుకో'. ఒకవేళ మనిషి చాలా వరకు స్థితప్రజ్ఞుడైపోయినా సరే సావధానంగానే ఉండాలి. మనిషి ఎట్టి పరిస్థితుల్లోనూ మనస్సును విచ్చలవిడిగా వదిలేయకూడదనేది ఇక్కడ భావార్థం. **'మనా గూజరే తూజ్ హే ప్రాప్త్ ఝాలే, తరి అంతరీ పాహిజే యత్న కేలే'** అన్నారు సమర్థ గురు రామదాసు. అంటే. 'ఓ మనసా ! నీకు దక్కాల్సిందంతా దక్కింది. నీవు నీ లక్ష్యాన్ని చేరుకున్నావు. అయినా అజాగ్రత్తగా ఉండకు. రహస్యం చేజిక్కాక కూడా చేతులు ముడుచుకునే ఉండు, తెరిచిపెట్టకు'. గీతాకారుడు ఎంత సరళంగా ఈ విషయాన్ని సమర్థించారో.

గీతాచార్యుడు ముఖ్యంగా జ్ఞానులను జాగ్రత్తగా ఉండమన్నారు. కాస్త అలుసిచ్చినా, అజాగ్రత్తగా ఉన్నా తడబడినట్టే. సంయమనాన్ని ఆధారం చేసుకుని స్థితప్రజ్ఞుడైన వ్యక్తి

**పరిసరాలలోని కాలుష్యాన్ని తగ్గించడానికి కృషి చేయాలి.**

పొరపాటునైనా అహంకారం, వాసన, తృష్ణలకు లోనయితే ఇక గమ్యం కోల్పోయినట్టే. స్థితప్రజ్ఞుని నరనరాల్లో, ఆచరణలో సంయమ వ్యవహారం ఉండాలని గీతచార్యుడు ఆదేశిస్తున్నాడు. ఈ విషయాన్ని బలపరుస్తూ తరువాతి శ్లోకంలో

**తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా 2.68**

కనుక ఓ అర్జున ! ఇంద్రియాలను ఇంద్రియార్థముల నుండి అన్ని విధాలుగా పూర్తిగా నిగ్రహించిన పురుషుని బుద్ధి స్థిరంగా ఉంటుంది. ఈ విధంగానే సిద్ధ పురుషుని బుద్ధి స్థిరపడుతుంది.

గురుసత్తా స్పష్టంగా అర్జునుడ్ని నిర్దేశిస్తోంది - ఎట్టి పరిస్థితుల్లోనూ సంయమనం విషయంలో వెసులుబాటు ఉండదు. 'తస్మాత్' అంటే అర్థం 'అందువలన'.

లోకసేవ చేయవలసినప్పుడు ఎప్పటికైనా చరిత్రలో నైష్ఠికత ఉండాలని ప్రతిపాదించబడింది. 1988 డిసెంబర్ అఖండ జ్యోతిలో పరమపూజ్య గురుదేవులు ఇలా వ్రాశారు. "లోకసేవకులు కరువైన కాలంలో ప్రగతి క్షీణిస్తుంది. మనుషుల్లో ఉత్తమమైన భావనలు, ఉదాత్త దృష్టికోణం ఎప్పటికీ అవసరమే. ఉన్నత అధికారపదవులు కలవారైనా, పనులలో కౌశలం కలవారైనా సరే, ఈ పనిని స్వార్థపరులు, విలాసవంతులు, తుచ్ఛులు ఎప్పటికీ చేయలేరు. అలా అని **అత్యుత్తమ సేవాభావం ఉన్నంత మాత్రాన సరిపోదు, ఎలాంటి పరీక్షలలోనైనా గెలవగలిగేంతటి నిష్ఠ, ఆదర్శం కూడా ఉండాలి."**

ఆదర్శప్రాయుడైన పాత్రగా అర్జునుడ్ని స్వీకరించి, అతనిని నిజమైన స్థితప్రజ్ఞ లోకసేవకునిగా తీర్చిదిద్దాలని గీతకారుడు శిక్షణ ఇస్తున్నాడు. సామాన్యులతో పోలిస్తే స్థితప్రజ్ఞుల జీవనచర్యలోని వైవిధ్యం, వారి దృష్టికోణం ఎలా ఉంటుందని శ్రీకృష్ణుడు చెప్తున్నాడు.

**యా నిశా సర్వాభూతానాం తస్యాం జాగర్తి సంయమీ**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః 2.69**

నిత్య జ్ఞాన స్వరూప పరమానంద ప్రాప్తియందు స్థితప్రజ్ఞుడైన యోగి మేల్కొని ఉంటాడు. అది ఇతర ప్రాణులన్నింటికి రాత్రితో సమానం. నశ్వరమైన ప్రాపంచిక సుఖప్రాప్తికై ప్రాకులాడుచూ ప్రాణులన్నీ మేల్కొని ఉంటాయి. అది పరమాత్మతత్త్వము నెరిగిన మునికి (మనన శీలునికి) రాత్రితో సమానం.

**మామూలుగా ఇంద్రియభోగాలతో, విశ్రాంతిగా జీవితం గడిపే సామాన్యులు, ఆత్మసంయమ వ్యక్తి అనుభవించే పూర్ణానందాన్నీ, సుఖాన్నీ ఊహించలేరు.** పై శ్లోకంలో 'మునేః' అన్న పదం మునికి, మననశీలుడైన వ్యక్తికి ఉపయోగించారు. అతను కామోద్వేగాల కోలాహల ప్రపంచానికి అతీతుడైనవాడు. యోగి జీవనక్రమాన్ని పూర్తిగా పల్టీకొట్టిస్తాడని శ్రీకృష్ణుడు స్పష్టంగా చెప్తున్నాడు. సాంసారిక జనులకన్నా ఉన్నత స్థాయిలో బ్రతుకుతాడు; అంతరంగం నుండి బహిరంగానికి ప్రయాణిస్తాడు. యోగి గురించి అత్యద్భుతంగా విశదీకరించిన శ్లోకం ఇక్కడ స్థితప్రజ్ఞుని గురించి చెపుతూ చాలా సరిగ్గా పొందుపరచబడింది. **మూడు రకాలైన వ్యక్తులు రాత్రిళ్ళు మేల్కొని ఉంటారని రామకృష్ణ పరమహంస చెపుతుండేవారు - భోగి, యోగి, రోగి.** భోగులు, రోగులు రాత్రుళ్ళెందుకు మేల్కొని ఉంటారనేది అందరికీ తెలిసిన విషయమే. **స్థితప్రజ్ఞుడైనవాడు రాత్రి పడుకుని కూడా మేల్కొని ఉంటాడు. జాగురూకతతో ఉంటాడు.**

పై శ్లోకాన్ని సూక్ష్మంగా అర్థం చేసుకుంటేనే స్థితప్రజ్ఞుని విషయంలో న్యాయం చేసినవారమవుతాము. స్థితప్రజ్ఞుని జీవనదృష్టికీ, మిగతా భోగలాలసుల దృష్టికీ చాలా తేడా ఉంటుంది. రెండు సమానంతర రేఖలు ఏ విధంగా ఒక్కచోట కూడా కలవవో, అదే విధంగా ఈ ఇద్దరి జీవన దృష్టికోణాలు కలవనే కలవవు.

**సామాన్య వ్యక్తి పొట్ట కోసం భోజనం చేస్తాడు. కాని స్థితప్రజ్ఞునికి అది ఒక యజ్ఞం. ఆదిశంకరాచార్యుల వారు చెప్పినట్టు 'ఓషధ రూపం' గా ఆహారాన్ని గ్రహిస్తాడు.** ఇక్కడ భోగవృత్తి లేదు. సామాన్యులు నిద్రపోతారు కాని, వారి ప్రతి రాత్రి జ్ఞానక్షయకు కారణమవుతుంది. **కాని స్థితప్రజ్ఞుని నిద్ర దోషం లేకుండా, ప్రమాదరహితంగా, నిస్స్వప్నమైనది అయి ఉంటుంది.** అతని నిద్ర కొత్త ఆలోచనలను పోషిస్తుంది. కొత్త కల్పనలు ఉదయిస్తాయి. అతని నిద్ర తమోగుణము కాక సత్వగుణ యుక్తమై ఉంటుంది. స్థితప్రజ్ఞుని జీవన వ్యవహారం స్వాభావికంగా, సరళంగా ఉంటుంది. **'సామాన్యులు ఫలం పట్ల జాగరూకులై ఉంటారు, కర్తవ్యం విషయంలో నిద్రిస్తారు. కాని స్థితప్రజ్ఞుడు కేవలం ఫలం విషయంలో నిద్రపోయి, కర్తవ్యం విషయంలో జాగరూకులై ఉంటారు'.**

అత్యద్భుతమైన ఈ రెండవ అధ్యాయాన్ని ముగింపుకు తెస్తూ యోగీశ్వరుడు చెప్పిన తరువాతి శ్లోకం మరింత సారగర్భితమైనది.

**అపూర్యమాణమచలప్రతిష్ఠం**
**సముద్రమాపః ప్రవిశంతి యత్వత్**
**తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే**
**స శాంతిమాప్నోతి న కామకామీ 2.70**

సమస్త దిశల నుండి పొంగి ప్రవహించుచు వచ్చి చేరిన నదులన్నీ పరిపూర్ణమైన సముద్రమును ఏ మాత్రమూ

మన అనారోగ్యానికి మన ఆలోచనలే మూలకారణం.

చలింపజేయకుండానే అందులో లీనమగును. అలాగే సమస్త భోగములు కూడా స్థితప్రజ్ఞునియందు ఎట్టి వికారములను కలిగించకుండానే వానిలో లీనమగును. అట్టి పురుషుడే పరమశాంతిని పొందును. భోగాసక్తుడు శాంతిని పొందజాలడు.

నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. కాని సముద్రం మాత్రం ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటుంది. అసహనంతో, తీవ్ర ప్రవాహం కలిగిన నదులు ప్రశాంత సముద్రంలో లయమై పోతాయి. సముద్రం ఎప్పటికీ నిశ్చలమైనది, పరిపూర్ణమైనది, ప్రతిష్ఠితమైనది. భగవంతుడు స్థితప్రజ్ఞుడ్ని గురించి కూడా ఇలాగే పోల్చి చెప్పాడు. ఎటువంటి వికారాలను కలిగించకుండా, అలజడి రేపకుండా ఇంద్రియభోగాలు ఏ మహాపురుషునిలో అయితే లీనమైపోతామో, అతనిలో ఏ వికృతిని కలగజేయలేవో, అటువంటి పురుషుడే పూర్ణపురుషుడై ఆత్మశాంతిని పొందుతాడు. అసలు ఇటువంటి వ్యక్తిత్వాన్ని వికసింపచేసుకోవడం కుదురుతుందా? కుదురుతుంది. పరమపూజ్య గురుదేవుల జీవితంలో మనం ఇది చూడగలం. ఈ సందర్భమై గురువుగారు ఒక కథ చెప్పేవారు.

దూర్వాస మహర్షికి భోజన ప్రసాదం తీసుకునివెళ్ళవలసి వచ్చినప్పుడు అరుంధతి వశిష్ఠ మహర్షి దగ్గరకు వెళ్ళి, 'స్వామి! నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. మేమెలా వెళ్ళాలి?' అని అడిగింది. దానికి జవాబుగా ఆయన, 'నీవు నది వద్దకు వెళ్ళి, వశిష్ఠుడు బ్రహ్మచారైతే నీవు నాకు దారినివ్వు అని చెప్పు' అన్నారు. అరుంధతికి ఏమి అర్థం కాలేదు. మాకింతమంది పిల్లలున్నారు, మరీయన బ్రహ్మచారెలా అవుతారు అనుకుంది. అయినా ఋషివాణి మిథ్య కాలేదు అని నమ్మి వెళ్ళింది. వెళ్ళి నదితో అదే చెప్పింది. నది దారినిచ్చింది. ఆవిడ వెళ్ళి దూర్వాసునికి భోజనం పెట్టింది. భోజనం అయ్యాక దూర్వాస మహర్షిని అడిగింది. 'అయ్యా! నదీ ప్రవాహం ఇంకా ఉధృతంగానే ఉంది, తిరిగి ఎలా వెళ్ళాలి?' దానికి జవాబుగా ఆయన, 'దూర్వాసుడే గనక నిరాహారి అయితే దారివ్వు' అని నదిని అడగమన్నాడు. ఇప్పుడే కదా భోంచేసింది, మరి నిరాహారి ఎలా అయినట్లు. అయినా ఋషివాక్కు అని నమ్మి మళ్ళీ వెళ్ళింది, దారి దొరికింది. తిరిగి వెళ్ళాక మర్మం అర్థం అయ్యిందా లేదా అని వశిష్ఠ బ్రహ్మర్షి అరుంధతిని అడిగారు. మా ఇంద్రియాలు భోగలాలసాలు కావు. అంతఃకరణం నిర్మలమైనది. దేహ కార్యకలాపాలు నడుస్తూ ఉంటాయి. అంతరాత్మ మాత్రం తన విశుద్ధరూపాన్ని ధరించే ఉంటుంది. అందుకే నా విషయంలో బ్రహ్మచర్యం గురించి చెప్పాను. ఇంద్రియ తృప్తి కోసం భోజనం చేస్తూంటే దూర్వాసుడు ఆహారిగా పిలవబడేవాడు. ఈశ్వరీయ చింతనలో లీనమైన ఋషులకు, మహా పురుషులకు ఇంద్రియ భోగాలు అంటవు. ఇంద్రియాలు తృప్తిపడిననాడు, మనిషిలోని సముద్రంలో అలజడి రేగినట్టే. ఆత్మరూప సముద్రంలో ఎటువంటి అలజడి రేగకపోతే ఇంద్రియ భోగాలను అనుభవించినట్టు కనిపించినా అనుభవించినట్లే.

స్థితప్రజ్ఞుడి దగ్గరకు ప్రపంచంలోని ఎన్నో విషయాలొస్తుంటాయి; సముద్రము ఏ విధంగానైతే అన్ని వైపుల నుండి వచ్చే నీటిని తనలోకి గ్రహించి లయం చేసుకుంటుందో, అదేవిధంగా స్థితప్రజ్ఞుడు విషయ భోగాలన్నింటినీ తన స్వరూపంలో లయం చేసుకుంటాడు.

ఈ శ్లోకానికి సంబంధించిన మరింత వివరణ, రెండవ అధ్యాయంలోని చివరి శ్లోకాల వ్యాఖ్యానం వచ్చే సంచికలో చదువుదాము.

*– అఖండజ్యోతి, జనవరి 2000*
*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

## శ్రమ సాధన

*ఇంగ్లీషు విద్వాంసుడు ఇలియట్ తన శ్రమ సాధనల ద్వారా ఇంగ్లీషు భాషతోపాటు అనేక ప్రపంచ భాషల గురించి కోట్లాది మంది ప్రజలు ప్రేరణ, ప్రకాశం పొందటానికి తన ఆలోచనలను అభిప్రాయాలను ఆనాటి లోకానికి అందజేశారు. ఇలియట్ ఇంగ్లాండులో సంపన్నుడైన వ్యాపారవేత్త కుమారుడు. కాని వ్యాపారవేత్తగా కావడానికి బదులు సాహిత్యంపై మక్కువ పెంచుకున్నాడు. ఈయన తండ్రిని నొప్పించక, భిన్నాభిప్రాయాలు గల తండ్రిని ఏ సహాయం కోరక, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ, విశ్వ విద్యాలయంలో చదువుకునేవాడు. వేదాంత శాస్త్రం వీరి ప్రియమైన పాఠ్యాంశం. దీనికొరకు ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా దేశాలకు వెళ్ళాడు. 30 సంవత్సరములు వచ్చేంతవరకు విద్యార్థి జీవితం గడిపాడు. తరువాత సాహిత్యసేవ ప్రారంభించారు. ఇంగ్లీషులో కావ్య సాహిత్యం, వేదాంతం ఆ రోజులలో చాలా జటిలంగా ఉండేవి. ఇలియట్ రచించిన ఉచ్చశ్రేణి సాహిత్యం వల్ల విశ్వసాహిత్య దారిద్ర్యమే నిర్మూలించబడినదని చెప్పవచ్చు.*

*శ్రమ సాధనకు కాలపరిమితిగాని, ముహూర్తబలం వంటివి ఏమీ లేవు. ఏ క్షణంలో ప్రేరణ లభిస్తుందో ఆ క్షణంలోనే ప్రారంభించి కాళిదాసులుగా మారిపోవచ్చు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

**ఆశ, విశ్వాసంతో నిండిన ఆలోచనలు రోగాలను నయం చేస్తాయి.**

సూర్య విజ్ఞానం - 8

# విరాట్ ప్రాణ పురుషుడు - సవితా దేవత

విశ్వరచనలో రెండు ప్రధాన తత్వాలు ఉన్నాయి. ఒకటి ప్రాణం, రెండవది భూతములు (ఆకాశము, వాయువు, అగ్ని, జలం, పృథ్వి) ఈ రెండు తత్వములు ఎక్కడ కలసి ఉంటే అక్కడ క్రియాశీలమైన జీవనం దర్శనమవుతుంది. ప్రాణం లేకుండా భూతములు స్పందించలేవు. **అందువల్ల భౌతిక జగత్తులో ఎక్కడ జీవన తత్వములున్నా అక్కడ ప్రాణం తప్పనిసరిగా ఉంటుంది. దీనినే గాయత్రి అని ఋషులు పేర్కొన్నారు.**

మనిషిలో భూతములు, ప్రాణములనబడే రెండు శక్తులు స్పష్టంగా కనిపిస్తాయి. చిన్నతనంలో శరీరం కొంచెం మోతాదులో పంచ భౌతిక పదార్థాలను, ప్రాణాన్ని కలిగి ఉంటుంది. దానికి తేజస్సు, శక్తి తక్కువగానే ఉంటాయి. కాని శరీరం నెమ్మది నెమ్మదిగా వికసించినపుడు ప్రాణశక్తి కూడా పెరుగుతూ శరీరం క్రియాశీలమవుతుంది (active). **బాల్యం, యౌవ్వనం, వృద్ధాప్యం - గాయత్రి యొక్క సమిధలుగా చెప్పబడ్డాయి.** ఎందుకంటే ప్రాణశక్తి వీనిలో జ్వలిస్తూ ఉంటుంది. తరువాత రెండు తత్వాలు విడివిడిగా పోతాయి అంటే ప్రాణం పోతుంది, పంచ తత్వాలతో తయారయిన శరీరం పడిపోతుంది. ఇటువంటి శరీరాన్ని గురించి ఋగ్వేదంలో ఇలా ఉన్నది. **యద్ గాయత్రి అది గాయత్రి మహితం** (1-164-23) అంటే **పంచ భూతాలతో తయారయిన శరీరం మర్త్య గాయత్రి.** దీనిలో ఆలోచన, అర్థం చేసుకొనడం, సుఖదుఃఖముల అనుభవం; క్షోభ, బాధ వ్యక్తం చేసే శక్తి ప్రాణమే. **శరీరానికి స్పందనలు ఏమి ఉండవు. అందువల్ల సుఖదుఃఖములే గాక జీవితం యొక్క కదలికలు. పరివర్తనలు, ఉన్నతి దిగజారడానికి అన్నింటికి కారణం ప్రాణమే.**

సూక్ష్మంగా ఆలోచిస్తే శరీరంలో విభిన్న క్షేత్రములలో క్రియాశీలంగా ఉన్న ప్రాణము కూడా భౌతికమే. కిరణములు, జ్యోతి, అగ్నివంటి వాటిని స్థూల తత్వములనవచ్చు. వీటిని **నియంత్రించి ప్రేరేపించగలిగేది మనోమయ శక్తి.** దీని యొక్క ఇచ్ఛ, సంకల్ప శక్తులతో శరీరం పనిచేస్తుంది. అందువల్ల గాయత్రి అనే ఒక శబ్దంలో పంచ ప్రాణములు, మానసిక శక్తి సమగ్ర రూపంలో వస్తాయి. **శాస్త్రములలో గాయత్రి భౌతిక కష్టముల నుండి, ప్రపంచం నుండి ముక్తి ఇచ్చే విద్యగా చెప్పబడింది.**

గాయత్రి ఎక్కడ నుండి ఉద్భవించింది? ఈ ప్రశ్నకు ఉపనిషత్కారులు ఇలా అంటారు.

**"దేవాత్మ శక్తిం స్వగుణే నిగూఢః"** దేవమాయ లేక ఇంద్రశక్తి అయిన గాయత్రి అనేక రూపాలలో వికసిస్తుంది. ఈ దేవశక్తి లేదా ఇంద్రుడు ఎవరు?

**'తస్య దృశ్య శతాదశః' సూర్యుడే ఆ ఇంద్రుడు.** ఈయనకి వేలాది కిరణాలు ఉన్నాయి. ఒక్కొక్క కిరణం ఒక్కొక్క రూపం. ఈ కిరణాలు ప్రాణశక్తితో నిండి ఉన్నాయి. **సూర్యుని త్రయి విద్య అని కూడా చెప్పబడింది.** అంటే ఒక శరీరం. ప్రాణమయ, మనోమయ రూపంలో పృథ్విపై గాయత్రి ఉన్నట్లే సూర్యుడు కూడా స్వయంగా గాయత్రియే. ఈ విధంగా సూర్యుని ఒక విరాట్ పురుషునిగా ఒక పెద్ద విశాలమైన క్షేత్రంలో క్రియాశీలంగా ఉంటాడు. ఆలోచనలు చేస్తాడు. దండన పురస్కారాలు ఇవ్వగలడు. ఆయన హర్షం, శోకం, సంతోషం, బాధ వ్యక్తపరిస్తే అందులో ఆశ్చర్యపడవలసినది ఏమి లేదు.

ఇప్పటివరకు శ్రద్ధ గురించి చెప్పుకుంటున్నాము. ఎవరి హృదయాలలో వైరాగ్యం శ్రద్ధ ఉత్పన్నమవుతాయో అతను - నిఖిల ఆకాశంలో లేక ఏదైనా లోకంలో గాయత్రి నామం గల ఒక దేవి కూర్చొని ఉన్నది. ఆమె మన ఆంతరిక భావములను అనుసరించి వరదానాలు ఇస్తుంది అని భావించవచ్చు. కాని ఇప్పుడు ఈ విరాట్ పురుషుని జ్ఞానంతో ఈ విధంగా అర్థం చేసుకొనవచ్చు. ఎవరి హృదయంలో భావ విహ్వలత లేదో అతను కూడా ఈ విరాట్ పురుషునితో సంబంధం పెట్టుకుని పెద్ద పవర్ స్టేషన్ నుంచి చిన్న ట్రాన్స్‌ఫార్మరుకు శక్తి వచ్చినట్లే శక్తిని పొంది లాభాన్వితుడు కావచ్చు.

**మనిషి ఒక చిన్న గాయత్రి. సూర్యుడు ఒక విరాట్ గాయత్రి. చిన్న గాయత్రి విరాట్ గాయత్రితో జోడింపబడితే అతనికి కూడా విరాట్ గాయత్రి శక్తి సంపన్నతలు అందుబాటులోనికి వస్తాయి.** తండ్రి ధనవంతుడయితే అతని కుమారుడు కూడా తండ్రివలె ధనవంతుడవుతాడు. ఏదైనా కొనగలడు. అదే విధంగా గాయత్రి యొక్క విరాట్ స్వరూపంతో జోడింపబడితే మనిషి కూడా సూర్యుని సామర్థ్యం పొందుతాడు. **దీనినే సిద్ధి అంటారు.**

సూర్యునికి నిజంగా మనిషి వలె సంవేదనలు, భావములు ఉంటాయా అనేది తెలుసుకోవలసిన విషయం. సూర్య కిరణాలను వర్ణిస్తూ అవి మూడు రంగుల సమ్మిశ్రణము అని చెప్తారు. (సూర్య

**అంతర్గత ఘర్షణ అనారోగ్యాన్ని కలుగజేస్తుంది.**

కిరణాలలో ఏడు రంగులు మిశ్రమమైనా ముఖ్యమైనవి మూడు రంగులు) స్పెక్ట్రోమీటరు ద్వారా వీటిని వేరుచెయ్యవచ్చు. మనిషికి సూర్యునికి సామ్యం ఉంటే మనిషి శరీరంలో కూడా ఈ రంగులు కనిపించాలి. కాని రక్తం రంగు ఎర్రగా ఉంటుంది. మరి సామ్యం ఎక్కడుంది?

సైన్సు చదువుకున్నవారికి రక్తం రంగు ఎరుపు కాదని తెలియవచ్చు. అనేక తత్వాల కలయిక వల్ల రక్తం ఎర్రగా కనిపిస్తుంది. రక్తం యొక్క కోశాణువులు పసుపు పచ్చగా ఉంటాయి. పూర్వం రోజులలో మనిషి చనిపోయిడా లేదా అని తెలుసుకునేందుకు "యురేనాయిన్" అనే ఇంజక్షన్ ఇచ్చేవారు. మనిషి చనిపోకపోతే రక్త ప్రసరణ జరుగుతూ ఉంటే చర్మం పసుపు పచ్చగా, ఆకుపచ్చగా మారేది. మృత్యువు సంభవిస్తే ఇంజక్షన్ ప్రభావం కనిపించదు. ఎరుపు రంగు బాగా ఉండటం వల్ల నీలం రంగు కనిపించదు. లేకపోతే శరీరంలోని మూడు రకాలైన శక్తుల స్పష్టమైన విశ్లేషణ జరిగేది.

చూడటానికి నిర్వికారంగా కనిపించే సూర్యుని విషయంలో మొట్టమొదట క్రిష్టాఫ్ షైనర్ అనే ఆయన ఒక సందేశాన్ని వారి మతాధ్యక్షుడికి ఇచ్చారు. అందులో సూర్య కళంకాల వివరణ ఉన్నది. కాని ఆనాటి పుస్తకాలలో అలా లేదు. అందువలన షైనర్ తిట్లు తినవలసి వచ్చింది. కాని అదృష్టవశాత్తు ఆ రోజులలో గెలీలియో తయారు చేసిన టెలిస్కోప్ సహాయంతో సూర్య కళంకాల ఉనికిని ధృడపరచడం జరిగింది. సూర్యునిలో విభిన్న వర్ణముల కళంకములు కనిపించాయి. వీటి కదలికలు కనిపించాయి. కొన్ని విస్ఫోటన చెంది చుట్టుప్రక్కల వ్యాపిస్తున్నాయి. కొన్ని నశించి పోతున్నాయి. కొన్ని మెరుస్తున్నాయి. కొన్ని విడిపోతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతున్నదో వైజ్ఞానికులు తెలుసుకోలేకపోయారు. కాని నెమ్మది నెమ్మదిగా ఇవన్నీ వేడెక్కిన వాయువుల తుఫానులని, మనుష్యుని వలె ఇచ్ఛాశక్తితో ప్రభావితం అవుతాయని తెలిసింది.

సూర్యుని యొక్క ప్రకాశంతో కూడిన ధగధగలను (Flare) ఫ్లేర్ అంటారు. ఆ సమయంలో సర్పిలాకారంగా పరిగెత్తే అలలను ఫిలమెంట్ అంటారు. ఇప్పుడు దీనికి సంబంధించిన అనేక ఆశ్చర్యకరమైన తథ్యములు లభ్యం కావడం వల్ల సూర్యుని లోపల సంవేదలు ఉన్నాయనే ఆలోచనకు బలం చేకూరింది. అంటే ఆలోచనల ప్రభావం మనిషిపై పడుతున్నట్లే ఈ గందరగోళం అంతా సూర్యుని క్షోభ, ప్రసన్నత, క్రోధం వంటి భావ సంవేదనల ప్రభావమే. అదే విధంగా సూర్యునిలోని ఈ మార్పులు ప్రకృతిపై చాలా ప్రభావాన్ని చూపిస్తాయి. ఇలాంటి పరిస్థితిలో సూర్యుని నుండి వెలుబడిన సూక్ష్మ కణాలు, కిరణాలు వేగంగా ప్రయాణించి కోట్లాది మైళ్ళవరకు తమ ప్రభావాన్ని చూపుతాయి. అక్కడ ఉన్న అయస్కాంత క్షేత్రాన్ని మధిస్తాయి. అలాంటి సమయంలో దిక్సూచిలోని సూది కూడా కంపిస్తుంది.

దీని ప్రభావం పృథ్విపై పడినట్లయితే హిమపాతం, వడగళ్ళు, అనావృష్టి, వరదలు, గాలివానలు, ఉష్ణోగ్రతలలో తీవ్రమైన మార్పులు మొదలైనవి కనబడతాయి. అంతేగాక గడచిన రోజులలో ఈ ప్రభావం రాజనైతిక, ఆర్థిక, సామాజిక, భావనాత్మక రంగాలలో కూడా కనుపించాయి. కొద్ది మాసముల క్రిందట సైంటిఫిక్ అమెరికన్ అనే పత్రికలో ప్రకటించిన విజ్ఞానవేత్త ఎమ్. మిమ ఫోర్ట్ రీసర్చి పేపర్ - "సన్ స్పాట్ అండ్ ఇట్స్ ఎఫెక్స్" అనుసారం సూర్యుని నుండి ఒక రకమైన తుఫాను బయలుదేరింది. దాని ప్రభావం పృథ్విపై తీవ్రంగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు తీవ్రంగా కలుగుతాయి. వాయు దుర్ఘటనలు సంఖ్య పెరుగుతుంది. మనిషి పడే సంకటాలు ఎక్కువవుతాయి.

ఇలాంటి ఆపదలు 6-7 సంవత్సరాల వరకు జరగవచ్చు. సూక్ష్మదర్శుల ప్రకారం ఈ గడబిడలు అన్ని సూర్యుని మనోమయ క్రాంతి అని, దీనివల్ల భూలోకంలో భయంకరమైన మార్పులు రావచ్చని వీరి అభిమతము. కాని భారతీయ సంస్కృతికి దాని వల్ల సంరక్షణే లభిస్తుంది. దీని అభ్యుత్థానాని మూలంలో ఆ విరాట్ పురుషుని ఇచ్ఛయే పనిచేస్తున్నది. దీనిని వైజ్ఞానిక దృష్టిలో తీసుకొనవచ్చు లేదా శ్రద్ధా పూర్వకంగా స్వీకరించవచ్చు. సూర్య దేవుని ఈ మనోమయ ప్రకృతియే గాక అతని ప్రాణశక్తి, పాంచ భౌతిక ప్రకృతి కూడా ఉన్నది.

**మానవ శరీరంలో ఎన్ని ధాతువులు, రసాయన తత్వాలు ఉన్నాయో అవి అన్నీ సూర్యునిలో కూడా ఉన్నాయి.** మనిషి శరీరం సూర్యుని, పృథ్వితత్వముల సమ్మిశ్రముతో తయారయింది. అందువల్ల శారీరిక మానసిక దృష్టిలో పృథ్వి యొక్క ప్రభావమే గాక సూర్యుని యొక్క ప్రచండ ప్రభావం ఉంటుంది. మనం శరీరం గురించి ఆలోచించినట్లయితే అన్నం జలం మొదలైన పృథ్వి యొక్క రసముల సేవన వలన మన శరీరంలో ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్, ఇనుము, గంధకం, సోడియం. కాల్షియం మొదలైన తత్వములు ఉత్పన్నమవుతాయి. అక్కడ ఈ తత్వముల కన్నా సూక్ష్మమైన ప్రాణశక్తులు పనిచేస్తున్నాయి. ప్రాణం వలనే మన శరీరంలో స్పందనలు ఉంటాయి. తుమ్మడం, ఆవలించడం, నిద్ర, కనురెప్పలు మూయడం తెరవడం, శరీరంలోని సమస్త క్రియాకలాపాలు ప్రాణశక్తి ద్వారానే సాధ్యం. ఈ ప్రాణాన్ని పాంచ భౌతిక ప్రకృతిని సూర్య విజ్ఞానం ద్వారా సులభంగా అర్థం

**అపసవ్య ఆలోచనలే మనోమాలిన్యం.**

చేసుకొనవచ్చు. మనుష్యునివలె ప్రాణం పంచ భౌతిక ప్రకృతి, మనోమయ క్రియాశీలత సూర్యునిలో కూడా కనిపిస్తాయి.

మనం ఆయనను ఆత్మరూపంలో, "గాయత్రి" రూపంలో ధ్యాన ధారణలు చేస్తాము. కావాలనుకుంటే ఆయనను ఒక విరాట్ పురుషునిగా కూడా ధ్యానం చెయ్యవచ్చు. మనిషిలో 'అహం' భావం ఎలా ఉంటుందో అలాగే సూర్యునిలో కూడా 'అహం భావం ఉండటం సంభవమే. ఒక తేజస్వి మహాత్ముని వరదానములతో ఆరోగ్యం, పుత్ర లాభం, ధన లాభం మొదలైనవి ప్రాప్తించుకోవచ్చు. ఈ ప్రాణ పురుష గాయత్రి తత్వ సవితా దేవత నుంచి ఇంకా ఎక్కువ ఆశీర్వాదములు స్నేహం ఇతోధికంగా ప్రాప్తించుకోవచ్చు. కండిషన్ ఒక్కటే. పిల్లవాడు తండ్రిని ప్రసన్నం చేసుకుని ఆయన స్నేహాన్ని. లాభాన్ని ఎలా పొందుతాడో అదేవిధంగా **సూర్య భగవానుని మన శ్రద్ధ, నిష్ఠలతో ప్రభావితం చేయగలగాలి.**

ఇప్పుడు ఈ రహస్యం ఇంకాస్త విస్తృతం కానున్నది. ఏ రోజున ఈ విద్యకు వైజ్ఞానిక వివేచన ఇవ్వబడుతుందో అప్పుడు ఉపాసన, శ్రద్ధ, భక్తి మొదలైన వాటి రహస్యాలు ప్రకటీకరింప బడతాయి. సిద్ధులు కూడా వాస్తవమేనని అర్థమవుతుంది.

కంటికి కనిపించే, కంటికి కనిపించని సూర్యుని క్రియాక్షేత్రం పృథ్వినేగాక ఇతర గ్రహనక్షత్రాల వరకు వ్యాపించి ఉన్నది. మనిషి కన్ను ఇదంతా చూడలేదు. కాని అతను సూర్యదేవునితో జోడింపబడితే కేవలం పృథ్విపై జరిగే పరివర్తనలే గాక, బ్రహ్మాండం యొక్క రహస్యాలను తెలుసుకోగలడు, జరుగుతున్న మార్పులలో పాలు పంచుకొనగలడు.

వేల సంవత్సరాల క్రిందటే ప్రాణవిద్యను గురించి ఆచార్యులు ఇలా చెప్పారు.

**తేజసావై గాయత్రి ప్రథమం త్రిరాత్రం దా ధార**
**పదైద్వితీయంక్షరై స్తృతీయం తేజో వై గాయత్రి**
**జ్యోతి వై గాయత్రి ఛందసామ్**

**అర్థం :** గాయత్రి ఒక విధమైన తేజస్సు. ప్రకాశం ఊష్మ (వేడి) రూపంలో విశ్వానికి మూలం. సూర్యుడు గాయత్రి తేజస్సు యొక్క అతిపెద్ద భాండాగారం. విశ్వ నిర్మాణంలో అన్నింటికన్నా అతిపెద్ద మూలం ఇదే.

ఈ విధంగా గాయత్రిని మనుష్య జీవనంలో ప్రాదుర్భావ స్వరూపంలో వ్యక్తం చేస్తూ శాస్త్రకారులు ఇలా అన్నారు. **"మన ఏవ సవితా". అంటే మనస్సే సవితా. మనస్సు ఎప్పుడయితే సూర్యదేవునితో తాదాప్యం చెందుతుందో సూర్యదేవుని భర్గశక్తి మనిషి అంతఃకరణలో ప్రవేశించి ప్రకృతిలో సామరస్యాన్ని** స్థాపిస్తుంది. అంటే అంతఃకరణ లోపభూయిష్టంగా ఉంటే సవరిస్తుంది. దీనినే చెడు సంస్కారాలను వదిలించుకోవడం, సుసంస్కారాల వికాసం అని అంటారు. సూర్యుని ధ్యానం చేసే సమయంలో మనస్సులోని అగ్ని, సూర్యుని రూపం ఒక్కటై తాదాప్య స్థితి ఏర్పడుతుంది. దీనిని గాయత్రి సిద్ధి అనవచ్చు. ఎప్పుడయితే గాయత్రి యొక్క సంపూర్ణ అనుభూతి, శక్తి లభ్యమవుతుందో ఆ వ్యక్తి ఆ శక్తి సామర్థ్యాలతో ప్రకృతిలో కావలసిన పరివర్తనం తేగలుగుతాడు.

*– అఖండజ్యోతి, జూన్ 1993*

## కదిలించే కళ్లు

47 సీ॥ *సాహిత్య రచనతో స్వాధ్యాయమున్ బెంచి*
*ధార్మిక సంస్థలో దనర వలయు*
*సూక్ష్మదేహులైన సుజనుల కోర్కెల*
*తీర్చుచున్ నీవింక దిరుగవలయు*
*రుషుల బీజాల నారోపణ సేయుచున్*
*వారిపరంపరన్ కూర్చవలయు*
*పూర్ణాహుతి పనులు పూర్తిగా జరిపించి*
*మధురకు మహిమిచ్చి మనగ వలయు ॥*

తే॥ అని తెలియజేయుచు గురువులానతిడగ
మాటనిలుపుకొనుచు నేను మసలు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

48 సీ॥ *పైన దెలిపినట్టి పనులన్ని సేయగా*
*మర్మంబు నెరుగుచు మసలవలయు*
*మూడు పనుల గూర్చి ముచ్చటించుకొరకు*
*ముమ్మారు చర్చలో మునుగవలయు*
*నాల్గవ యాత్రలో నా కార్యభారాన్ని*
*నీదు భుజములపైన నిలుపవలయు*
*అత్యంత విస్తార మతికఠోరంబైన*
*కార్యభారమునెత్తి కదలవలయు ॥*

తే॥ అని తెలియజేయుచు గురువులానతిడగ
మాటనిలుపుకొనుచు నేను మసలు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

*రచన–మధుర కవయిత్రి*
*పొన్నూరు హైమవతీ శాస్త్రి*

మనో కాలుష్యం వినాశకరం.

జన్మశతాబ్ది ప్రత్యేకం

# 21 వ శతాబ్దం ఉజ్జ్వల భవిష్యత్తు తీసుకువస్తున్నది

21వ శతాబ్దం సుఖప్రదమైన సంఘటనలు జరిగే సమయం. 20వ శతాబ్దములో వసతులు తక్కువ. విపత్కర పరిస్థితులు ఎక్కువగా ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులు విప్లవాత్మకమైన మార్పుకు నాంది పలికాయి. ఉదయము, సాయంకాలము సంధికాలాలు ఏర్పడినట్లే ఈ కాలం 20వ శతాబ్దం మరియు 21వ శతాబ్దం యొక్క యుగసంధి. దీనికికూడ ఒక కాల అవధి ఉన్నది. యుగసంధి యొక్క ఈ మధ్యకాలములో అనేక సూక్ష్మ, స్థూల స్థాయిలలో విప్లవాత్మకమైన మార్పులు ఆరంభమైనాయి. ఆరిపోతున్న దీపము ఎక్కువ ప్రకాశవంతముగా వెలుగుతుంది. చనిపోయే ముందు చీమలకు రెక్కలొస్తాయి. మరణము ఆసన్నమైనపుడు శ్వాసగతి తీవ్రమవుతుంది. పగలు, రాత్రి కలిసే సంధ్యాకాలాలు అనేక చిత్రవిచిత్రాలను తీసుకుని వస్తాయి. ప్రసవవేదనపడేటపుడు రెండు పరస్పర విరుద్ధమైన విచిత్రములు కనిపిస్తాయి. ఒకవైపు బాధతో కూడిన మూలుగులు వినిపిస్తూ వుంటే, రెండవవైపు సంతానము కలగబోతోంది అనే ప్రసన్నత, సంతోషము కుటుంబసభ్యులలో కనిపిస్తుంది. యుగసంధి మధ్యకాలంలో జరిగే గందరగోళము సముద్రములోని ఆటుపోటుల వంటివి. ఈ పరిస్థితులలో ఒకవైపు అవాంఛనీయత ఓడిపోతున్న జూదరివలె ఒకటికి రెట్టింపు పందెమును కాస్తూ కనిపిస్తుంది. రెండవ వైపు సృజనాత్మక పరిస్థితులు మరియు ప్రయత్నాలు కూడ తమ పూర్తి శక్తిని ఉపయోగించి పందెములో గెలవడానికి తీవ్ర ప్రయత్నములు చేస్తూ కనిపిస్తాయి.

యుగసంధి యొక్క ఈ ఐతిహాసిక కాలములో ఒకవైపు సృజనాత్మక ప్రయత్నాలు ప్రభుత్వ, ఆర్థిక, వైజ్ఞానిక క్షేత్రాలలో జరుగుతూ కనిపిస్తూవుంటే, ఇంకొకవైపు ఆధ్యాత్మిక శక్తులు కూడ తపఃసాధనలకు ఎంత తీవ్రమైన వేగానిస్తున్నాయంటే మళ్ళీ భగీరథుడు, దధీచి, హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు మొదలగువారు చేసిన గొప్ప గొప్ప విప్లవాత్మక ప్రయత్నాలన్నీ పునరావృత్తమగుట గోచరిస్తున్నది. లోకసేవకుల ఒక పెద్ద సమూహాము ఈరోజులలోనే కార్యక్షేత్రములో దిగి రాముని ఎలుగుబంట్లు కోతులవలె, కృష్ణుని గోపబాలకుల వలె, బుద్ధుని పరివ్రాజకుల వలె మరియు గాంధీగారి సత్యాగ్రహుల వలె ఒక అభినవపాత్రను పోషించి నవనిర్మాణాన్ని గావిస్తు కనిపిస్తాయి. ఇవన్నీ అదృశ్య ప్రయత్నాల యొక్క ఫలితమని అని అర్థము చేసుకోవాలి.

ఎదురుగా కనిపించే సంఘటనలు, జరిగే క్రియాకలాపాలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నప్పటికి వాటి మూలములు అదృశ్యజగత్తు నుండి ఆరంభమౌతాయి. బ్రతికి వుండటానికి శ్వాస తీసుకొనుట చాలా ప్రధానము. ఇది అన్నము, జలము కంటే అధిక మహత్వపూర్ణమైనది. ఆకాశములో అదృశ్యముగా వుంటుంది. ఋతువులలో మార్పు ప్రాణుల క్రియాకలాపాలను అసాధారణముగా ప్రభావితము చేస్తుంది. మనిషి చేసే మంచి చెడు పనులు అదృశ్య జగత్తు యొక్క వాతావరణాన్ని ప్రభావితము చేస్తాయి. అక్కడనుండి అవి కావలసిన పరిస్థితులను ఏర్పరుచుకొని దృశ్యజగత్తులోకి దిగుతాయి. వీటి ప్రతిఫలమే సుఖదుఃఖాల రూపంలో కనిపిస్తుంది. ఈరోజులలో ఉన్న పరిస్థితులకి జరుగుతున్న సంఘటనలే కారణము కాక అదృశ్యజగత్తు యొక్క ప్రచండప్రవాహాలు కూడా ఎక్కువగానే కారణమౌతున్నాయి.

## యుగపరివర్తనా కాలము ఇదే ఎందుకు?

'యుగము' అనే మాటకు కాలము అని అర్థము. ఆ కాలఖండము యొక్క ప్రముఖ క్రియాకలాపాలు లేక విశేషతలనుబట్టి వాటిని యుగ శబ్దముతో కలిపి సంబోధించుట సాధారణముగా జరుగుతున్నది. ఉదాహరణకు ఋషియుగము, సామంతయుగము, రాతియుగము మొదలయినవి. ఈ సందర్భములోనే వర్తమానకాలమును విజ్ఞానయుగము, యాంత్రిక యుగము అని అంటూ ఉంటారు. ఒక మతానుసారము యుగము కోట్ల సంవత్సరాల కాలానికి వర్తిస్తుంది. దీని ప్రకారము మానవీయసభ్యత మొదలై కోట్లకోట్ల సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడున్న కలియుగము సమాప్తమవ్వాలంటే ఇంకా లక్షల సంవత్సరాలు గడవాలి. కానీ లభించిన లిఖితప్రమాణాల ఆధారముగా చరిత్రకారులు, పురాతత్త్వవేత్తల ప్రకారము మానవుని వికాసక్రమము ఎక్కువకంటే ఎక్కువ 19 లక్షల సంవత్సరాల క్రిందట జరిగినది. ఆధునిక, సాంకేతిక పద్ధతుల ద్వారా ఇది నిరూపించబడుతున్నది.

శ్రీమద్భాగవతము, మహాభారతము, లింగపురాణము మరియు మనుస్మృతి మొదలైన గ్రంథాలలో యుగాన్ని లెక్కించే

మనస్సును ప్రశాంతంగా ఉంచుకోగలిగితే, ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు.

పద్ధతి ఏమిటంటే సూర్యుని పరిభ్రమణ కాలమును నాలుగు పెద్ద భాగాలుగా విభజించి నాలుగు దేవయుగముల కల్పన చేయబడినది. ఒక దేవయుగపు అవధి 4,32,000 సంవత్సరాలుగా చెప్పబడినది. దీని ఆధారముగా ధర్మగ్రంథాలలో వివరింపబడిన కలికాలము యొక్క సమాప్తి నేటి కాలానికి సరిగ్గా సరిపోతోంది.

సహజంగానే సుస్పష్టమైన లెక్కలు లేకపోవటం, పరస్పర విరోధముగావుండే కాలగణన వలన ప్రజలు పైన చెప్పిన ఈ కాలగణనను నమ్మలేకపోవచ్చును. అందువల్ల ఇక్కడ 'యుగము' అనే పదము విశిష్ట లక్షణాలు గల కాలముగా చెప్పబడుతున్నది. యుగనిర్మాణయోజన - ఈ భావమునే తెలియజేస్తున్నది. కాలము మారబోతున్నది అనే భావన ఇందులో స్పష్టముగా ప్రతిబింబిస్తున్నది.

ఈనాటి కాలము పరివర్తనాకాలము- మారుతున్న కాలము. యుగ పరివర్తనములు ఇదివరకు కూడా చాలా జరిగాయి. వీటిని సామూహికంగా వికసించబడిన చేతన అని కూడా అనవచ్చును. అదుపుతప్పిన ఈ పరిస్థితులను సవరించడానికి, ప్రాణచైతన్యము గల ప్రతిభలను కూడగట్టి యుగధర్మము పాటించడానికి ప్రేరణను ఇస్తుంది. ఈ రోజులలో ఆ మహాకాలుని యొక్క ప్రబలప్రేరణలు యుగపరివర్తనకొరకు నూతన పరిస్థితులను నిర్మించడము చూడవచ్చును. చేయవలసినది ఏమిటంటే సమయమును గుర్తించి మన ప్రయత్నాలన్నీ కూడా దీనికొరకు వినియోగించగలగాలి. పేరుతెచ్చుకొనుటకు మరియు అవతార ప్రక్రియతో కలసి పనిచేయుటకు ఇదే సరియైన సమయము.

## 21వ శతాబ్దము - భవిష్యవేత్తల అభిప్రాయము

యుగపరివర్తన సమయం ఆసన్నమైనదని ప్రపంచములోని ఉచ్చకోటి ఆలోచనాశీలురు, మనీషులు, జ్యోతిర్విద్వాంసులు, భవిష్యద్రష్టలు అందరూ ఏకకంఠంతో చెప్తున్నారు. ఈనాడు మనం ఈ యుగసంధికాలములో జీవిస్తున్నాము. యుగపరివర్తన గురించి భవిష్యవాణులన్నీకూడా నాల్గింటిమీద ఆధారపడి చెప్పబడినవి. 1. దివ్యదృష్టి సంపన్న వ్యక్తిత్వముల అంతఃస్ఫురణ మీద ఆధారపడిన వాక్కులు. 2. జ్యోతిర్విజ్ఞానము ఆధారపడిన భవిష్య వాణులు. 3. పురాణాలు, ఖురాన్, బైబిల్, గీత, రామాయణము, శ్రీమద్భాగవతము మొదలగు ధర్మగ్రంథములలో వర్ణించబడిన భవిష్యత్కథనములు. 4. నేటి పరిస్థితుల ఆధారంగా వైజ్ఞానిక ఉపకరణముల ద్వారా విషయసేకరణ చేసి వాటిని విశ్లేషించి-వాటి ఆధారముగా చెప్పినది.

శాంతికుంజ్‌ను యుగచేతనయొక్క గంగోత్రి అనవచ్చు. సూర్యుడు మొట్టమొదట తూర్పుదిశ వైపు బయలుదేరి అచ్చటినుండి ముందుముందుకు వెళుతూ సమస్త ప్రపంచానికి వెలుగు-నందిస్తాడు. గంగోత్రినుండి ప్రారంభమైన ధార బెంగాలు చేరుకునేసరికి సహస్రధారలుగా పరిణతి చెంది కనిపిస్తుంది. ఈ యుగసాధనయొక్క శుభారంభము శాంతికుంజ్ నుండి మొదలైనప్పటికీ, దాని ప్రభావం దేశముయొక్క మూలమూలలకు మరియు ప్రపంచముయొక్క ప్రతి ప్రాంతానికి విస్తరించడము చూడవచ్చు. ఈ ప్రభావము యుగపరివర్తనయొక్క పృష్ఠభూమిలో ఆంశిక స్థాయిలో అసాధారణ పాత్ర వహించడముగా చూడబడుతుంది. గోవర్ధనపర్వతాన్ని లేపటమనే గొప్ప పనిని అనేకమంది గోపబాలకులు తమ కఱ్ఱల సహాయంతో ఎలా చేయగల్గారో అలాంటి సామూహిక క్రియాకలాపాలు మన ముందుకు అనేకవైపులనుండి వెల్లువగా వస్తాయి.

ఇలాంటి కార్యక్రమాల కొరకే శాంతికుంజ్ నిర్మింపబడినది. గంగ ఒడి, హిమాలయాలయొక్క ఛాయ, సప్తఋషుల తపోభూమి, దివ్యచేతనల సాన్నిధ్యము, అఖండదీపము, నిత్యయజ్ఞము, నిరంతరము నడిచే సాధనలయొక్క సువర్ణావకాశములు ఒకేసారి, ఒకే స్థలములో శాంతికుంజ్‌లో తప్ప ఇంకెక్కడా కనిపించవు.

పరిశుభ్రమైన గాలి-నీరు లభించే ప్రదేశాలలోనే శానిటోరియమ్ నిర్మిస్తారు. ఈ విశ్వబ్రహ్మాండమును పరిశోధించటానికి కోణార్క్‌లోని సూర్యదేవాలయము ఎన్నుకొనబడి, నిర్ధారించబడినది. ప్రపంచం నలుమూలలనుండి శాస్త్రజ్ఞులు సూర్యగ్రహణమును పరిశోధించటానికి, పరిశీలించటానికి ఇక్కడికి విచ్చేస్తుంటారు. ఇదేవిధంగా ప్రపంచంలోని ఎన్నో ప్రదేశాలు తమ తమ వైశిష్ట్యాన్ని కలిగివున్నాయి. ప్రాచీనకాలం నుండి హిమాలయాలు తపస్సుకు ఉపయుక్తమైన స్థానంగా భావించబడుతున్నది. ఇటువంటి సూక్ష్మమైన పరిశీలనలను జరిపిన తరువాతనే శాంతికుంజ్ యొక్క నిర్మాణ స్థలము ఎంపికచేయబడినది. ఇచ్చటకు వచ్చిన ప్రతివొక్కరు తమ తమ పాత్రత, అవసరాలను అనుసరించి శక్తి, సాహసము, ప్రకాశప్రేరణ మొదలగువాటిని పొంది తిరిగి వెళుతుంటారు. ఈ ఆధారములపైనే శాంతికుంజ్‌ను ఈ యుగచేతనత్వము యొక్క గంగోత్రిగా భావించబడుతున్నది.

మన బలహీనతలే మన గౌరవాన్ని, హోదాను దిగజారుస్తాయి.

ఇది మహాక్రాంతి సమయము, అశుభమునుండి శుభము వైపుకు ప్రయాణము జరుగుతోంది, తుఫాను యొక్క దిశను ఊహించవచ్చు. నదీప్రవాహములో పడిపోయిన ముళ్ళకంప ప్రవాహము దిశవైపే ఉంటుంది. తుఫాను ఏ దిశవైపు ఉంటుందో అటువైపే ఎండుటాకులు, ధూళికణములు ఎగురుతూవుంటాయి. మహాక్రాంతి ఎల్లప్పుడూ సృజన మరియు సంతులనము కొరకు ఉద్భవిస్తుంది. చెట్టుమీదున్న పండు క్రిందే పడుతుంది. నీరు పల్లము వైపు ప్రవహిస్తుంది. కానీ అసంతులనమును సంతులనముగా మార్చడానికి మహాక్రాంతులు ఎప్పుడు ఉద్భవిస్తాయో, అప్పుడు వాటి ప్రభావ పరిణామములు ఊర్ధ్వగమనముతో, అభ్యుదయ రూపములోనే ఉంటాయి. అందుచేత వాటిని ఈశ్వరేచ్ఛ లేక భగవానుని అవతారము అనికూడా చెప్పవచ్చు. ఆ ఉన్నతిని చూస్తుంటే ఉజ్జ్వల భవిష్యత్తుపై నమ్మకము కలుగుతుంది.

## 4వ శక్తి యొక్క అభినవ ఉద్భవము

మూడు శక్తుల ప్రభావము మరియు మహత్తు సర్వవిదితమే. 1. బుద్ధిబలము – ఇందులో విజ్ఞానము, సాహిత్యము మరియు కళ సమ్మిళితమై వుంటాయి. 2. శాసనశక్తి – దీని అంతర్గతముగా వ్యవస్థ, సురక్ష మరియు తత్సంబంధమైన సాధనాలు మరియు అధికారము మొదలగునవి సమ్మిళితమైవుంటాయి. 3. ధనశక్తి – ఇందులో ఉద్యోగము, వ్యవసాయము మరియు బ్యాంకులు ఉంటాయి. ఈ మూడింటి సహకారముతోనే చిన్న–పెద్ద, మంచి–చెడు అనేక పనులు పూర్తవుతాయి. ప్రగతి, జ్ఞానముల లాభము కూడా ఈ మూడు శక్తులతోనే లభిస్తుంది. సరస్వతి, లక్ష్మి, కాళీల రూపములో వీటికే పూజ జరుగుతోంది. సాధారణ జనుల యొక్క కోరిక – అభిలాషలు కూడా వీటిని పొందాలనే ఆతృతలోనే ఉంటాయి. వీటిలో ఎవరికి ఎంత భాగము లభిస్తుందో, వారు అంతే గౌరవమును – కీర్తిని అనుభవిస్తారు. గొప్పదనమునకు ఈరోజులలో ఈ మూడు గీటురాళ్ళుగా వున్నాయి. వీటి ఆధారంగానే అవసరమైన సౌకర్యములు, సాధనాలు అన్నీ పొందటం సాధ్యము. నవయుగ అవతరణకు ఇప్పుడు నాల్గవశక్తి ఉదయించబోతోంది. దానిపేరే 'ప్రఖరప్రతిభ'.

ఇక్కడ ప్రఖరత అంటే ఆదర్శపూరితమైన ఔన్నత్యముగా అర్థం చేసుకోవాలి. సజ్జనులు, సమర్పణాభావంతో నిండిన సాధువులు ఈ స్థాయికి చెందినవారే. కార్యరంగంలో వారు సైనికుల వలె మంచి క్రమశిక్షణను పాటిస్తారు. వీరినే దేవమానవులు అంటారు. ఈ స్థాయి కలిగిన వ్యక్తులను ఓజస్వి, తేజస్వి, మనస్వి, వర్చస్వి, మహామానవులు, యుగ పురుషులు మొదలైన పేర్లతో కూడా స్మరిస్తువుంటారు. ఉన్నతస్థాయి భావసంవేదలను కలిగివుండటం వీరి ప్రత్యేకత.

21వ శతాబ్ది మొదలయ్యింది. ఇప్పటికే ప్రజ్ఞయొక్క అతి చిన్న–పెద్ద ఉద్యానవనాల బీజములు నాటబడి, మొలకెత్తినాయి, పెరుగుతున్నాయి. ఇవి నందనవనమునకు సమాన స్థాయితో పెరుగుతాయి, వీటిని కల్పవృక్ష ఉద్యానవనాలతో పోల్చవచ్చు. శ్రేష్ఠ మానవుల బాహుళ్యమే సత్యయుగము. అది ఇప్పుడు ప్రారంభమైనది. 21 వ శతాబ్దము సత్యయుగమును తప్పక తీసుకొస్తుంది.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2011*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

## రైతు నేర్పిన పాఠం

*పర్యక్ మహారాజు తన సింహాసనాన్ని ఇతరులకు అప్పగించి దైవాన్ని వెతుకుతూ బయలుదేరాడు. సత్సంగం ధ్యానం, మననం, స్వాధ్యాయం మొదలైన కార్యక్రమాలలో లీనమయ్యాడు. ఎందరినో మహాపురుషులను దర్శించాడు. కాని ఏమి ఉపయోగం కనిపించలేదు. అసంతృప్తితో ఖిన్న మనస్కుడై తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఒకరోజు బాగా ఆకలేసి ఒక రైతు పొలంలో అడుగుపెట్టి ఒక చెట్టు నీడలో కునికిపాట్లు పడసాగేడు. ఇది చూచి రైతు చేస్తున్న పనిని వదలిపెట్టి బాటసారి ఆకలితో అలసి ఉన్నాడని గ్రహించి బియ్యం కుండలో పోసి పొయ్యిమీద పెట్టి, ఓ బాటసారి! అన్నం ఉడుకుతున్నది. చూస్తుండు. ఈ లోగా వదలిపెట్టిన పనిని పూర్తి చేసి వస్తాను. ఇద్దరం అన్నం తిందాం అని చెప్పాడు. రాజు మంత్ర ముగ్ధునిలా అతను చెప్పినట్లు చేశాడు. అన్నం ఉడకగానే ఇద్దరు తృప్తిగా తిన్నారు. రాజుకి నిద్ర పట్టింది. నిద్రలో ఒక దివ్య పురుషుడు దర్శనమిచ్చి "నేను కర్మను, నన్ను ఆశ్రయించకుండా ఎవ్వరికి శాంతి లభించదు. ఈ రైతు వలెనే పరమార్థాన్ని, పురుషార్థాన్ని ఆశ్రయించు. లక్ష్యాన్ని చేరుకుంటావు" అని చెప్పి అదృశ్యమయ్యాడు. నిద్ర మేల్కొన్నరాజు తన ఆలోచనలను మార్చుకున్నాడు. దానితో అతని కార్యపద్ధతి కూడా మారింది. జ్ఞాన చర్చలు తగ్గించి పురుషార్థ పరాయణుడై సేవా కార్యాలలో లీనమయ్యాడు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

**పశ్చాత్తాపం కలిగించే పనులు కూడదు.**

## గాయత్రి - 24 శక్తి ధారలు (24)

# త్రిపుర

దక్షిణ మార్గ గాయత్రి సాధనను త్రిపద అంటారు. వామ మార్గ సాధనను త్రిపుర అని సంబోధిస్తారు. త్రిపద యొక్క కార్యక్షేత్రం సత్యం శివం సుందరం - స్వర్గం, ముక్తి, శాంతి - సత్ చిత్ ఆనంద్ - జ్ఞాన, కర్మ, భక్తి. త్రిపురలో ఉత్పాదన - అభివర్ధన, పరివర్తన - ధనం, బలం, కౌశలం, సాహసం, ఉత్సాహం, పరాక్రమం, ప్రఖరతలు ఉన్నాయి. ఆత్మిక ప్రయోజనముల కొరకు త్రిపదను, భౌతిక ప్రయోజనముల కొరకు త్రిపురను ఆశ్రయించవలసి వస్తుంది. యోగము, తంత్రము ఈ రెండింటి కొరకే ఇవ్వబడ్డాయి.

సాధనా గ్రంథములలో త్రిపుర మహాశక్తికి త్రిపుర సుందరి, భైరవి అనే పేర్లు ఇవ్వబడ్డాయి. దీనికి సంబంధించిన కథలు ఎన్నో ఉన్నాయి. దేవి భాగవతంలో, మార్కండేయ పురాణంలో వీటి వర్ణన వివేచన విస్తృతంగా ఇవ్వబడ్డాయి. వీరి ప్రభావముల గురించి, ప్రయోగాల గురించి ఇతర గ్రంథాలలో కూడా లభ్యం అవుతాయి. త్రిపుర భైరవిని అసుర విదారిణి, విపత్తి నివారిణి రూపములలో వర్ణించారు. ఆమె వికారంగా ఉండి యుద్ధం అంటే ఇష్టపడుతుంది. త్రిపుర సుందరిని సిద్ధి ధాత్రి, సౌభాగ్యదాయిని, సర్వాంగ సుందరిగా వర్ణించారు. భైరవి అభయదానమిస్తుంది. సుందరి అనుగ్రహం బాహ్య, ఆంతరిక క్షేత్రాలలో సుఖమయ సౌందర్యాన్ని నింపుతుంది.

మహిషాసురుడు, మధుకైటభుడు, రక్తబీజుడు, వృత్రాసురుడు మొదలైన రాక్షసులను మట్టుబెట్టే కథలలో త్రిపుర యొక్క ప్రచండ పరాక్రమం వర్ణింపబడింది. అజ్ఞానము, అభావము (లోటు), బద్ధకము, పతనము, పరాభవము మొదలైన సంకటములే ఈ అసురులు. త్రిపుర యొక్క సాహసము, పరాక్రమము ఉత్సాహం అనే త్రిశూలం వారిని నుగ్గు చేస్తుంది. తంత్ర సంప్రదాయంలో ఈ మూడింటికి దుర్గ, కాళి, కుండలిని అనే పేర్లు ఇవ్వబడ్డాయి. వీటినే చండి, మహాశక్తి, అంబా మొదలైన పేర్లతో కూడా పిలుస్తారు. కాళరాత్రి, మహారాత్రి, మోహరాత్రి రూపములలో హోలి, దీపావళి, శివరాత్రి సందర్భాలలో విశిష్ఠమైన ఉపాసన చెయ్యబడుతుంది. క్రియాయాగం, జపయోగం, ధ్యానయోగంతో త్రిపద సాధన చెయ్యబడుతుంది. ప్రాణయోగం, హఠయోగం, తంత్రయోగంతో త్రిపుర సాధన చెయ్యబడుతుంది. ఒకదానిని యోగాభ్యాసానికి అధిష్ఠాత్రిగా రెండవ దానిని తపశ్చర్యకు అధిష్ఠాత్రిగా చెప్పబడింది.

త్రిపద, త్రిపురలను పర అపరాగా చెప్పబడ్డాయి. రెండింటిని కలిపిన సమ్మిళిత సాధనతో ప్రాణం-శరీరం రెండింటి సమన్వయంతో జీవితం గడిపే పరిస్థితి కలుగుతుంది. బ్రహ్మవర్చస్ సాధనలో రెండింటిని ఒకదానికొకటి పూరకములని భావించబడ్డాయి. వాటి సంయోగ సుయోగముల వలన ఓజస్సు, తేజస్సు, రిద్ధి సిద్ధుల జ్ఞానం ఆధారమని చెప్తారు. ఇవి గాయత్రి మహాశక్తి యొక్క దివ్యధారలే. వీటిని సాధనతో వ్యక్తిత్వంలోనికి ఆహ్వానించి అవతరింపజేసుకోవచ్చు.

### శక్తిధారల సాధనల నిర్ధారణ :

గాయత్రి మంత్రం ఒకటే. కాని పరమాణువులలో వలె దీని అంతఃక్షేత్రములో అనేక భాగములున్నాయి. ఈ భాగములన్నింటికి వాటి వాటి క్షమతలున్నప్పటికి మూలతః ఒకే శక్తి కేంద్రంతో జోడింపబడి దానితో తమ పోషణ ప్రాప్తించుకుంటాయి. హృదయం ఒకటే నాడులు అనేకం. ప్రతినాడికి ఒక స్వరూపం, కార్యక్షేత్రం, బాధ్యత ఉన్నప్పటికి ఇవన్నీ ఒకే కేంద్రంతో ముడిపడిఉన్నాయి. గాయత్రిని హృదయంగా, దాని 24 శక్తులను 42 శక్తిధారలుగా చెప్పబడ్డాయి. హిమాలయము నుండి అనేక ప్రవాహములు వస్తాయి. ఆ విధంగానే గాయత్రికి కూడా విశిష్ఠమైన శక్తి ప్రవాహాలు ఉన్నాయి. ప్రపంచంలో సృష్టి సంచాలన చేసేది ఒక్కటే - మహా ప్రకృతి. దాని క్షేత్రంతో జోడింపబడిన జడ - చేతనలలో అనేక శక్తులు పనిచేస్తుంటాయి. హీట్ (వేడి), లైట్ (వెలుగు), మోషన్ (కదలిక), గ్రావిటేషన్ (ఆకర్షణ శక్తి) మొదలైనవి. విద్యుచ్ఛక్తి, కాస్మిక్ ప్రకృతిలో అనేక శక్తిధారలు తమ తమ క్షేత్రాలలో పనిచేస్తుంటాయి. జీవనీ శక్తిలో కూడా ఆలోచన, భావన, విశ్వాసం, అలవాట్లు మొదలైన అనేక ప్రవాహాలు ఉన్నాయి. కాని ఇవి అన్నీ ఒకే మూలస్థానం నుంచి తమ పోషణ ప్రాప్తించుకుంటాయి. ఆద్యశక్తి గాయత్రిని కూడా విశ్వచేతన అంతర్గతంగా నడుస్తున్న అనేక ప్రవాహముల ఉద్గమ కేంద్రంగా, ప్రేరణ ఇచ్చే కేంద్రంగా భావించాలి. సమస్త దైవీదేవతలు దాని నీడలో తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తాయి, కార్యక్షేత్రములను నడిపిస్తాయి.

**ఆర్థిక ఇబ్బందులు, కలుగుతాయనే భయం డబ్బును సద్వినియోగం చెయ్యనివ్వదు.**

సమగ్ర గాయత్రి సాధనకు మూడు స్వరూపాలు ఉన్నాయి. 1) నిత్య కర్మ దైనిక సాధన 2) విశిష్ఠ ఉపచారములు- అనుస్ఠానములు - పురశ్చరణ 3) ఉచ్ఛస్తరీయ తపోసాధనలు - పంచకోశముల అనావరణ. కుండలిని జాగరణ. వీటి కొరకు దక్షిణ మార్గ యోగ సాధనలు, వామమార్గ తంత్ర సాధన విధానములు ఉపయోగిస్తాయి.

ప్రత్యేక ప్రయోజనముల కొరకు గాయత్రిలోని 24 శక్తిధారలను అవసరాన్ని బట్టి, విశిష్ఠ సాధనలు కూడా చెయ్యవచ్చు. వీటి కొరకు నిర్ధారించబడిన విధి విధానాలు ఉన్నాయి. వీటికి వేరు వేరు బీజమంత్రాలున్నాయి. వీటిని గాయత్రి మంత్ర వ్యాహృతుల తరువాత, తత్సవితుర్వరేణ్యం తరువాత ఉపయోగించాలి. దక్షిణ మార్గములో ప్రతిమలు ఉపయోగిస్తారు. వాటి ఆకృతులు, వాహనం, ఆయుధాలు వేరువేరుగా ఉంటాయి. తంత్రములో ప్రతిమల స్థానంలో యంత్రములు ఉపయోగిస్తారు. వీటిని రేఖాచిత్రములనవచ్చు. త్రిపద గాయత్రిలో బ్రాహ్మి, వైష్ణవి, శాంభవి రూపాలు వాటి సాధనా కాలం, పూజా విధానం వేరు వేరుగా ఉంటాయి. అదే విధముగా చతుర్వింశతి గాయత్రి (24 అక్షరముల గాయత్రి) లోని ప్రతి అక్షరానికి వేరు వేరు పూజా పద్ధతులు ఉన్నాయి.

ఈ విధానాలలో అందరికి ఒకే పద్ధతి ఉపయోగపడదు. దీని కొరకు సాధకుని స్వభావం, అభావం (లోటు) ధ్యానంలో ఉంచుకుని సాధనా పద్ధతులను నిర్ధారించుకోవాలి. రకరకాల స్వభావములున్న వ్యక్తుల కొరకు వారి పరిస్థితిననుసరించి సాధనా పద్ధతులను నిర్ధారించడం ఈ విద్యలో నిష్ణాతులే చేయగలరు. మామూలు సాధనలు అందరికి ఒక్కటే. కాని 24 విశిష్ఠ ప్రవాహముల సాధన కొరకు అనుభవజ్ఞుల, పారంగతుల సహాయ సహకారములు ఎంతైనా అవసరం. సాధనా ప్రయోజనముల కొరకు గురువు, అనుభవజ్ఞులైన మార్గదర్శకులను ఎంచుకోవాలి. పుస్తకాలు చదివి ఇటువంటి సాధనలు చెయ్యడం మంచిది కాదు.

వ్యక్తుల స్థాయి, వారి ఆవశ్యకతలను అనుసరించి ఉపాసనా విధానాల నిర్ధారణ చాలా విస్తృతమైనది. వివరణలన్నీ ఇవ్వడం ఈనాటి పరిస్థితులలో సంభవం కాదు. చికిత్సలు ఎలా చెయ్యాలో మందులు ఎలా ఇవ్వాలో చెప్పే వైద్య శాస్త్రం ఉన్నప్పటికి రోగుల పరిస్థితుననుసరించి చికిత్సా నిర్ధారణ చెయ్యాలి. మందులు మాటిమాటికి మార్చవలసి రావచ్చు. అదేవిధంగా గాయత్రి యొక్క 24 శక్తులలో ఎప్పుడు, ఎవరికి ఏ విధంగా ఏ సాధన ఉపయోగం అనేది అనుభవజ్ఞుడైన మార్గదర్శకుల సహాయత ప్రాప్తించుకుంటేనే తెలుస్తుంది.

ఇటువంటి సహాయం ఈ రోజులలో బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్, శాంతికుంజ్ హరిద్వార్‌లో లభ్యమవుతుంది. ఉత్తరం ద్వారా కాని లేదా స్వయంగా వచ్చి వివరాలు సలహాలు పొందవచ్చు.

- అనువాదం : శ్రీమతి జ్ఞానప్రసూన

## ఆత్మ విశ్వాసానికి ఆధారం

*మొక్కలు సంవేదనశీలమైనవని నిరూపించాలనుకున్న జగదీశ్ చంద్రబోస్ ఇంగ్లాండు వెళ్ళాడు. అక్కడ వైజ్ఞానికులు ఉన్న నిండు సభలో ఆయన తన ప్రదర్శన చేయవలసి ఉన్నది. ఒక మొక్కకు సూది మందు ఇచ్చి ఆ విష ప్రభావం మొక్క మీద ఎలాగుంటుందో ప్రత్యక్షంగా చూపించాలి. మొక్కకు సూదిమందు ఇచ్చాడు. కాని అది విష ప్రభావానికి లోనుకాలేదు. తక్షణం బోస్ ఈ సూదిమందు ప్రభావం చెట్టు మీద లేనప్పుడు నా మీద కూడా ఉండదు అని పల్కి అదే సూది మందును తన చేతి మీద చేసుకున్నాడు. సభ భయంతో చేష్టలుడిగి స్తబ్ధుగా చూస్తూ ఉండిపోయింది. ఆ సూది మందు వల్ల మనిషికి ఎంత ప్రమాదమో అందరికి తెలుసు. అది బోస్‌ను ఏమి చెయ్యకపోవడంతో దానినే పరీక్షించవలసి వచ్చింది. పొరపాటు వలన విషం సూది మందు ఉంచే స్థానంలో బలానికి ఉపయోగించే మందు ఉంచారన్న సంగతి బయటపడింది. తరువాత విషపు సూది మందు మొక్కకు ఈయడం, తక్షణం ప్రతి క్రియ జరగడం సభాసదులు ప్రత్యక్షంగా చూచారు.*

*ఆయన తమ అన్వేషణను విశ్వాసంగా చేసేవారు. ప్రతిపాదనలకు ఖచ్చితమైన ఋజువులను చూపించేవారు. ఈ కారణం వలననే వారికి అంతటి ఆత్మ విశ్వాసం లభించింది. కేవలం పుస్తకాలు చదివినంతమాత్రాన ఉపయోగం లేదు. వీటిని జీవితంలో ధైర్యంగా స్వీకరించి అభ్యాసం చెయ్యాలి. అప్పుడే అవి గొప్ప గుణాలుగా, సంస్కారాలుగా తయారవుతాయి. ఇటువంటి వారు అద్భుతమైన మేధాసంపదలను అవలీలగా అనతికాలంలోనే హస్తగతం చేసుకోగలుగుతారు.*

*- ప్రజ్ఞా పురాణం నుండి*

**చనిపోతామనే భయం జీవితాన్ని సవాలుగా తీసుకోనివ్వదు.**

# నవార్ణమంత్రం యొక్క రహస్యార్థము-సాధనా మర్మము

ఆదిశక్తి యొక్క లీలాకథ బీజరూపములో నవార్ణమంత్రంలో ఇమిడివున్నది. నవార్ణమంత్రం యొక్క విస్తారం-వికాసమే శ్రీదుర్గాసప్తశతి యొక్క మూడు రకాలైన చరిత్రలు మరియు 700 మంత్రాల రూపములో జరిగింది అని కూడా చెప్పవచ్చును. బహుశా అనేకమంది పలురీతులలో **"ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే"** అను 9 అక్షరాలు గల ఈ నవార్ణమంత్రంతో పరిచయమును కలిగి వుంటారు. కానీ దీని రహస్యానుభూతిని కొద్దిమందే సాధించి ఉంటారు. మంత్రవేత్తలు ఇందులో 33 కోట్లమంది దేవీ-దేవతల వివిధ మంత్ర-మహామంత్రాల సారమును అనుభూతి చెందుతారు. ఈ సాధనతో ప్రకృతి మరియు సృష్టియొక్క దుర్లభమైన రహస్యాలు పరిశోధింపబడి, తద్వారా వాటి జ్ఞానమును పొందటం జరుగుతుంది. ఈ మహామంత్రంలో **"ఐం హ్రీం క్లీం"** మంత్రబీజాలే కాక మంత్రాక్షరాలలోని మిగిలిన ప్రతి అక్షరము బీజమంత్రములతో సమానంగానే సాధకుని అస్తిత్వంలో ఆధ్యాత్మిక విస్ఫోటనం కలిగించి, అలౌకిక శక్తిధారలను వికసింపజేసే సామర్థ్యమును కలిగివున్నాయి.

జగన్మాత లీలాకథలను వివరిస్తూ ఇప్పటివరకు గడచిన భాగాలలో దీనిలో ఉన్న మొత్తం ఆరు అంగాల వివేచన చేయబడింది. కవచం, అర్గలా, కీలకము, ప్రాధానికరహస్యము, వైకృతికరహస్యము, మూర్తిరహస్యము అను ఈ మొత్తం ఆరు అంగాలు శ్రీదుర్గాసప్తశతితో అనివార్యమైన మరియు అభిన్నమైన రూపంలో జోడింపబడివున్నాయి. వీటి పారాయణ చెయ్యకుండా సాధనావిధానము పూర్తి అవ్వదు. ఇదేక్రమంలో నవార్ణ మంత్రమునకు విశేష స్థానమున్నది. సప్తశతి పారాయణకు ముందు, పారాయణ తరువాత నవార్ణమంత్ర జపమును చేయుట తప్పనిసరి అని శక్తి సాధకులు భావిస్తారు. **ఆద్యన్తౌ నవార్ణమంత్ర జపేత్** - అనగా పారాయణ ఆది, అంతములలో నవార్ణమంత్రమును జపించాలి, ఎందుకంటే నవార్ణమంత్రముతో సంపుటీకరణ చేయుట వలన పారాయణ అతి ప్రభావశాలిగా ఉంటుంది అని శాస్త్రములు కూడా చెప్తున్నాయి. సాధకులు తమ సాధనా క్రమంలో దీని అనుభూతి చెందగలరు.

నవార్ణమంత్ర బీజాక్షరములు మరియు మంత్రాక్షరముల రహస్యాత్మకత విషయానికి వస్తే వీటి కథా వివరణ బహు విస్తారమైనది. ఐం హ్రీం క్లీం రూపంలో ఈ మూడు వాగ్బీజం, మాయాబీజం మరియు కామబీజం ప్రకృతి యొక్క త్రిగుణాత్మక ధారలకి ప్రతీకలు. అవే మహాసరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి రూపములో చిత్రీకరించబడినాయి. చాముండాయై విచ్చె-మంత్రాక్షరాలలో త్రిగుణాత్మిక మహాశక్తి భగవతి పట్ల నిండైన శరణాగతి భావం ఉంది. అందువల్ల పారాయణ క్రమంలో భగవతి మహాకాళీ స్వరూపము ముందుగా ఇవ్వబడింది. అందులో క్లీం బీజమంత్ర సామర్థ్యము విపులంగా వివరించబడినది. దీని తరువాత మధ్యమచరిత్రలో మాత మహాలక్ష్మి యొక్క మంత్ర మహిమయే బీజాక్షరముల విస్తారక్రమంలో ప్రకటీకరించబడినది. చివరలో ఐం బీజ సామర్థ్యం మాత సరస్వతి యొక్క మంత్ర మహిమరూపంలో ఇవ్వబడింది.

**చాముండాయై విచ్చె:** ఈ మంత్రాక్షరాలలో కూడా అనేక ప్రత్యక్ష మరియు రహస్యమైన శక్తులు ఇమిడివున్నాయి. చాముండాయై అనే పదానికి ఒక అర్థము 'అజ్ఞానమనే సేనను నశింపజేసే మహాశక్తి' అని కూడా ఉంది. సప్తశతి పారాయణ క్రమాన్ని అనుసరించి 7 వ అధ్యాయంలో భగవతి పరాంబ యొక్క లలాటం నుండి ఉద్భవించిన మహాశక్తి శుంభ, నిశుంభుల సేనానాయకులైన చండ-ముండులను వధించినది అని వర్ణించబడివుంది. వధానంతరము వారు ఈ బలి-పశువులను భగవతికి అర్పించినప్పుడు ఆమె నవ్వుతూ లేక మందహాసం చేస్తూ ఇలా అంది

**యస్మాచ్చణ్డం చ ముణ్డంచ చ గృహీత్వా త్వముపాగతా ।**
**చాముణ్డేతి తతో లోకే ఖ్యాతా దేవి భవిష్యసి ॥ (7/17)**

'నువ్వు చండ, ముండులను తీసుకొని మా వద్దకు వచ్చినావు, అందువల్ల ఈ లోకంలో నువ్వు చాముండాదేవీ అను నామధేయంతో విఖ్యాతి చెందెదవుగాక!'

విజ్ఞుల అభిప్రాయాన్ని అనుసరించి ఈ చాముండాయై పదం ఆ మహాశక్తినే తలపిస్తుంది. అదేవిధంగా పదంలో 4 అక్షరాలే లెక్కించబడతాయి. కానీ ఇందులో - చ్, మ్, ణ్, డ్, య్ అను 5 వ్యంజనములు; అ, ఉ, ఆ, ఎ - అను 4 స్వరాలు ఉన్నవి. ఈవిధంగా దీని వర్ణసంఖ్య 9 అయివున్నది. ఈ 9 అక్షరాలకు లేక వర్ణాలకు చాలా అద్భుతమైన ప్రభావం ఉంది. అందువల్ల

ఉత్సాహాన్ని కోల్పోయిన వాడే అందరికన్నా దివాలాకోరు.

ఇవి మంత్రానికి మధ్యన ఉంచబడినవి. ఈ పదం తరువాత వచ్చే 'విచ్చే' అను పదం భగవతికి శరణాగతి చేసుకోమని సూచిస్తుంది. మంత్రదృష్టిని అనుసరించి దీని గొప్పతనం కూడా సాటిలేనిది.

సిద్ధిని సాధించిన కొంతమంది పరాతంత్రయోగుల అభిప్రాయం ప్రకారం శ్రీదుర్గాసప్తశతి యొక్క 4 వ అధ్యాయంలోని 14వ శ్లోకంలో దేవీ ప్రార్థన చేసే మంత్రం కూడా నవార్ణ మంత్రంగా అంగీకరించబడుతుంది. ఇందులో 9 సార్లు 'న' వర్ణ లేక అక్షర ప్రయోగం చేయబడింది. నిస్సందేహంగా ఈ మంత్ర మహత్యము, అర్థము సాటిలేనివి. శక్తి సాధకుల కొరకు వీటి గోపనీయమైన అర్థమును ఇక్కడ వివరించబడుతున్నది. తద్వారా వీటి అద్భుత ప్రభావమును సరైన రీతిలో అర్థము చేసుకోవచ్చును.

**శూలేనొ పాహి నొ పాహి ఖడ్గేన చామ్బికె ।**
**ఘణ్టాస్వనేన నః పాహి చాపజ్యానిః స్వనేన చ ॥ (4/14)**

ఈ మంత్రంలో 'న' అను అక్షరం 9 మార్లు ప్రయోగించబడినది. దీని అర్థము కూడా అద్భుతమైనది. 'హే దేవీ! నీ ఖడ్గంతో నా దైహిక, దైవిక మరియు భౌతిక కష్టాలను ఖండించి వేయుము. జాగృత, స్వప్న, సుషుప్తుల వ్యాధులను దూరం చేయుము. నేను మూడు దేహములు అనగా స్థూల-సూక్ష్మ-కారణశరీరాల కాలావధులను నాద, స్పంద మరియు ప్రణవం ద్వారా అతిక్రమించుదునుగాక! కారణ-మహాకారణ శరీరాలలో మహిషాసుర రూపంలో ఉన్న అహంకారమును షట్చక్రభేదన ద్వారా శమింపజేసి, సహస్రారం లేక బ్రహ్మ రంధ్రంలో ప్రవేశించి క్రమక్రమంగా ఊర్ధ్వగతిని పొంది జ్ఞాన సామ్రాజ్యంలో ప్రవేశించుదునుగాక!" అనే ప్రార్థన ఇక్కడ చెయ్యబడింది. ఈ కొద్ది శబ్దాలలో దీని దివ్యమైన అర్థమును సంకేతముగా పొందగలము.

సాధకుల సముదాయము నవార్ణమంత్రమును నవార్ణవ మంత్రం అని కూడా పిలుస్తారు. నవ అర్ణవ అనగా 9 సముద్రాలు. ఈ మంత్రంలో 9 అక్షరాలు ఉన్నాయి. అవి సాధకుడికి 9 సముద్రాలను దాటివేసే సామర్థ్యము నిస్తాయి. ప్రతి సాధకుడు 1. కామ, 2. క్రోధ, 3. మోహ, 4. లోభ, 5. మద, 6. మాత్సర్య, 7. ఈర్ష్య, 8. ద్వేషము లనే సముద్రములను దాటాలి. ఈ ఎనిమిదీ కాక ఈ అష్ట సముద్రాల శృంఖల యొక్క రెండు ఒడ్డులను కలిపే సంగమమే 9వ సముద్రం. ఈ 9 సముద్రాలను దాటిన మానవుడు తన జీవన లక్ష్యమును సాధిస్తాడు. ఈ 9 సముద్రాల శృంఖలలో 'కామం' మొదటి సముద్రము. ఏ కామకళ మనిషిని నాశనము చేస్తుందో, దానినే సదుపయోగం చేసినప్పుడు అతనిని జగదంబ యొక్క శ్రీచరణాల సన్నిధికి చేరుస్తుంది. నవార్ణ మంత్రములోని మూడవ అక్షరము కామబీజమైవుంది. దీని సమ్యక్ లేక సరియైన సాధన వలన సాధకుడు కామమనే సముద్రమును దాటుతాడు.

ఐం బీజం విజ్ఞానముతో కలిసిన వాక్కునకు సంబంధించినది. దీనితో మనిషి క్రోధమనే సాగరమును దాటగల సామర్థ్యమును పొందుతాడు. వాక్కు కఠినముగా ఉంటే సాధకుడు మునిగిపోతాడు. వాక్కుతో క్రోధావేశం చెందకుండా సాధకుడు, దేవిగుణ కీర్తన చేస్తూ ఆ భావంలో మునిగితేలినప్పుడు త్రికాలజ్ఞుడు అవుతాడు. హ్రీం-మాయాబీజం. అది సాధకుని మోహబంధనాల నన్నింటిని త్రెంచివేస్తుంది. చివరకు మానవుడిని అన్ని మోహజాలములనుండి మహామాయే బయటపడవేసేది. 'చా' అనే అక్షర సాధన సాధకులను లోభమనే సముద్రమును దాటించివేస్తుంది. ఈ సాధనా రహస్యాలను తెలుసుకుని అర్థం చేసుకున్నప్పుడు మానవుని అసంతృప్తి నశించిపోతుంది.

'ము' మదరూపంగల సముద్రమును దాటించగల సామర్థ్యమును ఇస్తుంది. 'మ' అమృతబీజం. దీని సాధనా రహస్యము లోతైనది. దీని సాధనతో సాధకుడు మదం నుండి బయటపడే సామర్థ్యమును పొందుతాడు. 'డ' జడత్వమును సూచించే అక్షరము. జడత్వము వలన మనిషిలో మత్సరం (అసూయ) వస్తుంది. శ్రద్ధాపూర్వకంగా 'డా' మంత్రాక్షర రహస్యమును హృదయంలో భావనాత్మకంగా జపించినప్పుడు మనిషి తన ధ్యేయం వరకు చేరుకుంటాడు. 'యై' వాయువు మరియు వాక్‌బీజం సంయోగంతో ఉద్భవించినది. ఇది ద్వేషమనే సముద్రమును దాటించివేస్తుంది. 'వి' ఈర్ష్య రూప సముద్రమును అధిగమింపజేసే బీజమంత్రం. 'చ్చె' ఇది 9వ సముద్రానికి చెందినది. ఇది అష్ట సముద్రములను కలిపే కూడలి. దివ్యతత్త్వంతో కూడిన 'చ్చె' అక్షర సాధన సాధకుడిని ఈ సంగమం నుండి పైకి లేపి ఉద్ధరిస్తుంది.

నవార్ణమంత్ర రహస్యార్థము మరియు సాధనా రహస్యము ఇంకా చాలా ఉంది. ఇందులో మొదటగా తత్త్వ నవార్ణ భేదములు మరియు వివిధ సాధనా ప్రక్రియలు ఉన్నాయి. నవార్ణమునకు చాలా విస్తృమైన రూపముంది. దాన్ని మహానవార్ణం అని అంటారు. ఇంతేకాకుండా గాయత్రీమహామంత్రమునకు కూడా నవార్ణమంత్రంతో రహస్య సంబంధము ఉంది. నవార్ణమంత్రము యొక్క ఇతర రహస్యాలను రాబోయే సంచికలో చెప్పబడతాయి.

*- అఖండజ్యోతి, నవంబరు 2007*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

**భయం మానసిక కాలుష్యంగా స్థిరపడి వైఫల్యాలకు కారణమవుతుంది.**

కుటుంబ నిర్మాణం

# బాధ్యత సంస్కారం లేని కుటుంబాలు

మహానగరాలలో దాంపత్య జీవన స్థితిని గూర్చి జ్యోతిష్యపరమైన ఈ అధ్యయనం 'ఎస్ట్రోవిజను' అనే సంస్థ చేసింది. అయితే ఈ నిర్ణయాలు సమాజశాస్త్ర దృష్టా మహత్తరమైనవి. గత పదేళ్ళలో జరిగిన వివాహాలలో 12 శాతం వ్యక్తులు ఏ బాధ్యత, సంస్కారం లేకుండానే గృహస్థ జీవనం ఆరంభించేసారు. వారు ఏ శాస్త్రీయ విధిని పాటించలేదు. పెద్దలు, వృద్ధుల సమక్షంలో వారి ఆశీర్వాదం తీసుకొని గృహస్థ జీవనంలో అడుగుపెట్టలేదు. కనీసం వివాహ రిజిస్ట్రారు కార్యాలయంలో నమోదు చేయించుకోకుండా దంపతులైపోయినారు. అలాగే కలిసుండడమారంభించిన జంటలు తల్లిదండ్రులుగా కూడా మారారు.

వాడుక భాషలో ఈ వివాహాన్ని 'సహజీవనం' అని పిలుస్తారు. పశ్చిమ దేశాలలో ఈ పద్ధతి ఉత్తమమైనదిగా భావించబడుతోంది. పరంపరగా వచ్చే కుటుంబ విలువలు లేని సమాజంలో సుఖ విలాసాల కోసం స్త్రీ పురుషులు పరస్పరం ఆకర్షితులై కలిసి నివసిస్తారు. నిర్వహణకు సాధ్యమైనంత వరకు కలిసి ఉంటారు. అంటే రెండు మూడు ఏళ్ళు లేదా ఐదారేళ్ళ తర్వాత విడిపోతారు. భారతదేశంలో ఇట్టి తేలిక తరహా దాంపత్య జీవనం సాధ్యం కాదు. ఇక్కడ వివాహం అంటే జన్మ, జన్మాంతర బంధంగా భావిస్తారు. అలాంటి బంధం కాకపోయినా కనీసం జీవితాంతం కలిసి ఉండే బంధం అయి ఉంటుంది. 'ఎస్ట్రోవిజను' సంస్థ అధ్యయనం గావించిన జంటలలో, పరస్పర అంగీకారంతో కలిసి జీవించిన దంపతులలో 70 శాతం మంది ఒకరినొకరు తిట్టుకుంటూ, విలపిస్తూ వేరుపడిపోతున్నారు. అలా వేరుపడనివారు ఒక చెట్టు కొమ్మపైనున్న వేర్వేరు జాతుల పక్షుల లాగ జీవిస్తున్నారు. లేదా వేరు పడే ప్రయ్నతం చేస్తున్నారు.

సంస్థ జ్యోతిష్య సంబంధమైనది గనుక, తన అధ్యయనంలో జంటల జన్మ పత్రికలను కూడా పరీక్షించింది. జ్యోతిష్య శాస్త్రం తెలిసిన విద్యార్థులకు కూడా జన్మ పత్రికలో సప్తమ భావం జీవన సహచరుని స్థితి, వైవాహిక జీవితం గురించి చెప్తుందని తెలుస్తుంది. కలిసి జీవిస్తుండే సహజీవన వైవాహిక స్థితి శాస్త్రపరంగా గాంధర్వ వివాహ కోవలోకి వస్తుంది. పరస్పర ఆకర్షణకు లోనై ప్రణయ సంబంధ ప్రవాహంలో కలవడమే గాంధర్వ వివాహం. ఇట్టి జంటల జన్మ పత్రికలలో సప్తమ భావం రాహువు చేత చూడబడడం గాని, అతని అధీనంలో ఉండడం గాని జరిగింది. అంతే కాకుండా శని ప్రభావం కూడా ఉంది. మతి భ్రమించేలా చేసే గ్రహం రాహువు. 'ఎస్ట్రోవిజను' సంధానకర్త ఆచార్య వాచస్పతి ప్రకారం – బాధ్యతను, సంస్కారాన్ని ఉపేక్షించడం, అనాదరణ చేయడం మతిభ్రమించడం వలననే కావచ్చును. అలా కాకపోతే, వివాహ నమోదు చేసే కార్యాలయానికి వెళ్ళేందుకు ఏమి ఖర్చు అవుతుంది? ఏ సరంజామా అవసరం ఔతుంది! ఏమి బాధలు కలుగుతాయి?

లోకరీతి, మర్యాదను పాటించకుండా, ఈ విధంగా కలిసి కాపురం చేయడం క్రాంతి కారకం (మార్పు) కాబోదు. ఇట్టి ప్రణయం వ్యభిచార శ్రేణిలోకి వస్తుంది. పెద్ద నగరాలలో యువతీ యువకులు ఒంటరిగా ఉంటున్నారు. ఒకరికి మరొకరితో పరిచయం అయిన తర్వాత, పరస్పర ఆకర్షణ, ఆవేశాలకు లోనై దగ్గర అవుతున్నారు. బహుశ వారి వారి సంరక్షకులు దూరంగా ఉంటున్నారు. అందువలన వారి నియంత్రణ వీరిపై ఉండదు. శారీరిక, బౌద్ధిక ఆకర్షణ వారినొక ఇంట కప్పు క్రింద కలిసేలా చేస్తుంది. ఇలాంటి జంటల జన్మ పత్రికలలో చంద్రుడు ఎదురెదురు స్థానాలలో చూడబడ్డాడు. చంద్రగ్రహం మనసుకు అధిపతియని జ్యోతిష్యం చెప్తోంది. చంద్రుడు ఆకర్షణను, వ్యధను కూడా కలిగించగలడు. ఎవరి జన్మ పత్రికలలో ఈ గ్రహం ఎదురెదురుగా లేదో, వారి జాతకంలో రాహుదశ లేదా అంతర్దశ రాగానే, ఏడుస్తూ, కొట్టుకుంటా వేరైపోతారు. కాని కొన్ని విషయాలలో సహజీవనం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది. ఆ జంటలకు సంతానం కూడా ఉంటుంది.

సహజీవనం చేస్తున్న గాంధర్వ శైలి వివాహిత జంటలకు మొదటి సంతానం తర్వాత బంధనం మొదలౌతుంది. ఆచార్య పరాశరుల ప్రకారం వారి జన్మపత్రికలో లేనప్పటికి గోచారరీత్యా శనిదృష్టి సప్తమ భావంలో పడుతుంది. శని క్రూరగ్రహంగా భావించబడుతుంది. ఆ గ్రహదృష్టి అశుభకరం, అమంగళకరం గనుక బహుశ దుఃఖాన్ని కలిగిస్తుంది. డాక్టరు ఉమేష్ కౌశిక్ ప్రకారం శని ఆజ్ఞాబద్ధుడైన క్రమశిక్షణ దేవత. ధర్మ మర్యాదలను పాటించినవారికి అతడు ఎక్కువ కష్టం కలిగించడు. చాలాసార్లు

**ధైర్యాన్ని వృద్ధి చేసుకుని భయానికి తావులేకుండా చేయాలి.**

శనివారికి సుఖాన్ని, ప్రగతిని కూడా ఇస్తాడు. గాంధర్వ శైలి దాంపత్యంలో జీవిస్తున్న జంటలు సంస్కారాన్ని, విధులు ఉపేక్షించినట్లయితే, శనిదృష్టివారిని తప్పనిసరిగా బాధిస్తుంది. ఇలాంటి జంటల దాంపత్యం ఏడుపు, విసుగు, దుఃఖంతో నడుస్తుంటుంది. ఒక దశ వచ్చేసరికి సంబంధాలు దారుణంగా అంతమౌతాయి. సమస్యల వలయంలో హద్దులేని విధంగా పీడితురాలైన ఈ జంటలకు తమ సంబంధాలను విధి ప్రకారం శాస్త్రీయమైనవిగా చేసుకొమ్మని డాక్టరు ఉమేష్ కౌశిక్ సలహా ఇచ్చారు. అంటే మర్యాద పూర్వకమైన ధర్మబద్ధ బంధాన్ని పొందమని కోరారు. ఇలాంటి బంధాన్ని పాటించిన ఎనిమిది జంటలలో ఆరు జంటల పరస్పర సంబంధాలలో 70 శాతం వరకు మంచి మార్పు కలిగినా, కొద్దిపాటి ఒత్తిడితో నడుస్తూనే ఉంటుంది.

గురు దృష్టివలన ప్రణయ సంబంధాలలో ఆవేశం, ఆకర్షణలతో ప్రేరితులై జంటలుగా కలిసిఉండడం ఆరంభించినా, వారు ధర్మం, మర్యాదా పద్ధతులలో తమను తాము త్వరలోనే మార్చుకున్నట్లు కనుగొనబడింది. క్రమబద్ధీకరణ కొరకు గుడిలోగాని, రిజిస్ట్రారు ఆఫీసులోగాని తమ సంబంధాలను ప్రకటించుకొని, గృహస్థ ధర్మం పాటిస్తామని ప్రతిజ్ఞ చేసుకున్న వారిపై – రాహువు ఆధిపత్యం, ప్రభావం ఏమీ కన్పించలేదు.

సమాజ శాస్త్రజ్ఞులు ఇట్టి వివాహ బంధాలను గూర్చి చింతిస్తున్నారు. సహజీవనం లోకప్రియమైనదిగా పెరుగుతున్న కొద్దీ కుటుంబ వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఆ భార్యాభర్తలు వేరైన తర్వాత ఏదో విధంగా జీవితం గడుపుతారు. లేదా కొత్త సహచరుని ఎన్నుకుంటారు. కాని పిల్లలకే సమస్య అవుతుంది. వారి బాగోగుల ఏర్పాటు జరగాల్సిఉంది. తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత లేనందున ఆ పిల్లల వికాసం కుంటుపడుతుంది.

జ్యోతిష్యంతోపాటు సమాజ శాస్త్రంలోను ప్రవేశమున్న డాక్టరు కౌశిక్ – గాంధర్వ వివాహాలు ఎక్కువవుతున్న తీరు చూస్తే, మనిషిని ఆదిమ స్థితికి తీసుకొనిపోతుందేమోనని భావిస్తున్నారు. ఇట్టి స్థితిలో స్త్రీ పురుషులు శారీరిక అవసరం కోసం సంపర్కం పెట్టుకుంటూ, కొద్ది సమయం కలిసిఉన్న తర్వాత విడిపోతున్నారు. ఈ ఆదిమ స్థితిలో మనుష్యేతర ప్రాణుల వలెనే జనసంఖ్య పెరుగుతూనే ఉంటుంది. సభ్యత దృష్టిలో మనమెక్కడ ఆరంభించామో ఆ బిందువు వద్దనే నిలిచి పోతాము.

చట్టం దృష్టిలో సహజీవనం చేస్తున్న దంపతులలో ఒకరంటే మరొకరికి బాధ్యత ఉండదు. ఇద్దరు ముగ్గురు పిల్లలను కన్న తర్వాత భర్త వేరైపోతే, భార్య ఆ పిల్లల పోషణ కోసం అతనిని బాధ్యునిగా చేయలేదు. వివాహ విచ్ఛిన్నం, వేర్పాటు తర్వాత అతడు భరణం ఇవ్వడం, పోషించడం వంటివి ఏవీ ఉండవు. భర్త నుండి ఇవేవీ కోరే అధికారం, అవకాశం ఆమెకు ఉండనే ఉండదు. కొన్ని సందర్భాలలో ఐదారు సంవత్సరాలు కలిసి జీవించిన తర్వాత భార్యగాని, భర్తగాని దుర్ఘటనలో మరణిస్తే, చనిపోయిన వ్యక్తి సంపాదనపై సహజీవనం చేసిన రెండో వ్యక్తికి అధికారం ఉండదు. చనిపోయిన వారి బంధువులు వచ్చి మృతుని సంపాదన, భవిష్యనిధిని ప్రోగు చేసుకొని పోతున్నారు. అసలు వారసులకు అవేవీ దక్కడం లేదు.

సామాజిక, రాజనైతిక జీవితంలో ఇట్టి సంబంధాలు నింద, తిరస్కార భావాలతో చూడబడుతున్నాయి. బహిరంగంగా ఆ ప్రభావం సంతానం మీద పడుతుంది. ఎస్ట్రోవిజన్ అధ్యయనంలో ఆశ్చర్యజనక ఫలితం ఏమంటే సహజీవనం నెరిపే దంపతుల సంతానం, ఇతర దంపతుల సంతానంతో పోలిస్తే, ఎక్కువ జ్వర పీడితులు, అల్పాయువులు ఉంటున్నారు. ఈ ఫలితానికి పుష్టిని చేకూర్చే మూడు ఉదాహరణలు చెప్పబడ్డాయి. వారిలో ఒక బిడ్డ ఎప్పుడూ ఒంటరిగా ఉండేవాడు. తన తోటి పిల్లలవలె చదువుకోలేకపోయాడు. ఎనిమిది సంవత్సరాల వయసులో సాధారణ జ్వరం మాత్రమే వచ్చి చనిపోయాడు. రెండో ఉదాహరణలో పిల్లలకు తమ తల్లిదండ్రుల పెంపకం శోభించలేదు. ఐదు సంవత్సరాల వయసులో తాత అవ్వల పెంపకంలోకి వచ్చారు. వారితో ఎంతగా కలిసిపోయారంటే తమ తండ్రిని కూడ మర్చిపోయారు. మూడో ఉదాహరణలో బిడ్డ నిరంతరం జ్వరపీడితుడుగా ఉండేవాడు. అతనికి ఉపచారాల లోటేమీ లేదు. సహజీవనం చేసిన జంటల పిల్లలపై తల్లిదండ్రుల ప్రవర్తన ప్రభావం బయటపడడం కనిపించింది. మర్యాదను, బాధ్యతను పాటించని వారికి వారి నిజజీవితంలోనే కాక, రానున్న తరాల వారిపై కూడా చెడు ప్రభావం కలిగిస్తుంది. సహజీవన కుటుంబ వ్యవస్థపై ఆలోచనా పరులైన వ్యక్తులకిదొక హెచ్చరిక. సభ్యతా సంస్కృతి చక్రాలను సరియైన రీతిలో నడిపేందుకిదొక అవకాశం. ఇది స్వాభావికం కూడా.

*– అఖండజ్యోతి, జనవరి 2000*

*అనువాదం : బాసంగి శ్రీరాములు*

**భ్రమలో నుండి బయటపడటమే జీవితం.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# యుగపరివర్తన కాలములో పంచశీలములను పాటించండి-4

పరమపూజ్యగురుదేవులు 'ఆధ్యాత్మిక పంచశీలములను ఆచరించుట' గురించి ఇక్కడ చెపుతున్నారు. ముందు మూడు భాగాలను మీరు చదివే ఉంటారు. **యుగపరివర్తన కాలంలో మార్పు అనేది మనతోనే ఆరంభించాలి.** ఆ మార్పులను గురించి ఐదు విషయాలను చెప్పారు గురుదేవులు.

**1) మీరు ఒక ప్రత్యేక ప్రపంచంలో వేరుగా జీవించండి అనగా భౌతిక జీవితం నుండి దూరంగా ఉండండి.**

**2) మనస్సును కఠినంగా చేసుకుని మీ కోరికలను మార్చుకొండి.**

**3) కర్మయోగి వలె జీవించండి.**

**4) మీవద్ద ఉన్న శ్రమ, సమయము, ఇంద్రియముల వంటి వాటిని సరియైనరీతిలో సంపూర్ణంగా ఉపయోగించుకొండి.**

**5) మీ దగ్గర ఉన్నదంతా సమాజము మొత్తానికి పంచండి.**

గోస్వామీ తులసీదాసు మీరాబాయికి వ్రాసిన లేఖ ఆమెలో సాహసమును నింపింది. ఆ లేఖలో ఆమె తనదైన వేరే ప్రపంచములో జీవించే మార్గమును బోధించాడు. పూజ్య గురుదేవులు కూడా ఒంటరిగానే జీవించారు. కానీ ఆయన నలువైపులా పుస్తకాలు, నిరంతరమూ సత్సంగమును ప్రసాదించే మహామానవులు ఉన్నారు. **మనం మన కోరికలను హనుమంతుని వలె అదుపులో పెట్టుకోవాలి, సంస్కరించుకోవాలి.** వాటిలో అనంతమైన శక్తి ఉంది. మనం కోరికల రూపు మార్చుకొని, **ఈషణత్రయం అనగా పుత్రేషణ, విత్తేషణ, లోకేషణల నుండి దూరం కావాలి. 'సభ్యతతో కూడిన జీవనయానము సాగించాలి'** అని గురుదేవులు కోరుకున్నారు. మీరు ప్రకాశస్తంభాల వలె జీవించండి. రాజా హరిశ్చంద్రుని నుండి ప్రేరణ పొందండి అని చెప్పారు. గొప్ప ఆకాంక్షలు, శ్రేష్ఠ ఆదర్శాలు ఎప్పటికి నశించవు అని అర్థము చేసుకొండి. అవి నిరంతరము ప్రేరణ నిస్తూవుంటాయి. ఇక ఈ చివరి భాగాన్ని చదవండి.

## మీ కాయకల్పము చేసుకొండి

మనందరము ఏమి చెయ్యాలి? 1) ఆత్మపరిష్కారము అనే మహత్వాకాంక్షను పెంచుకోవాలి. 2) మన పనులలో వినమ్రత, శ్రేష్ఠత ఉండాలి. ఇవే మన రెండు లక్ష్యములుగా ఉండాలి. లోకమంగళమునకు, సమాజ కళ్యాణమునకు మనమేమి చేశాము? చిన్న దీపము వలె వెలిగి ఇతరులకు ప్రకాశము నివ్వండి. మీరు చిన్నవారని, మీ సామర్థ్యము, యోగ్యత మొదలైనవి చిన్న దీపం వంటివని మాకు తెలుసు. తక్కువ డబ్బుతోనే వత్తి, ప్రమిద, నూనె సమకూరుతాయి. కదా! కానీ ఆ దీపం రాత్రంతా వెలుగుతూనేవుంటుంది. చీకటిరాత్రిలో ఆ దీపం జనులను ఎదురుదెబ్బలనుండి, కాళ్ళల్లో ముళ్ళు, మేకులు గ్రుచ్చుకోకుండా, అలాగే పాము-తేలు కాటులనుండి రక్షిస్తుంది. **మీరు చిన్నవారైనంతమాత్రాన వచ్చిన నష్టమేమీ లేదు. చిన్నవారుగా ఉండుట ఆటంకమూ కాదు. రాత్రి సమయాన ఉండే నక్షత్రాలవలె మెరవండి.** "ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్, హౌ ఐ వండర్ వాట్ యు ఆర్" ఈవిధంగా చిన్న నక్షత్రాల వలె ప్రకాశించండి. **చిన్న నక్షత్రాల వలె మెరుస్తూ ఇతరులకు దారిచూపించవచ్చు.** ఎలా? "అప్ అబవ్ ది వరల్డ్ సో హై, లైక్ ఎ డైమండ్ ఇన్ ది స్కై" వజ్రం వలె, నక్షత్రం వలె, చిన్న నిప్పురవ్వ వలె మీరు చమక్కుమని మెరవవచ్చు. లోకమంగళమునకు, ఇతరులకు దారి చూపించటానికి, మార్గదర్శనము ఇవ్వటానికి, ప్రేమను పంచటానికి, పైకి లేవటానికి, సలహాలనివ్వటానికి, కాలిన గాయాలకు కట్టుకట్టి మందు వెయ్యటానికి మీరు అలా మెరవలేరా? మీరు అలా చెయ్యాలి.

మీరు మీ ఆకాంక్షలను మార్చుకున్నట్లయితే సంతోషం వెల్లివిరుస్తుంది. **1) మీ నడవడికను 2) దృష్టికోణాన్ని ఈ రెంటిని మార్చుకోవటము సులభమే.** కఠినమైన దేమిటి? ధనార్జన చేయుట కష్టమా? నీతి-అవినీతి అనే రెండు మార్గాలలో ధనోపార్జన చేయవచ్చు. 'గురుదేవా! మా కోరికలను తీర్చుకుంటాము.' పోనీ అలాగే కోరికలను తీర్చుకునేందుకు పూర్తి ప్రయత్నము చేసినా మీరు విజయాన్ని సాధించలేరు, అహంకారాన్ని తృప్తిపరచుకోలేరు అన్నది నా భావన. మీరు MLA అయితే ఎం.పి, ఎం.పి. అయితే మంత్రి, మంత్రి అయితే ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి అయితే రాష్ట్రపతి మిమ్మల్ని తక్కువచేసి మాట్లాడతారు. 'నువ్వు కూడా నావలె ఉన్నతిని సాధించి చూపించు ' అని ఎగతాళిచేస్తారు. అప్పుడు మీ మహత్వాకాంక్షలు, అహం ఎక్కడున్నాయి? కనుక మీ ఈ కోరికలు ఎప్పటికీ నెరవేరవు.

ఉల్లాసంగా నవ్వగలిగితే ఆరోగ్యంగా జీవించవచ్చు.

## శ్రేష్ఠమైన జీవితాన్ని గడపాలనే మహత్వాకాంక్ష

మీరు శ్రేష్ఠ జీవితాన్ని జీవించాలనే మహత్త్వాకాంక్షను తేలికగా నెరవేర్చుకోవచ్చు. దానిలో అడ్డంకులేమీ ఉండవు. ఉన్నతమైన, ఉదాత్తమైన పనులను బాధ్యతతో చేయగలిగినప్పుడు మీరు సాధించే అభివృద్ధిని గురించి ఎంతని వర్ణించగలము? చిన్నవారు, పేదవారు అయినప్పటికి మీ చేతిని ముద్దాడాలనీ, మీ కలమును స్పృశించాలని అందరి మనస్సు ఉవ్విళ్ళూరుతుంది. మీరు లోకసేవకు మీ ఇరుగుపొరుగు మొదలుకొని, మీ కుటుంబ సభ్యులు, మీ వీధిలోనివారు, మీ చుట్టుప్రక్కల ప్రాంతాలవారందరి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక విషయాలలో సేవలందించే విధానమును రూపొందించుకోండి. డబ్బుతో మీరు లోకసేవ చెయ్యలేకపోవచ్చు. కంబళ్ళు, రగ్గులు, మందులు పంచే అవకాశము మీకు లేకపోవచ్చు. అయినా వచ్చిన నష్టమేమీ లేదు. ఋషుల వద్ద సంపత్తి ఏముంది? **ఋషులు ప్రేమను, జ్ఞానమును, వెలుగును పంచారు. మీవద్దకూడా ఇవన్నీ ఉన్నా మీరు వాటిని ఎక్కడ పంచుతున్నారు? డబ్బు లేకపోతే వచ్చిన నష్టమేమీ లేదు. పైసలతో ఒరిగేదేమీ లేదు.**

## ఆసక్తిలేని యోగివలె జీవించండి

మీరు మీలో రెండు మహత్త్వాకాంక్షలను మార్చుకున్నట్లయితే మీరు ఎంతో సాధించవచ్చు అని భావిస్తున్నాను. ఈ రెండూ చెయ్యటానికి సిద్ధపడిన తరువాత మూడవ పని ఇంకొకటి ఉంది. దానికి ప్రయత్నించాలి? ఎలా ప్రయత్నించాలి? **మీరు నేతలుగా అవ్వటానికి ప్రయత్నించకండి, నటులుగా అవ్వటానికి సిద్ధపడండి.** నటులుగా ఎవరౌతారు? చలనచిత్రములో నటిస్తున్నప్పుడు **నటుడు ఒకసారి చక్రవర్తి అవుతాడు, మరోసారి సైనికుడు అవుతాడు, ఇంకోసారి మరేదో అవుతాడు.** మీరూ చక్రవర్తులుగా అవ్వగలరు. ఎటువంటి చక్రవర్తులుగా? **స్వామీ రామతీర్థుని వంటి చక్రవర్తిగా అవ్వగలరు.** రామతీర్థ తనను తాను ఎప్పుడూ చక్రవర్తి అని భావించేవారు, అలానే సంతకము చేసేవారు.

ఈ ప్రపంచములో ఉంటూనే, ఉండని వారి వలె జీవించండి. దాని పరిణామము ఏమిటి అవుతుంది? మీరు నాటకాలు ఆడేవారి వలె అన్ని పనులు చేస్తూ ఉండండి. అప్పుడు ఏమౌతుంది? రాజా హరిశ్చంద్రుని నాటకంలో అతని కొడుకు మరణించే సన్నివేశం వస్తుంది. అప్పుడు నటులు ఏడుస్తారు. ఆ సన్నివేశం పూర్తవగానే హరిశ్చంద్రుని కుమారుని వేషం వేసిన పాత్రధారి అక్కడినుండి లేచి తెరవెనుకకు వెళ్ళిపోతాడు. కదా! ప్రపంచంలోని మాయాజాలం ఇదే. **తనకు తానుగా ఏదైనా వస్తువుతో గాఢమైన అనుబంధాన్ని ఏర్పరచుకోవటము కూడా తప్పే.** మీరు మీ పనిని చెయ్యండి. ప్రపంచంలో రాత్రింబవళ్ళు, లాభనష్టాలు, జనన-మరణాలు సంభవిస్తుంటాయి. ఈ విషయాల మీద మీరు ఎక్కువ దృష్టిని పెట్టవద్దు. అలా పెట్టినప్పుడు ఆటు-పోటుల వలె మీ జీవితము రసవిహీనంగా తయారౌతుంది. మీరు విజయం సాధించినప్పుడు సంతోషంతో గంతులు వేసినప్పుడు కూడా మీ జీవితము రసవిహీనంగా మారి మీరు సమతాస్థితిని పోగొట్టుకుంటారు. మీకు కష్టాలు వచ్చినప్పుడు కూడా సమత్వము దెబ్బతింటుంది. అప్పుడు మీరు ఊయలవలె నిరంతరము ఊగిసలాడుతూ ఉంటే ఒక్కరోజు కూడా సుఖశాంతులతో గడిపే అవకాశము దొరకదు. అందువలన **మీరు కర్మయోగి వలె, ఆసక్తిలేని యోగి వలె జీవించండి.**

ఫలాపేక్షను వదిలివేసి కర్తవ్యాపేక్ష మీద దృష్టిసారించాల్సి ఉంటుంది. ఫలితము మాత్రము మన చేతిలో ఉండదు. 'మేము బాగా శ్రమించి పని చేసి ఉద్యోగంలో పదోన్నతిని పొందుతాము' అంటే దానికి గ్యారంటీ ఏమీ లేదు. అలాగే కష్టపడి పని చేసి 3 సంవత్సరములలో పదోన్నతిని సాధిస్తాము, మేము క్యూలో ఉన్నాము అంటే అప్పుడూ గ్యారెంటీ లేదు. కొంతమంది లంచమిస్తే, కొంతమంది మిమ్మల్నిదాటి ముందుకెళ్ళేవారు ఉంటే, మరికొంతమంది మీ ప్రతిభను సవాలు చేస్తారు. కనుక పదోన్నతిని సాధిస్తారు అన్న నమ్మకము లేదు. అలా జరగనప్పుడు మీకు చాలా బాధ కలుగుతుంది. మీ కష్టసుఖాలను పై అధికారికి చెప్పుకుంటున్నారు. అతను తన ఇష్టాన్ని అనుసరించి మీ పట్ల ప్రసన్నుడౌతాడు లేదా కోపం ప్రదర్శిస్తాడు. **మీ సంతోషాన్ని ఇతరుల పరం చేయకండి.** ఇలా చెయ్యడము ఎప్పుడు సంభవమౌతుంది? 'నేను నా బాధ్యతలను పూర్తిగా నిర్వహించాను, జరిగిందేదో జరిగింది' అనుకుంటూ కర్తవ్య నిర్వహణ చేయాలి. అలా చేసిన వ్యక్తి మాత్రమే సంతోషంతో ఉంటాడు.

మనం శ్రమించి వ్యవసాయము చేశాము. భవిష్యత్తులో ఏమి జరుగనున్నదో మనకు తెలియదు. వర్షం కురిస్తే పంట పండుతుంది లేకపోతే పండదు. ఏమౌతుంది? అతివృష్టి-అనావృష్టిలు సంభవించినప్పుడు తగిన ఉపాయములను చేస్తాము, అయితే పూర్తిగా శ్రమించి వ్యవసాయం చెయ్యటమే మన కర్తవ్యము. అంతే! దీని తరువాత మీ కర్తవ్యాలకు హద్దులు ఏర్పరచుకోండి. అప్పుడు ఏమౌతుంది? భవిష్యత్తులో మీకేమి జరుగుతుందో మాకు తెలియదు. భవిష్యత్తులో మీరు దొంగతనము చేసి బందీలుగా అవ్వవచ్చు లేదా వకీలుగా అవ్వవచ్చు. భవిష్యత్తులో

**నవ్వుతూ జీవించేవారు దీర్ఘకాలం సంతోషంగా జీవిస్తారు.**

జరుగబోయేవాటిని గురించి మేము చెప్పలేము. మేము చెప్పగలిగేది ఒక్కటే. మనిషి తన కర్తవ్యాలను నిజాయితీతో, విశ్వాసంతో, బాధ్యతతో నిర్వహించాలి.

## భూత-భవిష్యత్తులను గురించి ఆలోచించవద్దు

**ముసలివారు గడిచిపోయిన కాలమును గురించి ఆలోచిస్తూ ఉంటారు.** మా కాలంలో ఒక రూపాయికి 22 సేర్ల నెయ్యి దొరికేది. మనుష్యులు 18-19 అడుగుల ఎత్తు ఉండేవారు. మా కాలంలో ప్రపంచము ఇలా ఉండేది కాదు అని చెబుతు ఉంటారు. ఎప్పుడు చూసినా రామకథను లేక శివగాథను లేక పురాణాలను లేక గడచిన కాలమును వల్లె వేస్తూవుంటారు. పురాణాలలో వర్ణించబడిన శివపార్వతులు, వినాయకుడు మొదలైనవారి గురించి మాట్లాడుతూవుంటారు. వారు వెళ్ళిపోయి వేలాది సంవత్సరాలు గడిచిపోయాయి. ముసలివారు వయస్సుతోనేకాదు, బుద్ధితోకూడా వృద్ధులే. జరిగిపోయిన పురాణాది విషయాలను, గతకాలపు జ్ఞాపకాలను త్రవ్వుతూ ఉంటారు.

**బాలలు భావికాలము గురించి కల్పనలు చేస్తు ఉంటారు.** 'మేము పెద్దయ్యాక ఎమ్మెస్సీలో ఉత్తీర్ణులమై ఉద్యోగం సంపాదించు కుంటాము, అధికారులమౌతాము" అని చెప్తు ఉంటారు. అమ్మా! నాకు వివాహము అవుతుంది. తెల్లని అందమైన భార్య వస్తుంది. మేము నిన్ను విమానంలో తిప్పుతాము. చెల్లెలికి మిఠాయిలు తినిపిస్తాము' అంటారు. ఇవన్నీ చెయ్యటానికి మీ దగ్గర డబ్బెక్కడుంది? పిల్లలు తల్లిదండ్రుల వద్ద డబ్బులు తీసుకుంటారు. పైగా విమానంలో త్రిప్పుతాము కదా! అని చెప్తూ ఉంటారు. ఇలా భవిష్యత్తును గురించి కల్పనలు ఎవరు చేస్తారు? బాలలు చేస్తారు. గాలిలో మేడలు కట్టేవారివలె, సమయం దొరికినప్పుడల్లా 'నేను పెద్దయ్యాక ఎమ్.ఎస్.సి.లో ఉత్తీర్ణతను సాధిస్తాను, తర్వాత గెజిటెడ్ ఆఫీసర్‌ని అవుతాను, అలా అవుతాను, ఇలా అవుతాను' అని చెబుతూ, అలా కల్పనలు చేస్తూ ఉంటారు. ఎప్పుడు చూసినా పగటి కలలు కంటూ, గాలిలో మేడలు కడుతూ ఉంటారు బాలలు. భవిష్యత్తు మనిషి చేతిలో లేదు. భవిష్యత్తులో ఏమి జరుగుతుంది అనేది తెలియదు. దానికి గ్యారంటీ లేదు.

## యువకులుగా అవ్వండి - వర్తమానమును గురించి ఆలోచించండి

**యువకుడు, బాధ్యత కలిగిన వ్యక్తి కేవలము వర్తమానమును గురించి ఆలోచిస్తాడు.** 'ఈరోజు మేము ఏమి చేయగలము? ఏమి చెయ్యాలి? ఈనాటి పరిస్థితులలో మాకు ఉచితమైన దేది? అటువంటి స్థితిలో మేము ఏమి చెయ్యాలి?' ఈ ఆలోచనా విధానమంతా కర్మయోగి ఆలోచనలకు సంకేతములు. గీతలో ఇలా ఉంది. 'ఫలితమును గురించి ఆలోచించవద్దు, అలాగే ఏ వస్తువుతోనూ గాఢమైన అనుబంధాన్ని పెంచుకోవద్దు, అలా చేసినట్లయితే మీ సంతోషమంతా ఆ అనుబంధం గురించి వదలుకోవలసివస్తుంది. మీరు వేరుగా ఉంటూ ప్రతీ వస్తువునూ దర్శించండి. తేనెటీగ అలాగే చూస్తుంది. తినగలిగితే తింటుంది. కానీ ఏదైనా తేనెటీగ తేనెతుట్టెతో గాఢమైన అనుంబంధాన్ని ఏర్పరచుకొని, తేనెలోకి దూకితే, రెక్కలు ఇరుక్కుపోయి చివరికి ప్రాణాన్ని కోల్పోతుంది. **మీరు మీ రెక్కలను జీవితము లోతులలోకి చొప్పించకుండా, బయటినుండే జీవించండి. మరణించిన తరువాత ఆ ఇంటికే అతుక్కునిపోయి, అక్కడే ఎలుకగా పుట్టేంత అనుబంధమును ఆ ఇంటితో ఏర్పరుచుకోకండి. బంధాలను పెంచుకోవద్దు. పిల్లలతో ఎక్కువ అనుబంధాన్ని పెంచుకుంటే మరణించిన తరువాత ఆ ఇంట్లో నల్లిగా పుట్టవల్సివస్తుంది.** కనుక ఎవరితోనూ అంత అనుబంధాన్ని పెంచుకోవద్దు. విరాగివలె, కర్తవ్యనిష్ఠునివలె, యోగివలె జీవించండి.

## పంచకోశములు - పంచశీలములు

మూడవ సూచన మీరు మీ మన:స్థితిని పంచకోశములు జాగృతపరచుకునేందుకు సిద్ధంచేసుకోవాలి. పంచకోశములు అనగా పంచశీలములు. పంచతత్త్వములతో మీ శరీరము తయారైనవిధంగా మీ జీవితంలో పంచకోశములు మేళవించ బడాలి అని కోరుకుంటున్నాను. **ప్రాణ, అపాన, ఉదాన, వ్యాన, సమానాలనే పేర్లతో మీకు లభించిన పంచప్రాణాలు మీ ఆధ్యాత్మిక అభివృద్ధికి దోహదము చేసేవిధంగా సువ్యవస్థితంగా ఉండాలి.** పంచశీలములు మీ జీవితంలో కలిసిపోవాలి.

మీ అనుబంధాలు తామరాకుమీద నీటిబొట్టు వలె పైపైన ఉండాలి. మీరు ప్రతి పనిలోనూ పూర్తి బాధ్యత, పూర్తి తన్మయతను చూపించాలి. మీరు సంపూర్ణ విశ్వాసముతో, పూర్తి శ్రమతో పని చేశారు అన్న విషయానికి మాత్రమే గర్వించాలి. మీకిది చాలు, అంతే! మీరు పూర్తి బాధ్యతతో శ్రమించి పనిచేశారు కనుక ఆనందకరమైన పరిస్థితులను అనుభవించే అవకాశము లభించింది. నేను శ్రమించాను అన్న ఆనందము మీకు లభిస్తే చాలు. మీకు ఈ సంతోషము లభిస్తే నేను మిమ్మల్ని కర్మయోగులు అని పిలుస్తాను.

## 4 వ పంచశీలము - విభూతుల సద్వినియోగము

నేను మీకు చెప్పబోయే నాల్గవ విషయము - మీకు లభించిన

కోపం అనారోగ్యాన్ని కలుగజేస్తుంది.

వస్తువుల నన్నింటిని సరైన రీతిలో ఉపయోగించటము నేర్చుకోండి. క్రొత్త వస్తువులు లభించాలి అనే ఇచ్ఛయే నిరంతరము మనకు ఉంటుంది. కానీ మీ దగ్గరున్న వస్తువులను ఉపయోగించుకునే విధానము మీకు వచ్చునా? **ప్రపంచములో అన్నింటికంటే విలువైనది సమయము.** దీన్ని మీరు అవగాహన కూడా చేసుకోవట్లేదు. సమయాన్ని మించిన అత్యంత ఉత్తమమైన సంపద మరేదీ మనుష్యుల వద్ద లేదు. ఉండదు. **భగవంతుడు మనిషికిచ్చిన అతి ఉత్తమోత్తమమైన సంపద సమయము. డబ్బుతో మీరు బజారులో లభించే కోరుకున్న వస్తువులన్నీ కొనుగోలు చేయవచ్చు. మీకు సమయము అనే సంపద ఇవ్వబడినది. దానితో పరలోకమును, భూలోకమును, సుఖమును, విద్యను, జ్ఞానమును కొనుక్కోవచ్చు.** దుకాణాలన్నీ తెరిచేవున్నాయి. కోరుకున్న వస్తువును కొనుగోలు చేయండి. దీనికి మీరు మీ సమయమును, శ్రమను వెచ్చించాలి. మీకు సమయము విలువ తెలియదు, దాన్ని అర్థము చేసుకొంటే చాలు.

## సమయ పాలన

**రావణుడు సమయమును తన అధీనంలో ఉంచుకున్నాడు.** మీరు కూడా కాలమును మీ చేతికి కట్టుకున్నారు. అయితే దాన్ని ఆటబొమ్మ వలె, ఆభరణము వలె పెట్టుకున్నారు. దాన్ని ధరించటానికి అర్థమేమిటి అనేది తెలుసా? **గడియారానికి అర్థము సమయపాలన.**

భగవంతునిచే సృష్టించబడిన వస్తువులన్నింటితోపాటు – సమయము, డబ్బు, శ్రమ, బుద్ధికూడా ఉన్నాయి. వాటిని సంపూర్ణమైన రీతిలో ఉపయోగించుకోవాలి. మనం మీరు వీటిని పనికిరాని పనులలో వెచ్చిస్తున్నాము. వాటిని అనర్థకార్యములు అంటారు. ఉదా॥ బుద్ధి. బుద్ధిని మీరు దొంగతనాలు చెయ్యటానికి, ఇతరులను కూల్చటానికి వినియోగిస్తే ఏమౌతుంది? ఆ పని అనర్థకార్యము అనబడుతుంది. డబ్బును మీరు ఇటువంటి కొన్ని దుష్కార్యములలో వినియోగించారు అనుకుందాము. ఉదా॥ త్రాగుడు, ఇతరులను చెడ్డవారిగా చూపించటానికి. అప్పుడు అది అనర్థకార్యము అని పిలువబడుతుంది. కొంత సమయాన్ని మీరు గొప్పలు చెప్పటానికి వెచ్చిస్తే, మీరు మీ సమయాన్ని దుర్వినియోగము, వృథా చేస్తున్నట్లే భావించాలి. సార్థకత అనేది ఒకటుంది. ప్రతి పైసాను సార్థకమైన రీతిలో వెచ్చించాలి. 'నేను చాలా పొదుపరిని' అని మీకు ఒకసారి చెప్పాను. అయితే మీరు మమ్మల్ని పిసినారి అని అంటారు. మేము పిసినారులము కాదు. మాకంటే ఉదారులు ప్రపంచములో మరెవ్వరూ ఉండబోరు. మేము మా ధనమును, సమయమును సంపూర్ణంగా సత్కార్యాలలోనే వెచ్చించాము. దాచుకోవచ్చును, కానీ మేము వాటిని సత్కార్యములలోనే వెచ్చించాము.

## సార్థకమైన పనులలో వినియోగించుట

**సమయాన్ని, శ్రమను, బుద్ధిని, ధనమును సంపూర్ణంగా సార్థక కార్యములలోనే వెచ్చించాలి. మీ సమయాన్ని, శ్రమను, బుద్ధిని ఉపయోగించి అమరులు అవ్వవచ్చు.** అలాగే మన మిత్రులు, పరిస్థితులు, కుశలత, యోగ్యతలను కూడా సద్వినియోగము చేయటము నేర్చుకోవాలి. వీటన్నింటిని మనం ఉత్తమమైన రీతిలో ఉపయోగించటం నేర్చుకున్నట్లయితే అది మన పాలిట అదృష్టమే అవుతుంది.

కాదండీ వాటితో మాకు క్రొత్త వస్తువులు రావాలి అని కోరుకుంటే సరే, చేసేదేముంది. భగవంతుడు మీకు క్రొత్త క్రొత్త వస్తువులను ప్రసాదించుగాక! గురుదేవా! మీరు మాకు పుత్రుడిని అనుగ్రహించండి అని అడుగుతారు. మరి పుత్రికల మాటేమిటి? స్త్రీని చిన్నచూపు చూస్తారు. అలా కాదు. మీరు ముందు మీ పుత్రికను యోగ్యురాలిగా చెయ్యండి. దానికోసము మీ సంపూర్ణ శక్తిని వెచ్చించండి. మీ కుమార్తెను చక్కగా తీర్చిదిద్దినట్లయితే ఆమె నెహ్రూగారి కుమార్తె ఇందిరవలె తయారవుతుంది. పుత్రికను ఉన్నతమైన స్త్రీగా తీర్చిదిదిద్దలేనప్పుడు, పుత్రుడిను కూడా తీర్చిదిద్దలేరు. **క్రొత్త క్రొత్త వస్తువులను కోరుకునేబదులు, క్రొత్తవి అభిలషించేబదులు, క్రొత్త కోరికలు తీర్చుకునేబదులు మన ముందున్న పరిస్థితులు, వస్తువులను మనం అత్యుత్తమరీతిలో, సరైన విధంగా ఉపయోగించుకునే రీతిని నేర్చుకోవాలి.** అలా చేయటమే గొప్ప విషయము. క్రొత్త వస్తువులను కోరుకోవద్దు అని మేము చెప్పటము లేదు. క్రొత్త వస్తువులను పొందే ప్రయత్నమూ చెయ్యండి, కానీ ఉన్న వస్తువులను సద్వినియోగము చెయ్యటం నేర్చుకోండి.

## ఒంటరిగా భుజించకండి

ఇది నాల్గవ ప్రయత్నానికి తగిన శిక్షణ నిస్తుంది. మీకొక విషయమును చెబుతాము. దాన్ని మరిచిపోవద్దు. **మీ వద్ద ఉన్నదంతా మీ కొరకే కాదు అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోండి.** ఇదంతా మేము సంపాదించినదే కదా! అన్నా కూడా ఆ సంపాదన మొత్తము మీకే చెందదు. సంపాదించినదాన్ని ఇతరులతో పంచుకొని తినండి! మా సంపాదనను ఇతరులతో ఎందుకు పంచుకోవాలి? అన్నది మీ ప్రశ్న. నీ తల్లికి, చెల్లికి, అన్నకి ఇలా నీ కుటుంబ సభ్యులందరికి ఆహారాన్ని అందించవా? ముందుగా

భవిష్యత్తును వర్తమానం నిర్ణయిస్తుంది.

వారికి పంచు. వారికీ ఆహారాన్ని సమకూర్చుతావు. **పంచుకొని తినుట మంచి పని. అలా చేయకపోతే అది జీర్ణమవ్వదు.**

## సిద్ధాంతాల కుటుంబము

పంచుకొని భుజించు అన్నదానికి అర్థము – కుటుంబము వరకే పరిమితమవ్వు అని కాదు. పంచుకొనుట అనేదాని హద్దులు పెంచాలి. మనకు మరో కుటుంబము ఉంది. దాన్ని మనం ప్రపంచం అంటాము. మనకు భగవంతుడు ప్రసాదించిన రెండు చేతులు ఉన్నాయి. ఒక చేత్తో మనమీద ఆధారపడి బ్రతుకుతున్నవారికి, దు:ఖితులకు, మననుండి సహాయము ఆశిస్తున్నవారికి సహాయము చెయ్యాలి. వారిని మనము దీనులు, దు:ఖితులు, పీడితులు, పతితులు అనవచ్చు. బుద్ధి, నడవడిక, దృష్టికోణములో కూడా వారు పతితులై ఉండవచ్చు. అంధులు, కుష్ఠురోగులు మాత్రమే మన దయకు పాత్రులు కారు. **ఆచరణపరంగా, నిజాయితీపరంగా, ఆలోచనా పరంగా ఉత్కృష్టత లేని వ్యక్తిని కూడా రోగి కంటే తక్కువగా భావించరాదు. అతను కూడా దయకు పాత్రుడే. అతనికి కూడా మనం సహాయం చేయాలి. మనకంటే తక్కువ స్థాయిలో జీవిస్తున్నవారికి సహాయం చేయటం, వారి బాగోగులు చూడటము మన కర్తవ్యము.** ప్రపంచమంతటా వ్యాపించియున్న శ్రేష్ఠగుణాలను అందించి మననుండి సహాయం ఆశించేవారికి, ఆర్తులకు, యాచించినవారికి సేవ చేయాలి, సహాయం చేయాలి.

దేశం, ధర్మం, సమాజం, సంస్కృతులు కూడా మన కుటుంబమే. అవి కూడా మన సోదరులే, పుత్రులే. ఇవి కూడా మన వంశానికి చెందినవే. మీకు కేవలము మీ కుటుంబమును, భార్యనే మీదిగా భావించే సంకుచిత పరిధి ఉండరాదు. కేవలము మీ పుత్రులనే మీవారిగా భావించే సంకుచితత్త్వము ఉండరాదు. **ఇతరుల బిడ్డలను కూడా మీ సంతానముగానే భావించండి.** ఈ సమాజము చాలా విశాలమైనది. భగవంతుడు మీకు రెండు చేతులను అనుగ్రహించాడు. ఒక చేత్తో ఏమి చేయాలో పైన చెప్పాము. ఇక రెండవ చేత్తో ఏమి చేయాలి? మీ దగ్గరున్నదంతా అడిగినవారికి పంచిపెట్టండి. **భగవంతుడు కోరుకుంటున్నది మీరు యజ్ఞార్థమై అంశదానమివ్వాలి, కొంత వెచ్చించాలి అని. డబ్బు లేకపోతే సమయాన్నివ్వండి, శ్రమను, బుద్ధిని, సామర్థ్యాన్ని, ఆలోచనను ఇవ్వండి.** మీ దగ్గర ఇవన్నీ ఉన్నాయి కదా! ఇవ్వండి. మనం సంపాదించినదంతా మనమే ఖర్చు పెట్టరాదు. గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు. **'తన కోసము సంపాదించుకునే వ్యక్తి, తన కోసమే వండుకుని భుజించే వ్యక్తి ఆధ్యాత్మిక దృష్టిలో దొంగ'.** అయితే యజ్ఞశేషమును భుజించే వ్యక్తి అమృతమును భుజిస్తున్నాడు. 'యజ్ఞశిష్టాశిన: సన్తో ముచ్యతే సర్వకిల్బిషై:' (3/13)

## సంతులుగా, శ్రేష్ఠులుగా అవ్వండి

మన జీవితంలో ధనం ఉంది, సమయం ఉంది, వాటిని పూర్తిగా మన స్వార్థానికి, మన కుటుంబీకులకు మాత్రమే అనుకోక భావనలు ఉదారంగా ఉండాలి. మీరు మీ అంతరంగంలో ఉదారతను పెంపొందించుకొండి. దయాగుణాన్ని పెంచుకోండి. సేవావృత్తిని వికసింపజేసుకొండి. విలాసవంతులుగా ఉండకండి. మీ ఖర్చులో కొంత పొదుపు చేయండి. **పొదుపు చేసిన డబ్బులో కొంత అంశదానము రూపంలో, పతిత, పీడితులకు పంచండి,** శ్రేష్ఠమైన వ్యక్తులకు, శ్రేష్ఠగుణాలను వ్యాపింపజేయటానికి ఖర్చుపెట్టండి. పైకి లేవటానికి ప్రయత్నిస్తూ, తమ దాహమును తీర్చమని మీ సహాయం అర్థించేవారికి చేయూతనివ్వండి. **సూర్యార్ఘ్యదానంలో మనం ఒక చెంబుడు నీటిని సూర్యదేవునకు అర్ఘ్యంగా సమర్పిస్తాము.** పైన చెప్పిన వృత్తుల పరిపోషణకు **అవసరమైన సహాయమును అందించాలి అన్నదే మహాకాలుని పిలుపు.** శ్రేష్ఠ జీవితమును జీవించండి. పంచశీలములను పాటించండి. శాస్త్రములలో పంచదేవతల మహిమ, గరిమ గానం చెయ్యబడినది. మీరు మీ జీవితంలో ఈ పంచదేవతలను దింపుకోండి. సంతులుగా, శ్రేష్ఠులుగా, నిజాయితీపరులుగా అవ్వండి. ఋషులుగా, మహామానవులుగా మారండి. **నరుని నుండి నారాయణునిగా మారే ప్రయత్నము చెయ్యండి.** మిమ్మల్ని మీరు పురుషుని నుండి పురుషోత్తమునిగా తీర్చిదిద్దుకుని, ఆ స్థాయికి ఎదగండి.

## పంచశీలములకు ఐదు విద్యలు

పైన చెప్పినవే పంచశీలములు. మీరు ఈ పంచశీలములను దృష్టిలోపెట్టుకున్నట్లయితే, హృదయంగమం చేసుకున్నట్లయితే, పంచవిద్యలను బాగా గుర్తుంచుకున్నట్లయితే మీ జీవితాలు ధన్యమౌతాయి. ఈ ఐదు విద్యల మీద ఆధారపడి మేము మా జీవితాలలో మార్పులు–చేర్పులు చేసుకోవచ్చునా? వర్తమాన జీవితములో, ప్రస్తుత పరిస్థితులలో కొన్ని మార్పులు చేయుట సంభవమేనా? అని ఆలోచించండి. నిజానికి ఈ భావనలే మీకు నూతన భవిష్యత్తును నిర్మిస్తాయి. అవే మీయొక్క మరియు మొత్తం ప్రపంచము యొక్క నిర్మాణానికి తగిన భూమికను అందిస్తాయి.

*– అఖండజ్యోతి, జనవరి 2010*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

మార్పు భయాన్ని కలుగజేస్తుంది.

జీవించేకళ

# నవ్వే నవనీతం-నవ్వే సంజీవని

నవ్వుతూ జీవించటం ఒక కళ. మానసికోల్లాసానికీ, శారీరిక దారుఢ్యానికీ నవ్వు ఒక దివ్యౌషధం. నవ్వు ఒక ఆధ్యాత్మిక సద్గుణం. మానసిక రోగులకు సంజీవని. ఒక్కమాటలో చెప్పాలంటే–మానవునికి విలువకట్టలేని ఆభరణం నవ్వే.

తీవ్ర ఆలోచనలతో హృదయం బరువెక్కిపోగా, కొందరు ఏం చేయాలో తోచక దిగాలుపడిపోతారు. అలాంటి వారు చిరునవ్వులు చిందించే కళను అభ్యసించాల్సి ఉంటుంది. మొట్టమొదటగా చేయాల్సిన పని ఏమంటే – లేచింది మొదలు మనకు తారసపడిన వారందరినీ చిరునవ్వుతో పలకరించటం అలవాటు చేసుకోవాలి. దానివల్ల అవతలివారు కూడా చిరునవ్వుతో పలకరిస్తారు. మన మనస్సులోని భారం కొంతవరకు దిగిపోతుంది.

**నవ్వుతూ గడిపే వారెప్పుడూ ఉద్విగ్న మనస్కులు కాలేరు.** జీవితంలో ఎదురయ్యే దుఃఖాలు వారిని అంతగా బాధించవు. మానసిక రోగులను మాత్రమే అకారణ భయం, అనుమానాలు, కోపం, విపరీతపు ఆలోచనలు బాధిస్తుంటాయి. వారి మనస్సులలోని ఆ భావాలన్నీ ముఖంపైన ప్రతిఫలిస్తూ ఉంటాయి. వీటన్నింటికీ ఏకైక పరిష్కారం చెరగని చిరునవ్వు. అందువల్లనే మానసిక వైద్యులు తమ వైద్య విధానంలో రోగిని చిరునవ్వుతో ప్రేమగా పలకరించటం అభ్యాసం చేస్తారు. అదే రోగులకు ప్రాథమిక చికిత్స.

చిరునవ్వు వల్ల అనేకానేక లాభాలున్నాయి. ముఖ్యంగా చిరునవ్వులు చిందించే వ్యక్తి ఏ ఆభరణాలూ లేకున్నా మిక్కిలి సుందరంగా కనిపిస్తాడు. కోపిష్టి అయిన వ్యక్తి కూడా నవ్వటం అలవాటు చేసుకుంటే – అతని ముఖం వికసించిన కమలమే అవుతుంది. మెల్లమెల్లగా అతని శత్రువులు కూడా మిత్రులుగా మారిపోతారు.

చిరునవ్వును వీడకుండా మసలుకుంటే ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. మనస్సు ఉల్లాసంతో చిందులు వేస్తుంది. అటువంటి వ్యక్తిని చూస్తుంటే బాధలో ఉన్న వ్యక్తికి కూడా కొంతలో కొంత ధైర్యాన్ని పుంజుకుంటాడు.

పెదవులపై చిందులాడే చిరునవ్వును చూస్తుంటే, అది భగవంతుని అపూర్వ వరం అనిపిస్తుంది. నవ్వుతూ జీవించేవారికే విజయాలు సిద్ధిస్తాయి. చిరునవ్వుతో మాట్లాడితే – మనిషి తన వ్యక్తిగత బాధలను ఎదుటివారికి పంచకుండా మరుగుపరచ గలుగుతాడు.

పెద్ద పెద్ద ఆఫీసుల్లో, దుకాణాల్లో స్వాగతించి పలుకరించే వారిని ఎంపిక చేసేటప్పుడు అన్ని యోగ్యతలతో పాటు నవ్వు ముఖానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. **దరహాసభరిత స్వాగతంతోనే అభివృద్ధి ముడిపడి ఉంటుంది మరి.**

**నవ్వుతూ తుళ్ళుతూ ఉండే వ్యక్తి ఎప్పుడూ ఉల్లాసభరిత వాతావరణంలో ఎక్కువగా పని చేయగలుగుతాడు. తాను చేయటమే కాకుండా తన తోటి వారితో చేయించగలుగుతాడు.**

చిరుదరహాస వదనుడు ఎలాంటి చిరాకుకు, పరాకుకు గురికాకుండా నూతనోత్సాహాన్ని పుంజుకుంటూ ప్రక్కవారికి దాన్ని పంచిపెడతాడు.

నవ్వుతూ జీవించేవాని చుట్టూ మిత్రబృందం గుమికూడి ఉంటుంది. చూచిన ప్రతివానిచేత అతడు ఆకర్షింపబడతాడు. అతనికి మిత్రుల సంఖ్య పెరిగిపోతూ ఉంటుంది.

నిరాశా నిస్పృహలతో నీరుగారిపోతున్నవారు తమతోపాటు ఎదుటివారిని కూడా నీరుగారుస్తారు. అందువల్ల అలాంటివారితో వ్యక్తులు లాంఛనప్రాయంగానే మాట్లాడతారు. వారితో మిత్రత్వం పెంచుకోరు. ఎందుకంటే ఎవరు తమ సంతోషాన్ని వదలుకోవడానికి సిద్ధపడరు. నిరాశావాదులు కుటుంబజీవితంలో కూడా రాణించలేరు.

ఆనందాన్ని ఆశ్రయించినవాడే జీవితంలో సుఖ సంపత్తులతో తులతూగగలడు. అటువంటి వారి సహవాసాన్నే సహజంగా అందరూ కోరుకుంటారు.

సుఖ శాంతులతో జీవించాలంటే, వ్యక్తులు తమ దృష్టికోణాల్ని మార్చుకుని చిరునవ్వును అభ్యాసం చెయ్యక తప్పదు. నవ్వే నాణ్యత. నవ్వే నవనీతం. నవ్వే సర్వస్వం.

★★★

విజయాన్ని సాధిస్తామనుకుంటే విజయావకాశాలు పెరుగుతాయి.

సాధనా విజ్ఞానం

# ఉపాసన తప్పనిసరి - సాధన దానిని మించినది

విత్తనాలు నాటే ముందు ప్రతి రైతు తన పొలాన్ని చదును చేసి దానిలో ఉన్న చెత్త చెదారాన్ని, కలుపు మొక్కలను ఏరివేసి బాగా నీటితో తడిపిన తరువాత మంచి ఎరువు వేస్తే అప్పుడు ఆ భూమి సేద్యానికి అనుకూలంగా మారుతుంది. అప్పుడు మంచి విత్తనములు చల్లితే చక్కని పంట ఏపుగా పెరిగి పంట దిగుబడి బాగా వస్తుంది.

**ఉపాసన అనేది మన మనోభూమిలో ఏపుగా పెరిగే విత్తనం వంటిది.** అది చక్కగా పుష్పించి ఫలించే విధంగా ఎలా వస్తుందంటే ముందుగా రైతు పొలాన్ని పంటకు అనుకూలంగా ఎలా చదును చేసుకుంటాడో అదేవిధంగా మనోభూమిలోని అనేక అనాలోచిత విషయాలను సవరించుకొని ఉపాసన కొరకు సిద్ధపరచుకోవాలి. మనోభూమిని శుద్ధి చేసుకొనకపోతే ఉపాసనా బీజాలు మరుభూమిలో వేసిన విధంగానో లేక వరదలోపడి కొట్టుకు పోయిన విధంగానో అవ్వచ్చు. లేదా కుళ్ళిపోవచ్చు. ఏ పక్షుల నోటిలోనో లేక ఎలుకలు లేక అరణ్య జంతువుల ఆహారమవచ్చు.

ఉపాసన ఎంత పవిత్రత పరిపూర్ణమయినదో సాధన కూడా అంతే. మనం ఉపాసన మీదే కాకుండా సాధన విషయంలో కూడా ఎంతో దృష్టి పెట్టవలసి ఉంటుంది. మన జీవితంలో ఉచ్చస్తరీయ సంతులనంతోపాటు ఎంతో గొప్ప ఆదర్శాలతో నింపుకొని, మనం చేసే మంచి కర్మల స్వభావాలను చాలా ఉన్నతంగా ఉంచేటందుకు నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలి. ఇలా ప్రయత్నించే పద్ధతినే "జీవించేకళ" లేక "జీవిత సాధన" అంటారు. ఉపాసన మరియు పూజలో చేసే క్రియాకలాపాలన్ని ఒక నిర్ధారిత సమయంలో పూర్తి అవుతాయి. కాని "సాధన" మాత్రం 24 గంటలు చేయవలసి ఉంటుంది. మన ఆలోచనలు మరియు క్రియా కలాపాలన్నింటి మీద ప్రతిక్షణం ఏమరుపాటు లేకుండా గమనిస్తూ ఒక "కాపలాదారులాగా" నిరంతరం అప్రమత్తతతో ఉండి నిఘావేస్తూ ఉండాలి. ఏదైనా పాపపంకిల కార్యం మీద చూపుపడితే వెంటనే దాన్ని ధైర్యంగా సవరించుకునే పరిస్థితినే 'సాధన' అంటారు. సైనికులు కోట గోడల మీద ఉండి శత్రువుల యొక్క కదలికలను ప్రతిక్షణం గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అవసరమయితే పోరాటానికి ఎలా సిద్ధపడతారో ఆ విధంగానే మన జీవన పోరాటంలో ప్రతి మలుపులోనూ అప్రమత్తంగా ఉండటమే సాధన యొక్క సరియైన నిర్వచనం.

భజనలు చేసినంత మాత్రాన పాపాలన్నీ ప్రక్షాళనమయి భగవంతుడు ప్రసన్నుడవుతాడని అనుకోవటం మంచి పద్ధతికాదు. పూజ, జపం చేసిన తరువాత ఎలాగయినా ఉండచ్చని, పవిత్రంగా ఉండేందుకు తాపత్రయపడక్కర్లేదనే ఆలోచనలు మనల్ని ఆధ్యాత్మిక మార్గం నుండి తప్పు దోవను పట్టిస్తున్నాయి. వీటిని తరిమివేయాల్సి ఉంటుంది. మన భారతీయ ఋషి సాంప్రదాయాలు ఆధ్యాత్మిక తత్వజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవటం ద్వారా మాత్రమే ఉపాసన, సాధనల ఆధ్యాత్మిక ప్రగతికి ముఖ్యమైన అంశములుగా నిలచిపోయాయి. ఇవి రెండూ కూడా ఒకదానిని మరొకటి విడదీయరాని బంధాలు ఒకటి లేకుండా రెండోది లేదు. ఏవిధంగా అన్నము-నీరు; రాత్రి-పగలు; శీతలము-ఉష్ణము; స్త్రీ-పురుషులు కలిసి ఉంటారో ఆవిధంగానే ఉపాసన-సాధన ఒకదానికొకటి అన్యోన్యాశ్రయాలు. ఒకటి లేకుండా రెండవది ఉండటమనేది అసంభవము, అనివార్యము. అందువల్ల ఈ రెండిటిలోనే ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించుట ఆవశ్యకమైంది.

గాయత్రి ఉపాసన జీవన క్రమము ఉత్కృష్టతతో నిండిన ఆదర్శవంతమైన జీవనధారగా ఉండి తీరాలి. మత్తు పదార్థాన్ని సేవిస్తే తప్పకుండా మత్తు వస్తుంది. భక్తితో నిండిన జీవితం కూడా సజ్జనత్వం కూడిన ప్రగతిశీల రూపంగానే కనిపించాలి. అందుకనే మన ఉపాసనా పద్ధతి ఎల్లప్పుడూ సంపూర్ణంగా ఉండి తీరాలి. దానిలో ఆత్మ నిరీక్షణతోపాటు, ఆత్మనిర్మాణము, ఆత్మ వికాసము పరిపూర్ణమయిన ప్రక్రియతో జోడించబడి ఉండాలి. ఉపాసన-సాధన అనేవి స్వతంత్రంగా ఉండే అంగాలని ఒకటి వదిలితే ఏముంది రెండోది ఉందిగదా అనుకోవటంలో అర్థం లేదు.

భావానాత్మకమయిన గాయత్రి పూజవలె సదాచారణ ద్వారా ఉపాసన చేయవచ్చు. మనం పాపరహితులు అయినంత మాత్రాన సరిపోదు. మనం సద్గుణవంతమయిన కర్మాచరణ ద్వారా, దివ్య జీవన మార్గంలో పయనించటం వలన మనకే కాకుండా సమస్త మానవాళి యొక్క శ్రేయస్సు జరుగుతుంది. మంచిశీలంతో వ్యక్తిత్వంతో కూడిన వికాసవంతమైన ఆత్మమార్గంలో పయనించుట చేత పరిపూర్ణమయిన జీవన సఫలతను పొందగలము.

*- అఖండజ్యోతి, మే 2005*

*అనువాదం : జి. చెన్నకేశవరావు*

మనమీద మనకు నమ్మకం ఉండాలి.



ధారావాహిక: హనుమత్ కథామృతం-34

# హనుమంతునిలో అంకురించిన సేవాధర్మం

చాలారోజుల తర్వాత హనుమంతుడు తన నివాసానికి చేరుకున్నాడు. అక్కడ కూడా ఆయన మనస్సులో శ్రీరాముని గూర్చిన ధ్యాసయే. పురజనులు, పరిజనులు, రాజభవనంలో కర్మచారులు అందరూ కూడా హనుమంతుని కలవడం కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. సూర్యగ్రహణం దీర్ఘంగా కొనసాగడంతో ప్రకృతిలో విచిత్రమైన మార్పులు వచ్చాయి. హనుమంతుడు ఇంతకాలం ఎక్కడ ఉన్నాడో, ఏం చేస్తున్నాడో ఎవ్వరికీ తెలియదు. కాని హనుమంతుని ప్రేమ వారి భావనలను కట్టిపడేశాయి. అందరిమనసుల్లో ఎంతో కొంత ఊరట లభించింది.

**ప్రార్థన వల్ల అసంభవాలు కూడా సంభవాలు అవుతాయని** సృష్ట్యాది నుండి అందరూ విశ్వసిస్తున్నారు. అందుకే సూర్యగ్రహ సమయంలో అందరూ ప్రార్థనలతో, అనుష్ఠానాలతో, వ్రతాలతో, ఉపవాసాలతో, ఆరాధనలతో గడిపివేశారు. **హృదయ పూర్వకంగా చేసిన ప్రార్థన ఎప్పుడూ, ఎక్కడా విఫలం కావడం జరగలేదు.** అదే ఇప్పుడూ జరిగింది. అంజనానందనుడు క్షేమంగా ఇల్లు చేరుకున్నాడు. హనుమంతుని ముఖదర్శనంతో అందరి మనస్సులు కుదుటపడ్డాయి. మనస్సులో విషాదం తొలగిపోయింది. వారి విషాదాన్ని చూచి అంజనీదేవి, వానరరాజు కేసరి తలడిల్లిపోయారు. "మీ అందరి ప్రేమమయమైన ప్రార్థనలతో మా కుమారుడు క్షేమంగా తిరిగి వచ్చాడు" అంటూ వారందరికీ ప్రేమతో కృతజ్ఞతలు తెలియచేశారు. విశ్రాంతి తీసుకోవడానికి హనుమాన్ భవనంలోనికి వెళ్ళుతూ అందరి దగ్గరా అనుమతిని కోరాడు.

"మంచిది. మీరు ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నారు. మాకదే చాలు. మీ దర్శనంతో బాధలన్నీ తొలగిపోయాయి. మీరు కఠినమైన యాత్ర చేసి వచ్చారు. విశ్రాంతి తీసుకోండి" అంటూ అందరూ వారి వారి గృహాలకు వెళ్ళిపోయారు. హనుమంతుడు రాజమహలులో ఉన్న తన విశ్రాంతి గదికి వెళ్లిపోయాడు. తాను చాలాకాలం తర్వాత ఇంటికి వచ్చినట్లు అప్పుడు అర్థమైంది హనుమంతునికి. క్షేమంగా తిరిగి వచ్చినందుకు తను కూడా ఎంతో సంతోషించాడు. ప్రయాణ బడలిక ఇప్పుడు తెలుస్తోంది. విశ్రాంతి గృహంలోనికి వెళ్లిపోయాడు.

రామనామ ధ్యాసతో అతనికి విశ్రాంతి లభించడంలేదు. రామనామ జపంతో రోమాలు పులకించిపోతున్నాయి. రామచంద్ర ప్రభువును ఎప్పుడూ దర్శిస్తానా అని అలమటించిపోతున్నారు. ఆతని ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో రామనామమే నిండి ఉంది. సదాశివుడు తన వరదానాన్ని తానే తప్పక నెరవేరుస్తాడని నమ్ముతున్నాడు. అంతవరకు ఎదురు చూడక తప్పదని అర్థమయింది. ఆతడు జన్మించిన నాటి నుండి రామనామాన్ని జపిస్తూనే ఉన్నాడు. కానీ శ్రీరాముని సేవించాలన్న భావం కలుగలేదు. తల్లిదండ్రుల సేవను గురించి మాత్రమే ఆలోచించేవాడు. వారు మాత్రం ఇతని సేవలను అందుకునే వారుకాదు. సేవ చేస్తానని దగ్గరకుపోతే ప్రేమను చూపించి దగ్గరకు తీసుకునేవారు.

బాలుడైన హనుమాన్ ఆలోచనలు వయస్సుకు మించి పోతున్నాయి. "కుమారా! ప్రభు సేవకొరకు నీవు జన్మించావు" అని ఋషులు అన్నమాట ఆతని చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంది. దానికి అనురూపంగానే జీవితాన్ని మలచుకోవాలి అనుకున్నాడు. తల్లికూడా ఎప్పుడూ ఆ మాటే చెబుతూ ఉండేది. "అయ్యా! నువ్వు శ్రీరామచంద్రుని సేవించాలి. శ్రీరాముని సేవయే నీ భక్తిని రుజువు చెయ్యాలి" అని చెపుతూ ఉండేది. ఒకసారి "అమ్మా! నిజమైన సేవ ఎలా ఉంటుంది?" అని ప్రశ్నించాడు తల్లిని. తల్లీ గంభీరంగా – **"నాయనా! శరీరం నుండి సోమరితనాన్ని, మనస్సు నుండి అహంకారాన్ని తొలగించుకున్న వారు నిజమైన సేవకులు. నిస్వార్థంగా వారు చేసిన సేవయే నిజమైన సేవ.** నిజమైన సేవకునికి సోమరితనం, అహంకారం ఉండవు. అతడు తన తనువును, మనస్సును తన ఆరాధ్యుని పాదల చెంత అర్పణ చేస్తాడు. తనను తాను సంపూర్ణంగా సమర్పణ చేసుకుంటాడు. తన కోసం అంటూ ఏదీ ఏమీ మిగుల్చుకోడు. తన కోసం అంటూ మిగుల్చుకునేవాడు నిస్వార్థంగా సేవ చేయలేడు" అని జవాబిచ్చింది.

కన్న తల్లి మాటలు హనుమంతుని మనస్సును బాగా స్పందింపచేశాయి. తల్లివంక అలాగే చూస్తూ నిలబడ్డాడు. తల్లి మరలా "కుమారా! ఆధ్యాత్మిక జీవన విధానమే వేరుగా ఉంటుంది. సాంసారిక జీవనానికి పూర్తి వ్యతిరేకం. ఒక్కమాటలో చెప్పాలంటే సాంసారిక జీవనానికి ఆధ్యాత్మిక జీవనం శీర్షాసనమే అనక తప్పదు. సామాన్య జీవితంలో ఎంతో కొంతసేపు విశ్రాంతికి కేటాయించడం జరుగుతుంది. **కానీ సేవకుని విషయంలో విశ్రాంతి**

**జీవితం వ్యర్థమనుకుంటే మనో కాలుష్యం పెరుగుతుంది.**

**అనేది ఉండదు. ఆతడు ప్రతీక్షణమూ శ్రమిస్తూనే ఉండాలి"** అని మరికొంత వివరించింది. ఈ మాటలు తనయుని హృదయంలో మాటిమాటికి గుర్తుకువస్తూనేఉన్నాయి.

రాత్రి సమయం చొచ్చుకుని వస్తూ ఉంది. తల్లి చెప్పిన మాటల ప్రభావం కూడా హనుమంతుని మనస్సులోనికి చొచ్చుకునిపోయింది. నాలుగుదిక్కులా అంధకారం అలుముకుంది. అయినప్పటికీ ఆతని అంతరాళాలలో సేవాధర్మం అనే సూర్యుడు ఉదయించాడు. సేవాధర్మం అంటే ఏమిటో తల్లి నోటినుండే ప్రప్రథమంగా విన్నాడు. దానిని ఆచరణలో పెట్టే అవకాశం లభించలేదు. మనస్సు అమితంగా తొందర పెడుతోంది. శ్రీరామచంద్రుని దర్శించి, ఆయన సేవలో తరించిపోవాలని తహతహలాడుతూ ఉన్నాడు. ఆలస్యాన్ని భరించలేకపోతున్నాడు. సేవకు మినహా వేరే మాటలు ఏవీ కూడా ఆతని మనస్సుకు రుచించడంలేదు. ఆలోచనలు అన్నీ సేవాధర్మం చుట్టే తిరుగుతూ ఉన్నాయి. ఆ ఆలోచనలతోనే రాత్రి తెల్లవారిపోయింది.

వేకువ వచ్చేసింది. అంధకారం మటుమాయం అయింది. తూర్పు దిక్కున అరుణకాంతులు ఉదయించాయి. జగత్తంతా ఎరుపువర్ణంతో మెరిసిపోతోంది. కన్నులకు ఆహ్లాదాన్నిచ్చే అరుణిమ కాంతిని చూస్తూనే హనుమంతుని ఉత్సాహం రెట్టింపు అయింది. గబగబ కాలకృత్యాలు ముగించుకుని మేడపైకి చేరుకున్నాడు. అక్కడి నుండి సూర్యభగవానుని వైపు చూస్తూ ఉండిపోయాడు. గడిచిన రాత్రి బాగా నిద్రపోలేదు. అయినప్పటికీ ఏ మాత్రం అలసట లేదు. మనస్సు, శరీరం రెండూ కూడా ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నాయి. సాహసం, సమర్పణా భావం అలలు అలలుగా ఎగసిపడుతున్నాయి.

హనుమంతుని నుండి వెలువడిన ఉత్సాహ తరంగాల స్పర్శతో హనుమంతునికి ఈ సూర్యోదయం అపూర్వంగా కనిపిస్తోంది. శ్రద్ధతో, భక్తితో, ఆసక్తితో సూర్యదేవునికి అర్ఘ్యప్రదానం చేశాడు. మొట్టమొదట మనస్సులోనూ, తరువాత బహిరంగంగానూ సూర్య భగవానుని బీజాక్షరాలను పఠించాడు. ఆతని శ్రద్ధాసక్తులకు సూర్యదేవుడు చాలా సంతసించాడు. సంతృప్తి చెందాడు. ఉదయించిన సూర్యునిలో హనుమంతుని రూపం తళుక్కుమంది. ప్రసన్నుడైన సూర్యదేవుని తిలకిస్తూ – "సూర్యదేవా! పరమాత్మా! నన్ను కరుణించి ఆశీర్వదించు. నా జీవన లక్ష్యం నెరవేరాలా అనుగ్రహించు! అంటూ వేడుకున్నాడు. సూర్యుని ముఖబింబంపై చిరునవ్వు తొణికిసలాడింది.

*– అఖండజ్యోతి, మే 2010*

# గొప్పవారి అసూయ ప్రమాదకరం

*ఒకసారి వైశాలీ క్షేత్రంలో దురాచారుల ఆగడాలవల్ల సజ్జనులకు జీవించటం దుర్భరమైంది. ప్రజలు ఇళ్ళు, వాకిళ్ళు వదలిపెట్టి సురక్షిత ప్రాంతాలకు పారిపోసాగేరు. వీరిలో బ్రాహ్మణుల సంఖ్య ఎక్కువగా ఉండేది. నీతి, ధర్మం, మంచిని గురించి ఎక్కువగా ఎవరైతే చెబుతూ ఉంటారో వారిని ద్వేషించటం, వారిపై ఆక్రమణలు జరపటం, దుష్టులకు సర్వ సహజమైన విషయం. అందువల్ల ఈ బ్రాహ్మణోత్తములంతా గౌతముని ఆశ్రమానికి పోయి తలదాచుకోవాలనుకొన్నారు. ఆవును, సింహాన్ని ఒకే చోట నీరు త్రాగించగల తపోబల సంపన్నుడైన గౌతముని ఆశ్రమంలో బ్రాహ్మణులంతా సుఖంగా జీవించసాగారు.*

*ఒకనాడు నారద మహర్షి అటుగా పయనిస్తూ మహర్షి దర్శనార్థం ఆశ్రమంలో ప్రవేశించి ఇంత పెద్ద జన సముదాయాన్ని, వారి సంరక్షణ వ్యవస్థను చూచి ప్రసన్నుడై మహర్షి ఔదార్యాన్ని అనేక విధాల ప్రశంసించాడు. ఇది బ్రాహ్మణులకు నచ్చలేదు. మన రాకవలనేగదా ఋషికి ఇంతటి కీర్తి శ్రేయస్సు లభించాయి. మనం కూడా మన పురుషార్థాన్ని ప్రదర్శించి మహర్షివలె ప్రశంసింపబడాలని నిర్ణయించుకొన్నారు. అంతవరకు బాగానే ఉంది. కానీ వారిలో కొందరు కుట్ర పని రాత్రికి రాత్రే ఒక చనిపోయిన ఆవుని ఆశ్రమ ప్రాంగణంలో పడేసి, ఈ గోహత్య గౌతముడే చేశాడని చెడు ప్రచారం చేశారు. గౌతముడు ధ్యానం నుండి మేల్కొని పరిస్థితికి చింతించి వారందరినీ ఆశ్రమం నుండి పంపించి వేయాలని నిర్ణయించుకొన్నాడు.*

*ఈర్ష్య గొప్పవారిలో ఉండదనుకోవటం చాలా పొరపాటు. సాధారణ జనుల ఈర్ష్య కంటె గొప్పవారి ఈర్ష్య అతి ప్రమాదకరమైనది. అనర్థదాయకమైనది కూడా. కాబట్టి, మీరు మీ యథా స్థానాలకు వెళ్ళిపోండి. మీ ఈర్ష్యతో ఈ పవిత్ర వాతావరణాన్ని కలుషితం చేయకండి. స్నేహ సౌజన్యాలను హృదయాలలో నింపుకొని మీరు వదలివచ్చిన ప్రాంతాలను కూడా పవిత్రం చేయవచ్చు. వెళ్లి ఆ ప్రయత్నంలో నిమగ్నమవ్వండి – అని గౌతముడు ఆ బ్రాహ్మణులను ఆదేశించాడు. వారు సిగ్గుతో తల వంచుకుని మహర్షి ఆదేశాన్ని శిరోధార్యంగా భావించి ఆశ్రమాన్ని వదిలి వెళ్ళిపోయారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**కృషి సవ్యమార్గంలో జరిగితే మనుషులు ఋషులవుతారు.**

వ్యక్తి నిర్మాణం

# విజయానికి ఏడు మెట్లు

వ్యక్తిత్వం వెదజల్లే ఆకర్షణీయమైన వెలుగే విజయం. లోపల లోతైన పొరలలో దాగి ఉంటుంది వ్యక్తిత్వం. అది బయటినుంచి వచ్చేది కాదు. దాన్ని డబ్బు పెట్టి కొనుక్కోలేము. అది లోపల ఎక్కడో ఉంటుంది. దాన్ని త్రవ్వి తీసి విలువైన రత్నాల రాశిలా అలంకరించుకోవాలి. **పరిశ్రమ ద్వారానే, సమర్పణ భావన ద్వారానే వ్యక్తిత్వాన్ని మలుచుకోవలసి ఉంటుంది. తపనవల్ల, ఆ వేడివల్ల వ్యక్తిత్వ సుగంధం గుబాళిస్తుంది. కఠోర పరిశ్రమ, ధైర్యం, అంకిత భావం, సాహసం కలగలిసినప్పుడే విజయమనే నిప్పు కణం లభిస్తుంది. అది జీవితాన్ని వెలిగిస్తుంది.**

**వ్యక్తిత్వ సాఫల్యానికీ, జీవితంలో విజయానికీ ఏడు దివ్య సూత్రాలు ఉన్నాయి.** ఈ సూత్రాలను శాస్త్రాలుగా చేసుకుని జీవితాన్ని వాటికి అనుగుణంగా తీర్చిదిద్దుకుంటే, వ్యక్తిత్వం తళతళా మెరిసిపోతుంది.

1. మన పూర్తి బాధ్యతను మనమే వహించడం.
2. సర్వతోముఖమైన ప్రణాళికను రూపొందించడం.
3. లక్ష్యసాధనకు కార్యక్రమాల నిర్ధారణ
4. విజేతవలె ఆలోచించడం.
5. ఇతరులు చెప్పేదాన్ని వినే విజ్ఞతను అలవరచుకోవడం.
6. సరైన సమన్వయాన్ని సాధించడం.
7. ఎల్లప్పుడూ క్రొత్తదనాన్ని నిలిపి ఉంచుకోవడం.

విజయాన్ని చేకూర్చే దివ్యమైన, ప్రభావంతమైన ఈ ఏడు సూత్రాలలో వైభవం, మహిమ, ఐశ్వర్యముల నిలయం, భండాగారం నిండి ఉంది. ఈ సూత్రాలలో భౌతిక జీవనంతోపాటు ఆధ్యాత్మిక జీవనపు అనంత అవకాశాలు ఇమిడి ఉన్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి, వాటికి రూపం ఇవ్వడానికి మొదటి సూత్రం మన జీవితానికి పూర్తి బాధ్యతను మనమే స్వయంగా స్వీకరించడం. ఈ భావనను లోతుగా అనుభూతి పొందడం విజయానికి అత్యంత అవసరం. భగవంతుడు ప్రసాదించిన ఈ జీవితానికి బాధ్యులు మరొకరు ఎవరో కారనీ, స్వయంగా మనమేననీ, మన మంచి చెడు పరిస్థితులకు, ఫలితాలకూ బాధ్యత పూర్తిగా మనమీదనే ఉన్నదనే అవగాహన కలగడం ఒక మేలు కొలుపు. నిజమైన ఒక విజ్ఞత. ఈ విజ్ఞతతోపాటు, మనం మన జీవితానికి భాగ్య విధాతలం, నిర్మాతలం అనే ఎరుక కలుగుతుంది. ఈ ఎరుక మనల్ని మన లక్ష్యంవైపు ముందుకు నడిపిస్తుంది.

స్వామి వివేకానంద ఇలా అంటారు – 'మొదట్లోనే పెద్ద పెద్ద పథకాలు వేసుకోవద్దు. నెమ్మది నెమ్మదిగా పని ప్రారంభించు. నీవు ఏ నేలమీద నిలబడ్డావో దానిని గట్టిగా పట్టుకుని క్రమ క్రమంగా పైకి ఎక్కడానికి ప్రయత్నించు.' దీనితోపాటు ప్రణాళిక రూపురేఖలు స్పష్టంగా మన మనోఫలకంపై ముద్రించబడి ఉండాలి. స్పష్టమైన చిన్నచిన్న పథకాలను జీవితంలో అమలు చేయడం, వాటిని పూర్తిచేయడం తేలికవుతుంది. వాటిని పూర్తిచేసినపుడు మనసుకు అపారమైన సంతోషం కలుగుతుంది. పని పూర్తయినప్పుడు ఆత్మ విశ్వాసం కూడా పెరుగుతుంది. ఈ ఆత్మ విశ్వాసమే మరింత పెద్ద పనులు పథకాలు పూర్తి చేసే ప్రేరణను, ప్రోత్సాహాన్నీ మనకు ఇస్తుంది. జీవితంలో మహా కార్యాలను, మహా లక్ష్యాలను సాధించడానికి కావలసిన సామర్థ్యాన్ని మనకు ఇస్తుంది. మహాపురుషుల విజయాలకు తారకమంత్రం ఇదే – వారు మొదట చిన్న చిన్న స్పష్టమైన పథకాలను చేపడతారు. క్రమక్రమంగా విజయ శిఖరాగ్రాలను ఆరోహణ చేస్తారు.

పథకపు రూపురేఖలు స్పష్టంగా చిత్రించుకున్న తర్వాతనే ఏ పని అతి ముఖ్యమైనదో, ఏ పని మొట్ట మొదట చేయాలో, ఏ పనిని తర్వాత చేయాలో నిర్ణయించడం, ఎంపిక చేయడం సాధ్యపడతాయి. ఇలా పనుల క్రమాన్ని నిర్ణయించే సామర్థ్యమే విజయ రహస్యం. పరీక్షల సమయంలో విద్యార్థికి అన్నిటికన్నా ముఖ్యమైన పని పరీక్ష కోసం ఆయా విషయాలను సమగ్రంగా అధ్యయనం చేయడం. పరీక్షకు పూర్తిగా సిద్ధం కావడం. వర్షాకాలంలో రైతుకు మొట్టమొదటి పని వ్యవసాయంపై దృష్టి నిలపడం. విద్యార్థికాని, రైతుకాని తన పనుల క్రమాన్ని

**"యద్భావం తద్భవతి" - భావం ఎలా ఉంటుందో అదే జరుగుతుంది.**

నిర్ణయించుకోలేకపోతే, అతడి విజయం సందిగ్ధమే అవుతుంది. అలాగే – మనం కూడా మన జీవితంలో పథకం ప్రకారం పనులు ఎంపిక చేసుకునే కళను అలవరచుకోవాలి. ఈ కళా కౌశల్యం లేకపోతే, జీవితం చుక్కాని లేని నావలా అలల తాడికికి ఇటూ అటూ ఊగిపోతూ ఉంటుంది. చివరికి ఏదో సుడిగుండంలో చిక్కుకుని నదీ గర్భానికి చేరుకుంటుంది. నిర్ణయం తీసుకునే వ్యక్తి పురుషార్థ పరాయణుడు, కార్యశూరుడు అనిపించుకుంటాడు. అతడు జీవితపు చుక్కానిని తన చేతుల్లో దృఢంగా పుచ్చుకుని, ఒడుపుగా గమ్యానికి చేర్చుతాడు. అతడి ఆలోచనా ఎప్పుడూ విజేత ఆలోచనగా ఉంటుంది. విజయం అతడి కాళ్లను తాకుతుంది.

విజేత దృక్పథం జీవితంలో ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్నీ, సృజనశీలతనూ నింపుతుంది. అలసిపోయి, ఓడిపోయి, నిరాశా నిస్పృహలకు లోనయిన జీవితపు అంధకారాన్ని చీల్చివేసి, ఆశాదీపాన్ని వెలిగిస్తుంది ఈ దృక్పథం. విజయం మనకు జన్మతో వచ్చిన హక్కు, ఎట్టి పరిస్థితిలోనూ మనం దాన్ని సాధించితీరుతాం – అనే విశ్వాసాన్ని ఈ దృక్పథం మనిషిలో నింపుతుంది. విజేతలోని ఈ ప్రచండ ఆత్మ విశ్వాసం అతడిని ఎన్నడూ అపజయం పాలు కానివ్వదు. విజేతలోని నిర్మాణాత్మక, భావనాత్మక ఆలోచన అతనిలోని లోపాలను, అలవాట్లనూ, ప్రవృత్తులనూ అన్నింటినీ మార్చిముందుకు సాగుతుంది. నెపోలియన్ వలె అతడు 'లేదు, కాదు' అనే మాటలను వినడానికి సైతం ఇష్టపడడు. ఎందుకంటే 'లేదు, కాదు' అనే మాటలు పని మొదలుపెట్టకముందే అపజయాన్ని ఆహ్వానిస్తాయి. విజేత పురుషార్థ పరాయణుడుగా ఉంటాడు. పరాక్రమవంతుడుగా ఉంటాడు. అతడి బుద్ధిలో ఎప్పుడూ 'అవును' అనే మంత్రమే ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అతడు ఇలా అంటాడు – అవును. నేనీ పని చేయగలను. నా ప్రాణాలను బలి చేయవలసివచ్చినా సరే, ఈ లక్ష్యాన్ని, ఉత్కృష్టమైన ఈ ఆశయాన్ని సాధించి తీరుతాను.

ఈ విజేత మనస్తత్వం వ్యక్తిలో శాశ్వత యౌవనం అనే దుర్లభమూ, అలౌకికమూ అయిన వరాన్ని నింపుతుంది. ఈ మనస్తత్వం పూర్ణ యౌవనానికి ప్రతీక ప్రతినిధి. ఇది వ్యక్తిని వయస్సు అనే పరిమిత సంకుచిత పరిధిలో బంధించదు. 70–80 సంవత్సరాల వ్యక్తి యువకునిలా క్రియాశీలంగా ఉండవచ్చు. 20–30 సంవత్సరాల వ్యక్తి ముసలివానిలా ఈసురోమంటూ ఉండవచ్చు. సమాజంలో, ప్రపంచంలో విజ్ఞతా, క్రియాశీలతా కలిగిన యువకుల కొరత బాధ కలిగించే అంశం. బలిష్ఠమైన **యువకుల భుజ స్కంధాల మీదనే జాతి భారం నిలచి ఉంటుంది.** ఎందుకంటే, యౌవనం విజ్ఞతకూ, బాధ్యతకు, సృజనకూ ప్రతీక. ఆ వయస్సులోనే జీవించాలనే అడ్డులేని ఆకాంక్ష, సాధించాలనే పట్టుదల – ఇవన్నీ సమన్వయం పొందుతాయి. వినే, అర్థం చేసుకునే, పూర్వపరాలను బేరీజు వేసే అపారమైన సామర్థ్యం యౌవనంలోనే ఉంటుంది. భవిష్యత్తు గురించిన బంగారు కలలను నిజం చేసే సాహసం యౌవనంలోనే పరిపక్వం అవుతుంది.

యౌవనంలోని ఈ ప్రత్యేక లక్షణాన్ని ఏ వయస్సులో అయినా అలవరచుకోగలుగుతాము. ఏ వయస్సులో అయినా – తన్మయత్వం, అంకితభావం, పనిలో పూర్తిగా నిమగ్నమయే లక్షణం ఆకర్షణీయమైన వ్యక్తిత్వాన్ని సృష్టిస్తాయి. 'శ్రేష్ఠమూ, ఉత్కృష్టమూ, మహత్తరమూ అయిన లక్ష్యాన్ని సాధించడానికై ఇప్పుడు కూడా ప్రాణ శక్తి, శక్తి సామర్థ్యాలు ఏ మాత్రం మొక్కపోలేదు. అవి తరిగిపోలేదు. జీవించి ఉన్నాయి. జీవితంలోని చివరి ఘట్టంలో కూడా విజ్ఞత, ఉత్సాహం, శ్రమశీలత నాలో నిండి ఉన్నాయి'– అని చెప్పగలగడం వ్యక్తిత్వంలోని యౌవనానికి నిజమైన అర్థం. ప్రతి యువకునిలో ఈ విజ్ఞతా తరంగాలు పొంగి పొరలాలి. రాయిలా జడపదార్థంగా మారిన అంతరంగంలో జీవించే, నేర్చుకోవాలనే ఆకాంక్ష తిరిగి రగలాలి. తన కోసం, తన జాతి కోసం జీవితాన్ని బలిదానం చేయాలనే సంకల్పం మేలుకొనాలి. సామూహికతంగా, సంఘటితంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగే సాహసం, ఔదార్యం మనలో వికసించాలి. జీవన లక్ష్యాన్ని చేరే పథం నుండి మనలో ఏ ఒక్కరూ తప్పిపోకూడదు. పరస్పర సమన్వయం, నిజమైన సమరస భావన – ఇది విజయానికి మరో దివ్య సూత్రం.

నిజమైన సమన్వయ సామరస్యాలలోనే ప్రేమ, ఆత్మీయత, ఔదార్యం, సహానుభూతి, సహయోగం, సహకారం, సేవ అనే సద్గుణాలు వికసిస్తాయి. ఈ సమరసత మనలో ఆంతరిక శక్తిని నింపుతుంది. ఫలితంగా, జీవన వీణ శ్రావ్యంగా మ్రోగుతుంది. ఈ ఏకాత్మ భావన లోపించినందువల్లనే ఉదాసీనత ఉంటోంది. ఆ కారణం వల్లనే వ్యక్తిలో, సమాజంలో, విశ్వంలో హింస ఉన్నది. విద్వేషం ఉంది. నిజమైన స్వర మేళనం లేనందువల్లనే వైరుధ్యాలతో

**మన లోపాలను మనమే గుర్తించగలగాలి.**

కూడిన, ఆలోచన లోపించిన, గొంతులు కోసే పోటీ విజృంభిస్తోంది. హృదయాల కలయిక ఈ వైషమ్యాలను, ఈ దుఃఖ దైన్యాలను దూరం చేస్తుంది. కలసికట్టుగా, సంఘటితంగా పని చేసేందుకు ప్రేరణనూ, ప్రోత్సాహాన్నీ ప్రదానం చేస్తుంది. నిజమైన సామరస్యం మన ఆంతరిక చేతనలో అంకురిస్తుంది. ఈ భావన అంతరాంతరాలలో ఉదయిస్తుంది. దీన్ని బయటినుంచి రుద్దడం వల్ల శాశ్వత ప్రయోజనం ఉండదు. నిజమైన సామరస్యం ఒకప్రక్క విపరీత పరిస్థితులలో సైతం వ్యక్తిని కలిపి నిలిపి ఉంచుతుంది. మరోప్రక్క ప్రగతికీ, వికాసానికీ క్రొత్త క్రొత్త ద్వారాలు తెరుస్తుంది.

నిజమైన సామరస్య భావన ప్రతిరోజూ క్రొత్తపని చేయడానికీ, క్రొత్త ఆలోచన చేయడానికీ, క్రొత్త పథకం రూపొందించడానికీ మనకు ఉత్సాహాన్నీ, ప్రేరణను ఇస్తుంది. చేసిన పనిని మరింత సమర్థవంతంగా ఎలా చేయాలి? మన పరిస్థితికీ, మన సాధన సంపత్తికీ అనుగుణంగా మరింత ఉత్తమోత్తమ పథకాలను ఎలా రూపుదిద్దాలి? అని ఆలోచించేందుకు ప్రేరణ మనకు ప్రతిరోజూ ఆత్మ పరీక్ష చేసుకోవడం ద్వారా, ఆంతరిక పరిశోధన చేసుకోవడం ద్వారా లభిస్తుంది. ఆత్మబోధను, తత్వబోధను సాధన చేయడం ద్వారా ఈ ఆత్మావలోకనం బాగా తేలిక అవుతుంది. బాగా సులువు అవుతుంది. సహజమూ, సరళమూ అయిన ఈ సాధన ద్వారా ప్రతిరోజూ మనకొక క్రొత్త జీవితమనీ, ప్రతిరాత్రీ మనకొక మరణమనీ అనుభూతి పొందడం జరుగుతుంది. ఇందువల్ల ప్రతిరోజూ మన పనులను బేరీజు వేసుకునే అవకాశం, మన వ్యక్తిత్వాన్ని లోతుగా అంచనా వేసుకునే అవకాశం మనకు లభిస్తాయి. ప్రతిరోజూ ఒక క్రొత్త పని ప్రారంభం అవుతుంది. ఇందువల్ల మన వ్యక్తిత్వం ఇతరులను ఇట్టే ఆకర్షిస్తుంది. విజయ పరంపరలను మనం అంది పుచ్చుకుంటాం.

విజయ సాధనకు ఉపకరించే ఈ ఏడు సూత్రాలలో వ్యక్తిత్వ నిర్మాణంలోని, వ్యక్తిత్వ వికాసంలోని రహస్యం ఇమిడి ఉంది. ఈ సూత్రాలను దృఢసంకల్పంతో జీవితంలో అమలు జరిపితే, వ్యక్తిత్వం సంస్కరించబడి, ఆకర్షణీయంగా అవుతుంది. అలాంటి వ్యక్తిత్వం ద్వారానే ఆధ్యాత్మిక జీవితానికి శ్రీకారం చుట్టవచ్చు. భౌతిక విజయాలను అందించడంతోపాటు ఆధ్యాత్మిక జగత్తులో ప్రవేశించడానికి కూడా ఈ సూత్రాలు తారకమంత్రాలు అవుతాయి.

★★★

## విద్యాసాగర్ విలక్షణ ప్రతిభ

*విద్యాసాగర్ తండ్రి నెలకు మూడు రూపాయల జీతానికి పనిచేసేవాడు. విద్యాసాగర్‌కు చదువుకోవాలనే బాగా తపన ఉండేది. ఆ జీతంతో పిల్లవాడికి చదువు చెప్పించలేని పరిస్థితికి ఆ తండ్రి హృదయం తల్లడిల్లేది. తండ్రి బాధను గమనించిన విద్యాసాగర్ తన చదువుకు తానే మార్గాన్ని అన్వేషించాలనుకున్నాడు.* **బడికి వెళ్తున్న పిల్లలతో స్నేహం చేసి వారి పుస్తకాల సహాయంతో చదువుకునేవాడు. నేల మీద బొగ్గుతో వ్రాసి చదువుకుంటున్న పిల్లవాడి ఆసక్తికి తండ్రి హృదయం ద్రవించింది.** *స్తోమత లేకపోయినా ఎలాగోలా చదివించాలని గ్రామంలోని పాఠశాలలో చేర్పించాడు. గ్రామ పాఠశాలలోని పరీక్షలన్నింటిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై అందరిని ఆశ్చర్యపరిచాడు.*

*తండ్రి మోయలేని భారాన్ని మోసి క్రుంగిపోతున్నాడని గుర్తించిన విద్యాసాగర్ తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదం తీసుకుని తన దారి తాను ఏర్పరచుకున్నాడు. కలకత్తాలోని సంస్కృత విద్యాలయంలో చేరాడు. తన దీక్ష ప్రతిభ, పరిశ్రమ, వంటి లక్షణాలతో గురువులను ప్రభావితం చేశాడు. ఫీజు అవసరం లేకుండానే అతని చదువు సాగిపోయింది. స్నేహితుల, ఆత్మీయుల సహకారం వల్ల పుస్తకాల సమస్య ఎప్పుడు రాలేదు.* **ఖాళీ సమయంలో కూలిపని చేసి మిగిలిన అవసరాలు తీర్చుకునేవాడు.**

*ఇలాంటి పరిస్థితులలో కూడా విద్యాసాగర్ ఎంత కృషి చేశాడంటే 19వ సంవత్సరంలోనికి అడుగుపెట్టేసరికి ఆయన వ్యాకరణం, సాహిత్యం, స్మృతి, వేదశాస్త్రాలలో అపారమైన పాండిత్యాన్ని సంపాదించాడు. ఈయన తరువాత ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌గా విశ్వవిఖ్యాతిగాంచాడు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

## సంజీవని సాధనా శిబిరము

*2011 మే 11 నుండి మే 19 వరకు 9 రోజుల సంజీవని సాధనా శిబిరము శాంతికుంజ్, హరిద్వార్‌లో తెలుగుభాషలో నిర్వహించబడుచున్నది. ఆసక్తి కలవారు ముందుగానే తమ పేర్లను గాయత్రీ చేతనా కేంద్రములో నమోదు చేసుకొనవలసినదిగా కోరడమైనది.*

**ఫోన్ నెం. 9949111175**

**ఆత్మ జ్ఞానాన్ని వృద్ధి చేసుకుంటే మనో మాలిన్యం తగ్గిపోతుంది.**

# అనుదానములు పొందే విషయంలో చివరివారు కావద్దు

## ఆలోచనా క్రాంతుల శతాబ్ది

ఇది నూతనయుగమునకు వసంతఋతువు వంటి సంవత్సరము. తన యొక్క ప్రతిశ్వాసను యుగపరివర్తన-ఆలోచనల పరివర్తనకే సమర్పణ చేసుకున్న మహాసత్తా ఈ పృథ్వీమీద అవతరించిన శతాబ్దిసంవత్సరమిది. ఒక్కసారే రెండు శతాబ్దాలను, విశ్వమానవత యొక్క భవిష్యత్తును ప్రభావితము చేసిన పూజ్యగురుదేవులకు శ్రద్ధాంజలి సమర్పించుకోవలసిన సమయమాసన్నమైంది. మనము చేపట్టే కార్యక్రమాలే ఆయనకు మనమిచ్చే శ్రద్ధాంజలి. నూతన ప్రపంచమనే భాగ్యము మానవజాతికి లభించగలదనే విషయం పునర్నిర్ధారించుటలో గురుదేవులది ప్రముఖపాత్ర. పరిజనులందరిలోనూ ఆశావహ దృక్పథమును ఆయన నిరంతరం వృద్ధి చేశారు. యుద్ధమేఘాలు, భయంకర ఉత్పాతాలు ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన ఎప్పుడో వ్రాశారు, అయినా గాభరాపడవద్దు అని ధైర్యం చెప్పారు. అందరూ నైతిక, బౌద్ధిక, సామాజిక క్రాంతులకు అనుగుణ్యమైన జీవనశైలిని అలవరుచుకునేందుకు అవసరమైన మహత్వపూర్ణ సూత్రాలను అందించారు. లక్షల, కోట్లమంది వ్యక్తుల జీవితంలో పరివర్తన అనే అగ్నిని రగిల్చి ఏ క్రాంతి తీసుకురావాలని ఆయన ఆశించారో అది రావాలి అంటే బహుముఖమైన ఆయన జీవితమును ఈ విశ్వములోని ప్రతి వ్యక్తి మథించాలి. **గాయత్రీ పరివార్ ఒక దర్శనము-ఒక మిషన్-ఒక ఆలోచనా.** ఈ ధారలో విశ్వమానవత మొత్తం తడిసి పునీతమైపోవాలి.

## కోట్లాదిమంది చేస్తున్న అనుష్ఠానము

గత నవరాత్రులన్నీ దేశంలో శ్రద్ధాపూర్వకంగా జరుపబడ్డాయి. ఇప్పుడు వీటితో పాటే మంత్రలేఖనా ప్రక్రియ కలుపబడింది. దేశమంతా దాదాపు ఒకటిన్నరకోట్ల మంత్రలేఖనా అనుష్ఠానాలు జరుగుతున్నాయి. మంత్రలేఖనా అనుష్ఠానాలకు మామూలు అనుష్ఠానము కంటే 10 రెట్లు ఎక్కువ ప్రభావముంటుంది. మహాశివరాత్రి 2011 మార్చి 2వ తేదీ నుండి ఏప్రిల్ 12 శ్రీరామనవమి వరకు 24కోట్ల గాయత్రీమంత్ర అనుష్టానము జరుగుతుందని ఆశిస్తున్నాము. ఈ అనుష్టానము ఇంకా ఎక్కువగా కూడా జరిగే సూచనలున్నాయి. శాంతికుంజ్‌లో ప్రఖరప్రజ్ఞ, సజలశ్రద్ధల వద్ద సాధకులు మంత్రలేఖనానుష్టానాన్ని నిరంతరంగా చేస్తున్నారు. దేశమంతటావున్న 400 శక్తిపీఠాలు, ప్రజ్ఞా సంస్థానాలు, జోనల్ కేంద్రాలు, జిల్లాలు, గ్రామాలు, ప్రతిఇంటా మంత్రలేఖనాక్రమము జరుగుతూనేవుంది. శతాబ్ది సంవత్సరము యొక్క ఈ మహాఅనుష్టానము రాబోయే రోజుల్లో అన్ని రకాలైన రక్షణను అందించి నవయుగ ఆగమనాన్ని వేగవంతము చేస్తుంది.

## మంత్రలేఖనాక్రమాన్ని ఆపవద్దు, జరుగుతూ ఉండాలి

మంత్రలేఖనాన్ని ఇప్పుడే ఆపవద్దు. క్రిందటినెల యుగశక్తి గాయత్రి మాసపత్రికలో ఈ క్రమాన్ని ఆపవద్దని చెప్పడం జరిగింది. 'నిద్రలేచినప్పుడే సూర్యోదయం' అన్న పద్ధతిలో ఈ మూడు సంవత్సరాలు పరిజనులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రలేఖనా లాభమును పొందాలి. అందుచేత ప్రతిఒక్కరూ పూర్ణిమరోజుకానీ, పుణ్యపర్వదినములలో కానీ మంత్రలేఖనము మొదలుపెట్టి వ్రాయవచ్చు. మంత్రలేఖనము వ్రాస్తున్నప్పుడు మనస్సు జపంచేస్తున్నప్పటికంటే ఎక్కువగా ఏకాగ్రతను పొందుతుంది. రోజుకు 60 మంత్రాలు వ్రాయాలి. ఇందుకు గంటన్నర సమయం పడుతుంది. 40 రోజులు వ్రాస్తే 2400 మంత్రాలు పూర్తిఅవుతాయి. అందరూ బుద్ధపూర్ణిమరోజు మొదలుపెట్టి ఆగష్టు 22 జన్మాష్టమి వరకు లేదా జన్మాష్టమి మొదలుపెట్టి సెప్టెంబరు 28న వచ్చే ఆశ్వయుజ నవరాత్రుల వరకు వ్రాయవచ్చు. ఈ క్రమము ఇలా ఈ సంవత్సరమంతా కొనసాగాలి.

## ఇంక మూడు సంవత్సరాల సమయమే

మన మహాకుంభశతాబ్ది సమారోహము 2011 నవంబరు 6 నుండి 10 వరకు జరుగుతుంది. ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయి. **ఈ విధంగా 2014 ఫిబ్రవరి 4న వచ్చే వసంతపంచమి వరకు ఈ కార్యక్రమాలు ఇలానే కొనసాగుతూ ఉండాలి.** ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో నిమగ్నులు కావాలి. ఇది పూజ్యవరుల మూడు సంవత్సరముల జన్మశతాబ్ది సాధన మహాపూర్ణాహుతి సమయము. పరిజనులంతా అర్థము చేసుకోవలసింది ఏమిటంటే **జన్మశతాబ్ది కేవలం 2011 వరకు మాత్రమే కాదు, 2012, 2013 వరకు ఉన్నది. 2011లో వలెనే 2012, 2013 సంవత్సరాల్లో కూడా దేశమంతటా ఈ కార్యక్రమం కొనసాగాలి.** మహాకుంభము ఈ సంవత్సరం మాత్రమే జరుగుతుంది. కానీ ఆ తరువాత బహుముఖమైన గురుదేవుల జీవితంతో కలిపి తయారుచేయబడిన ప్రక్రియలు, కార్యక్రమాలన్నీ విశ్వమంతటా విస్తారంగా ప్రచారం చేయబడతాయి. ఇది **అనుయాజ క్రమంగా 2014 వసంత పంచమి వరకు జరుగుతుంది.** ఆ తరువాత యుగపరివర్తన (2019-2020) కు అవసరమైన ప్రయాజ ప్రారంభమౌతుంది. అందుచేత ఎవరూ విశ్రాంతిగా కూర్చోవద్దు. అనవరతంగా గురుకార్యంలో నిమగ్నులుకండి.

**ఆత్మవిశ్వాసం విజయావకాశాలను వృద్ధి చేస్తుంది.**

## ఈ సంవత్సరము యొక్క కార్యప్రణాళిక

1. శాంతికుంజ్-యుగతీర్థములో సజలశ్రద్ధ, ప్రఖరప్రజ్ఞలను పవిత్ర చైతన్యతీర్థ క్షేత్రాలుగా ప్రకటించడమైనది. అందుచేత అక్కడ ఇబ్బంది కలిగించే క్రియాకలాపాలన్నింటినీ తొలగిస్తున్నాము. ప్రస్తుతం అక్కడ వున్న డిస్పెన్సరీ, హాస్పిటల్, రిసెప్షన్‌లను శ్రీరామ్‌పూర్‌కు తరలించాము. ఇక అక్కడ అంతా ప్రశాంతంగా వుండి వేలాదిమంది సాధకులు గురుసత్తా సూక్ష్మసాన్నిధ్యాన్ని అనుభూతిచెందుతూ ఆయనతో మాట్లాడుకోగలుగుతారు. నూతన నిర్మాణాలు కేవలం జన్మశతాబ్ది మహాకుంభము కొరకే నిర్మించబడుతున్నాయి. విశ్వవిద్యాలయమునకు దగ్గరలో ఒక పెద్ద ఆడిటోరియం యొక్క నిర్మాణం పూర్తయ్యింది. పరమపూజ్య గురుదేవుల జన్మస్థలమైన ఆవల్‌ఖేడాలో ఒక విశాల స్మారకచిహ్నా నిర్మాణం ప్రారంభం కాబోతున్నది. ఈ సంవత్సరాంతానికి అది పూర్తి అవుతుంది. మున్సారీలో ఆశ్రమ భవననిర్మాణం పూర్తయ్యింది. ఇంకా కొన్ని ముగింపు పనులు చేయబడుతున్నాయి. అక్కడ సాధనా శిబిరాలు, స్వావలంబన శిబిరాలు నిర్వహించబడతాయి.

2. విశ్వవిద్యాలయ పరిసరాలలో ఒక స్మృతి ఉపవనము (ఉద్యానవనం) తయారై సిద్ధంగావుంది. స్థలము ఎంతైనా కానీ వాతావరణం మాత్రం శాంతికుంజ్‌లోవలెనే ఉండాలి. ఇందువల్ల గురుసత్తా యొక్క సాధనాత్మక ఊర్జ వికేంద్రీకరించ బడుతుంది (అన్ని వైపులా పంచబడుతుంది). **దేశమంతటా ఈ పద్ధతిలో కనుక జరిగితే అందరికీ వనౌషధుల పెంపకమనే పద్ధతి ఒక ఉత్సాహము లభిస్తుంది. కట్టుబడి నిర్మాణాలు ఇక మూడు సంవత్సరాల పాటు ఎక్కడా మొదలుపెట్టవద్దు. నిర్మాణాలు ఏవైనా జరిగితే అవి శ్రీరామ స్మృతి ఉద్యానవనములకు అనుబంధంగా ఉండాలి.**

3. **గురుపూర్ణిమ పర్వదినమున కోట్లాది వృక్షములు నాటేందుకు అవసరమైన పనులు చేయబడుతున్నాయి. రావి, వేప, మఱ్ఱి వృక్షములు కానీ లేదా పంచవటి (రావి.వేప.మఱ్ఱి.ఉసిరి. అశోక) వృక్షములు కానీ నాటాలి. మొక్కలు మరియు మార్గదర్శనవివరాలు ఇక్కడనుండి పంపించబడతాయి.** అందరూ తరు (వృక్షము) పుత్రులు, తరు మిత్రులు కావాలనే సంకల్పం తీసుకుంటే తలపెట్టిన సంకల్పం నిర్విఘ్నంగా పూర్తౌతుంది. **ఒక్క లక్ష వృక్షములతో నర్సరీ ప్రారంభించ బడుతున్నది.** దీనికి అనుబంధకేంద్రాలు కూడా స్థాపించ బడతాయి. వాటి వివరాలు తరువాత తెలియచేస్తాము. **2011ను అంతర్జాతీయ వన సంవత్సరముగా (ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ ఫారెస్ట్) గా ప్రకటించారు.** రండి మనమంతా కలిసి దీనిని ఒక చారిత్ర్యాత్మక ఘట్టంగా మలుచుకుందాం. స్త్రీలు, యువత, కార్పొరేట్+ప్రభుత్వరంగమనే మూడు మహాశక్తులు ఇందులో తమ భాగస్వామ్యమును నిర్వహించుకోవాలి. ఆ విషయం మీడియా ద్వారా కానీ, ఫీచర్స్ ద్వారా కానీ తెలియపరచవచ్చు.

4. కొంతకాలము వరకు ఒక రైలు నడుపబడుతుంది. ఆ తరువాత **ఆ స్థానంలో మూడు-మూడు జ్ఞానరథాలు (టాటా 407) ఐదు మార్గాలు నిర్ధారించుకొని పూజ్య గురుదేవుల జ్ఞానశరీరాన్ని గ్రామగ్రామానికి చేరుస్తాయి. సెప్టెంబరు 2011 వరకు ఇవి నడపబడతాయి.** మహాకుంభము తరువాత త్రివర్షీయ **(మూడు సంవత్సరాల) శతాబ్దిలో దేశమంతటా ప్రచారము కొరకై ఇవి మళ్ళీ బయలుదేరతాయి.**

**'నేను వ్యక్తిని కాను ఆలోచనను'** అని పూజ్యగురుదేవుల చెప్పారు. పుస్తకమేళాలు జరిపిన చోట్లంతా అనూహ్యమైన స్పందన వచ్చింది. కానీ అన్నిచోట్లా అలా జరుపలేము కదా! అదే జ్ఞానరథాలైతే జిల్లాల్లో, మారుమూలల్లో ఉన్న గ్రామాలకు తిరుగుతాయి. ఒక రథములో గురుసత్తా జీవితమునకు సంబంధించిన ప్రదర్శన వుంటుంది. ఒక రథములో సాహిత్యము ఉంటుంది. ఒక రథములో టోలీలో వున్న వ్యక్తులకు కార్యక్రమాలకు సంబంధించిన వస్తువులు ఉంటాయి. **శాంతికుంజ్ నుండి గంగా జలము, శాంతికుంజ్ నుంచి ఆవల్‌ఖేడా నుంచి తీసుకురాబడిన పవిత్ర మట్టితో కూడిన కలశమును రథములో ఉంచి అన్ని ప్రదేశాలకు తీసుకువెళతారు.** టోలీసభ్యులు అన్నిచోట్లా ధ్యానశిబిరాలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన వివరాలు వచ్చేనెల సంచికలో విపులంగా తెలియచేస్తాము. అప్పటికే ఈ రథాలన్నీ బయలుదేరేందుకు సిద్ధంగా ఉంటాయి.

5. పరమపూజ్య గురుదేవుల స్మృత్యర్థం 1991 జూన్ 27వతేదీన ఒక పోస్టల్‌స్టాంప్ విడుదల చేయబడింది. రూపాయి విలువ గల స్టాంపు విడుదలైన మొదటిరోజే రికార్డుస్థాయిలో ఇంటింటికీ చేరింది. ఇప్పుడు వారి జన్మశతాబ్ది సందర్భంగా గురుదేవులను **విచారక్రాంతి (ఆలోచనాలో క్రాంతి) చిహ్నమైన లాల్‌మషాల్ గుర్తుమీద మరో పోస్టల్‌స్టాంపు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరాము.** ఆదేశాలు అందిన వెంటనే ప్రింటింగ్ ప్రారంభమౌతుంది. విడుదలైన తరువాత అందరూ దీనిని ఒక మొమెంటో వలె భద్రపరుచుకోవచ్చు.

**శతాబ్ది సంవత్సరము మరలమరల రాదని అందరూ గుర్తుంచుకోండి. బాగా ఆలోచించుకొని ఇందులో మీ భాగ స్వామ్యము ఎక్కడ ఎంత ఉన్నదో చూసుకోండి. అనుదానములు పొందే విషయంలో వెనకబడిపోవద్దు. కొంచెం ఆలోచించండి.**

*- అఖండజ్యోతి, మే 2011*

*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

నైతిక విలువలను శీలాన్ని వృద్ధి చేసుకుంటే భయం అదుపులో ఉంటుంది.

ఆరోగ్యమే మహాభాగ్యం - 6

# హోమియో వైద్య సేవ

## వేసవి తాపాలు - 2

గత శీర్షికలో వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వడదెబ్బ గురించి తెలుసుకున్నాము. ఈ శీర్షికలో వేసవిలో చాలా సాధారణంగా వచ్చే విరేచనాల గురించి తెలుసుకుందాము.

చాలా మందికి హోమియో చికిత్స మీద పలురకాల అపోహలు ఉన్నాయి. హోమియో దీర్ఘకాల వ్యాధులకు బాగానే పనిచేస్తుంది కాని తరుణ వ్యాధులకు పెద్దగా పనిచేయవు అనేది చాలామందికి ఉన్న పెద్ద అపోహ. కాని ఇది నిజం కాదు. హోమియో మందులు తరుణ వ్యాధులలో కూడా చాలా త్వరితంగా పనిచేస్తాయి. చాలా సార్లు అల్లోపతి మందుల కంటే కూడా చాలా త్వరగా ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా ఫలితాలను ఇస్తుంది. రోగి లక్షణాలను బట్టి మందును వాడవలెను. మామూలు మందుల వలె ఒక రోగమునకు మందు హోమియోలో ఉండదు. రోగమునకు మందు కాక రోగికి మందులు ఇవ్వడమనేది హోమియో ప్రత్యేకత. అందుకే ఒకే రోగముతో బాధపడుతున్నప్పటికీ వివిధ వ్యక్తులకు వేరు వేరు మందులను హోమియో వైద్యులు ఇస్తారు. లక్షణాలను బట్టి సరైన మందు వాడినచో చాలా త్వరగా తరుణ వ్యాధులలో ఉపశమనం కలుగుతుంది.

### విరేచనాలు

చాలా మంది వర్షాకాలములో మాత్రమే విరేచనాలు వస్తాయి అనుకుంటారు కాని వేసవికాలంలో కూడా విరేచనాలు బాధిస్తాయి. ఇవి పసిపిల్లల నుండి ముసలివారి వరకు అందరిని ఇబ్బందికి గురి చేస్తాయి. అనేక కారణాల వల్ల ఈ వ్యాధి సంక్రమించవచ్చు. ఇది తరుణ వ్యాధిగా రావచ్చు. అప్పుడప్పుడు తిరగబెట్టే దీర్ఘకాలిక వ్యాధి కావచ్చు. విరేచనాలతో పాటు కడుపునొప్పి కూడా తోడు కావచ్చు. ఈ వ్యాధి సంవత్సరం లోపు పిల్లల్లో వచ్చినా, వృద్ధుల్లో వచ్చినా ప్రమాదకరమైన విషయంగా గుర్తించాలి.

మనదేశంలో నూటికి 40 మంది పిల్లలే. దేశంలో మొత్తం ఆఫ్రికా ఖండంలోని 46 దేశాల పిల్లల సంఖ్య కన్నా మనదేశంలో పిల్లల సంఖ్య ఎక్కువ. నీళ్ళ విరేచనాలు పిల్లలకు వచ్చే వ్యాధులలో ప్రధానమైనది. ఆసుపత్రులకు వచ్చే పిల్లల కేసుల్లో నూటికి 30 కేసులు డయేరియాకు సంబంధించినదే.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) పిల్లల డయేరియాకి కారణమని భావించే 26 రకాల బ్యాక్టీరియా, వైరస్ క్రిములను పరిగణలోకి తీసుకోలేదు. చిన్నపేగులకు గల ప్రత్యేక వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడమే ఈ వ్యాధికి కారణంగా అభిప్రాయపడ్డారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడంతో మామూలుగా చిన్నపేగుల ద్వారా స్వీకరించే లవణాలను, షుగర్లను శరీరం స్వీకరించలేకపోతుంది. ఇదే విరేచనాలకు కారణం. నోటి ద్వారా సోడియం లవణం, గ్లూకోజు నీటినిచ్చి దేహానికి సహజమైన వ్యాధి నిరోధక శక్తిని పెంచి విరేచనాలను నివారించ గలుగుతున్నారు. ఇది సులభమైన పద్ధతి. వ్యాధులకు కారణం క్రిములు కాదు. **సహజమైన వ్యాధి నిరోధక శక్తి తగ్గి జీవతత్వం లొంగిపోవడమే వ్యాధికి మూలకారణమని రెండు శతాబ్దాల క్రితమే హానిమన్ సిద్ధాంతీకరించి హోమియో వైద్యాన్ని ప్రవేశపెట్టాడు.** ప్రపంచ ఆరోగ్యసంస్థ పరిశోధనల ఫలితాలు హానిమన్ భావాన్నే సమర్థిస్తున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన ద్రావణాన్ని ఈ క్రింది విధంగా తయారు చేసుకోవచ్చు. ఒక లీటరు నీటిలో 4 చెంచాల గ్లూకోజు, ఒక చెంచా ఉప్పు కలిపి కరిగించాలి. రోగి బరువు ఆధారంగా ఈ ద్రావణం ఎంత ఇవ్వాలో నిర్ణయించారు. ప్రతి కిలోగ్రాము బరువుకు 150 మి.లీ. వంతున రోజు మొత్తం మీద తాగించాలి. హోమియో మందులు విరేచనాల కారణాలను బట్టి రోగి లక్షణాలను బట్టి వాడుకోవచ్చు. క్రింద పేర్కొనే మందులు సాధారణంగా విరేచనాలకు వాడే హోమియో మందులు ఇవే కాక రోగి లక్షణాలను బట్టి వేర్వేరు మందులు ఉండవచ్చు.

**పోడోఫైలం :**

విరేచనాలకు చాలా మంచి మందు. పెద్ద పెద్ద విరేచనాలవుతుంటాయి. దుర్వాసన - కొంచమే తిన్నా పెద్ద విరేచనమవుతుంది. పొట్టలో గుడ గుడ శబ్దాలు వినిపిస్తాయి. డోకులు ఎక్కువ. నురుగు నురుగుగా వాంతులవుతుంటాయి. తిన్న ఆహారం కూడా వెళ్ళిపోతుంటుంది. విరేచనాలు ఉదయం పూట

**మానసిక ఒత్తిడి వ్యాధి నిరోధక శక్తిని క్షీణింపచేస్తుంది.**

ఎక్కువ. రోగి నీటికోసం తహతహలాడతాడు కాని ఆహారాన్ని దగ్గరకు రానీయడు.

**ఆర్సినిక్ ఆల్బ్ :**

వాంతులు, విరేచనలు అవుతుంటాయి. బిడ్డ త్వరగా పీక్కుపోతుంది. కాళ్ళు చల్లబడిపోతాయి. ముఖం పీక్కుపోయి ఉంటుంది. చర్మం ముడతలు ముడతలు పడి ఉంటుంది. రోగిలో అస్థిమితం విపరీతం. ఐస్‌క్రీం లాంటివి తిన్న తరువాత అయ్యే వాంతులు, విరేచనాలకు ఇది ప్రత్యేకమైన మందు. రోగి ముడుచుకొని పడుకొంటాడు.

**కోలోసింథ్ :**

విరేచనం కాబోయే ముందు పొట్టలో నులినొప్పి, అన్నం తిన్న తరువాత నొప్పి తెరలు తెరలుగా వస్తుంది. నొప్పి ఉన్నప్పుడు కాళ్ళు పొట్టలో ముడుచుకొని అదిమి పెట్టి పడుకుంటే ఉపశాంతి ఉంటుంది. పొట్టమీద ఒత్తినా నొప్పి సర్దుకుంటుంది.

విరేచనాలు నురుగు నురుగుగా అవుతాయి. మొదట నీళ్ళుగా మొదలయి తరవాత పసరు, రక్తం కూడా పడుతుంది. పోడోఫైలం రోగిలాగా పెద్ద పెద్ద విరేచనాలు కావు.

**యాలో :**

ఏదైనా తిన్నా, త్రాగినా వెంటనే విరేచనం అవుతుంది. విరేచనం వస్తే ఆపుకోలేరు. పొట్టలో గడబిడలు, పేగులు అరుస్తుంటాయి. విరేచనం పిచికారి కొట్టినట్లు వేగంగా అవుతుంది. నీరు, అపానవాయువు, ఉండలుండలుగా మలం కలిసి విరేచనాలు కావడం ఈ మందు ప్రత్యేక లక్షణం. వేసవిలో విరేచనాలకు, పీతలు తిన్న తరువాత, బీరు తాగితే అయ్యే విరేచనాలకు ఇది మంచి మందు.

**నక్స్‌వామికా :**

శరీర కష్టం లేకుండా మానసిక శ్రమ చేసే వారికి సరిపోయే మందు. అజీర్తి వ్యాధితో బాధపడుతుంటారు. మాటిమాటికి కాఫీ, టీలు, మత్తు పదార్థాలు కావాలి. ఊరకనే ఉద్రేకపడిపోతారు.

విరేచనాలు, రక్తవిరేచనాలు చిన్న చిన్న ఉండలుగా మలం జిగుటతో పడుతుంటుంది. విరేచనం పూర్తిగా అయినట్టుండదు. లోపల మిగిలిపోయినట్లుంటుంది. విరేచనం అయిన కొంచెం సేపు బాగుంటుంది. కాని తరువాత మామూలే. నాలుక మీద మందం బాగా పట్టి ఉంటుంది. పసుపు పచ్చగా ఉంటుంది.

పైన పేర్కొన్నవి కొన్ని హోమియో మందులు మాత్రమే. రోగి లక్షణాలను బట్టి వారికి సరిపడే మందు వాడినచో విరేచనాలు చాలా త్వరితంగా నయమవుతాయి.


**సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా**

**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

## పెన్షన్ వద్దు

*ఇంగ్లాండుకు చెందిన వేల్సు చిన్నతనం నుండి బలహీనుడు కాని అసాధారణ సాహసవంతుడు. ఆ సాహసం వలన సిపాయి స్థానం నుండి సేనాపతి స్థాయికి చేరుకోగలిగాడు. గెలుస్తామనే ఆశ ఏ మాత్రం లేని అనేక పోరాటాల్లో ఆయన ఘన విజయాలు సాధించాడు. ఈయన ఒక యుద్ధంలో కుడిచేతిని, మరొక యుద్ధంలో ఎడమ కన్నును కోల్పోయినా లెక్కచేయక పోరాడి విజయాన్ని సాధించాడు. అతి అద్భుతమైన ఈ యుద్ధాన్ని అందరు కథలు కథలుగా చెప్పుకునేవారు. ప్రభుత్వం ముందుకు వచ్చి వికలాంగులు పెన్షన్ తీసుకుని ప్రశాంత జీవితం గడపమని కోరినపుడు ఈయన నిరాకరిస్తూ "కన్నుతోను, చేతితోను చేసేది యుద్ధం కాదు. యుద్ధానికి తెలివైన మస్తిష్కం, సాహసోపేతమైన హృదయం కావాలి. అవి కోల్పోయిన వాడు తప్పకుండా వికలాంగుల పెన్షన్ తీసుకుని మీరన్నట్టు ప్రశాంత జీవితమేదో గడుపుతాను" అన్నాడు చిరునవ్వుతో. తరువాత కూడా ఆయన యుద్ధాలలో పాల్గొంటూనే ఉన్నాడు. చరిత్రలో వేల్సు పేరు చిరస్థాయిగా సువర్ణాక్షరాలతో లిఖించబడింది.*

*పిరికివాళ్ళు ఒకేసారి పుట్టి పదే పదే చస్తుంటారు. కాని ఆత్మబల సంపన్నులు పుట్టటం, మరణించడం ఒక్కసారే చేస్తారు.*

*- ప్రజ్ఞా పురాణం నుండి*

**ఆత్మ నిగ్రహం అవసరం.**

# వేమన వేదం-జీవన నాదం - 7

భాషలు వేరైనా భావం ఒకటే. మతాలు ఎన్ని ఉన్నా అభిమతం ఒకటే. మార్గాలు వేరైనా మనుగడ ముఖ్యం అన్ని నిత్య సత్యాలను చక్కటి శైలిలో, సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో వివరించారు. "కవియోగి", "యోగకవి" అయిన వేమన.

**కుండ కుంభమన్న కొండపర్వతమన్న**
**నుప్పులవణమన్న నొకటిగాదె**
**భాషలిట్లువేరు, పరతత్త్వమొక్కటె**
**విశ్వదాభిరామ వినురవేమ !**

"కుండ", "కుంభము" అనేవి సమానార్థక పర్యాయ పదాలు. "కొండ", "పర్వతము" అనేవి కూడా పదాలు వేరైనా అర్థం ఒక్కటే. లవణం, ఉప్పు అనే పదాలు వేరైనా, అవి సూచించే పదార్థము ఒక్కటే. అలాగే **అంతరంగాలు వేరైనా, అంతర్యామి ఒక్కడే.** మతాలు వేరైనా మనుగడ ఒకటే. జాతులెన్ని ఉన్నా జాతీయత, జాగృతి ఒక్కటే అన్న సత్యాన్ని తెల్పుతూ, **దేవతలు ఎందరు ఉన్నప్పటికీ, పరమపదం ఒక్కటే.** ఆ పదాన్ని చేరుకోవడానికే ఏ మతమైనా, ఏ తత్త్వమైనా దోహదపడుతుంది.

రైల్వేస్టేషన్ అనే గమ్యాన్ని చేరాలంటే, కొందరు బస్సుల్లో, మరికొందరు ఆటోల్లో, రిక్షాలలో, సైకిల్‌పై, కార్లపై లేదా నడుస్తూ చేరుకొనే ప్రయత్నం చేస్తారు. అంటే మార్గాలు ఎన్నో ఉన్నా, గమ్యం ఒక్కటే అన్న లోకం తీరును చక్కగా వివరిస్తారు వేమన పై పద్యంలో.

అరిషడ్వర్గాలలో ముఖ్యమైనది క్రోధము. అంటే కోపం. ఆ **కోపాన్ని విడిచిపెట్టగల్గినపుడే, అతడు అవతలివారిలోని గుణగుణాలను బేరీజు వేసుకునే సమర్థుడు కాగలడు.** కేవలం అపార్థాలతో, వక్ర భాష్యాలతో, ఎదుటివారిలోని దోషాలను వెదకడంలోనే సమయాన్ని వృథా చేస్తే, మన వ్యక్తిత్వం, పరువు, ప్రతిష్టలకు కూడా భంగం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. అదే భావాన్ని ఈక్రింది పద్యంలో ఇలా అన్నారు వేమన.

**కోపమునను ఘనత కొంచమై పోవును**
**కోపమునను గుణముకొరత పడును**
**కోపమునను బ్రతుకు కొంచెమైపోవును**
**విశ్వదాభిరామ వినురవేమ !**

కోపము ప్రతి మనిషికి ఆంతరంగిక శత్రువు. లోలోపల మనస్సును దహించే బడబాగ్నిలాంటిది. ఆ అగ్నిని నాశనం చేయకపోతే, మనలో ఉన్న వివేకము నశిస్తుంది. ఆ స్థితిలో మనమేం చేస్తున్నామో మనకే తెలియని ఉన్మాదస్థితి కలుగుతుంది. అందువల్ల సంఘంలో చెడ్డ పేరు రావడమే కాకుండా, చెడు గుణాలకు బానిసగా మారే అవకాశం ఉంటుంది. తరుచు కోపం రావడం వల్ల ఆరోగ్యం దెబ్బతిని, ఆయువు కూడా తగ్గిపోతుంది. కాబట్టి **"కోపము ప్రథమ శత్రువు"** అన్న సత్యాన్ని గ్రహించి, త్యజించగల్గాలి. ఇదే భావం మనకు "తన కోపమే తన శత్రువు" అన్న పద్యంలో స్ఫురిస్తుంది.

**"అన్ని ఉన్న ఆకు అణిగిమణిగి ఉంటుంది**
**ఏమి లేని ఆకు ఎగిరెగిరిపడుతుంది"**

అన్న లోకోక్తి, సమర్థుడు ఆర్భాటాలకు దూరంగా, ప్రచార ప్రగల్భాలకు అతీతంగా ఉంటాడు. సమర్థతలేనివాడు కేవలం ఆర్భాటాలకు, ఆడంబరాలకు పరిమితమై హడావిడి చేస్తూ ఉంటాడు. ఇదే తత్త్వాన్ని ఈ క్రింది పద్యంలో ఇలా వివరించారు వేమన.

***గంగ పారుచుండు ఁగదలని గతితోడ***
**మురికివాగు పారు మ్రోత తోడ**
**నధికుడోర్చునట్టు లధముఁడోర్వగలేఁడు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

పవిత్రమైన గంగ నిరంతర స్రవంతిలాగ నిశ్శబ్దంగా, గంభీరంగా ప్రవహిస్తుంది. కానీ దుర్గంధపూరితమైన మురికివాగు, వ్యర్థ పదార్థాల సంయోగం వల్ల పెద్ద శబ్దం చేస్తూ ప్రవహిస్తుంది. శబ్దమెంతచేసినా మురికి వాగును ఎవరూ ఇష్టపడరు. శబ్దం లేకున్నా పవిత్రమైన గంగకు ఉండే ఆదరణ మురికి వాగుకు రాదు. అలాగే మిడిమిడి జ్ఞానంతో, ప్రగల్భాలు ఎన్ని పలికినప్పటికీ అల్పజ్ఞుడు అల్పజ్ఞుడే. పండితుడు తగిన సమయంలో తన పాండిత్య ప్రతిభను ప్రదర్శిస్తూ, మిగిలిన సందర్భాలలో వినమ్రంగా ఉండేవాడు సర్వజన ఆరాధ్యనీయుడు. ఆదరణీయుడు అవుతాడు.

ఇతరుల సహాయాన్ని పొందబోయేముందు, అతడు దాతయా? లేక లోభియా? అని విచారించి, దానమడిగినప్పుడు ఆ యాచనకు విలువ ఏర్పడి తగిన ఫలితాన్ని పొందవచ్చును. లేకుంటే సమయం వృథా కావడమే కాక అవమానం పొందే

**సాత్వికి స్వభావాన్ని ప్రేరేపించే విలువలు మానసిక కాలుష్యాన్ని తగ్గిస్తాయి.**

అవకాశం కూడా ఉండవచ్చును. ఇదే విషయాన్ని వేమన ఇలా వివరించారు ఈ పద్యంలో.

**గొడ్డుటావుఁబిదుక ఁగుండఁగొంపోయిన**
**బండ్లనూడ ఁదన్ను ఁబాలనిదదు**
**లోభివాని నడుగలాభంబులేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ !**

గొడ్డుపోయిన ఆవు (పాలను ఇవ్వకపోవడం, దూడను ప్రసవించలేని) వద్దకు పాలను పిండటానికి బిందెతో వెడితే, అది పాలను ఇవ్వకపోగా, వెనుక కాలితో తన్ని పండ్లను (దంతాలను) ఊడగొడుతోంది. అలాగే లోభి వద్దకు యాచనకు వెడితే భిక్ష లభించకపోగా, అవమానం, తిట్లు పొందే అవకాశం ఉంటుంది. కావున దాత యొక్క వ్యక్తిత్వాన్ని, దాతృత్వాన్ని తెల్సుకుని ప్రవర్తించాలి.

**గొఱ్ఱెలు పదివేలు కూడియుండినచోట**
**తల్లినెరిగివచ్చు దానికొదమ**
**పరమయోగి నెరిగి భక్తుండువచ్చు రా**
**విశ్వదాభిరామ వినురవేమ !**

వేలకొలదీ గొఱ్ఱెలు ఒకేచోట ఉన్నప్పటికీ, గొఱ్ఱెపిల్ల తన తల్లి ఎక్కడ ఉన్నదో తెల్సుకుని, వెదికి చేరుతుంది. ఎటువంటి సందేహము, ఆందోళన లేకుండా తల్లిని చేరుతుంది. అలాగే భక్తుడు కూడా యదార్థయోగిని, అతని ఆధ్యాత్మిక తత్త్వాన్ని గ్రహించి, అతనిని చేరి, పరమాత్మని సేవలో తరిస్తాడు. ఎన్ని వైవిధ్యాలు ఉన్నా, ఎన్ని భిన్న వృత్తులు ఉన్నప్పటికీ నిజమైన భక్తుడు యదార్థయోగిని తెల్సుకునే ప్రయ్నతం చేస్తాడు.

“యద్భావం తద్భవతి” అన్న ఆర్యోక్తి ప్రకారం ఎవరు ఏ భావంతో ప్రయత్నిస్తే వారికి ఆ ఫలం లభిస్తుంది.

అలాగే యోగులు, ఋషులు, మునిపుంగవులు కేవలం కొండలలో, గుహలలో ఉంటారనుకోవడం భ్రమ. అది కేవలం అజ్ఞానం అంటూ వేమన వ్యంగ్యాస్త్రాన్ని ఇలా సంధించారు.

**గుహలలోని ఁజొచ్చి గురువుల వెదకంగ,**
**క్రూర మృగ మొకండు తారసిలిన**
**ముక్తి మార్గమదియె ముందుగా ఁజూపురా**
**విశ్వదాభిరామ వినురవేమ !**

‘గురువు’ అనగా అజ్ఞానాన్ని తొలగించే మార్గదర్శి, అంతేకాని గడ్డాలు పెంచి, కమండలాలు ధరించి, కేవలం వేదంతాన్ని అందరికోసం అందిస్తూ, తాను మాత్రం ఆచరించని కపట గురువులని విమర్శిస్తూ, అటువంటి వారు ఉంటారు తస్మాత్ జాగ్రత్త ! అని హెచ్చరిస్తారు.

గుహలలో వెదికే ప్రయత్నం చేస్తూ ఉంటే, ఆ గుహలలో గురువులు కాకుండా మృగాలవంటి కపట గురువులు ఎదురైతే, అసలు మోక్షానికే ఎసరు తగిలే ప్రమాదం ఉంది. కావున గురువును ఎంచుకోవడంలో తగిన శ్రద్ధ, నైపుణ్యం శిష్యునకు ఉండాలి అని బోధిస్తారు. వేమన.

ఈ బోధలను అను నిత్యం జ్ఞప్తికి తెచ్చుకుని ఆచరించ గల్గినపుడు ప్రతి మనిషి ‘మనీషి’ గా మారే అవకాశం ఉంటుంది.

– సాధన నరసింహాచార్య

## మనిషి తన భాగ్య విధాత తానే

*మనిషి తన భాగ్య విధాత తానే. నేడు మన చుట్టూ ఉన్న పరిస్థితులు మంచివైనా, చెడ్డవైనా అలాంటి పరిస్థితులకు కారణం మనమే కాని ఇతరులు ఎంత మాత్రం కారు.*

*ఒక శ్రామికుడు రాళ్ళు కొట్టి కొట్టి అలసిపోయి మరొక పెద్ద ఆసామిని పట్టుకుంటే ఇంత కన్న తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని ఆలోచించసాగాడు. ఆ ఆలోచనలతో అతడు పర్వత శిఖరాన్ని చేరి అక్కడ కొలువైవున్న దేవతను తన కోర్కెను తీర్చమని కోరుకున్నాడు. ఆమె ఎంతకు పలకడం లేదని మరికాస్త పెద్ద దేవతను ఆరాధిస్తే బాగుంటుందని అనుకున్నాడు. పెద్ద ఎవరిని ఆలోచించగా ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడేనని తోచించి. సూర్యారాధన మొదలుపెట్టాడు. ఒకనాడు ఆకాశం మేఘావృతమై మేఘాలు సూర్యుణ్ణి కప్పివేశాయి. దానితో సూర్యుని కంటే మేఘాలు గొప్పవని భావించి మేఘాలను ప్రార్థించసాగాడు. అనతి కాలంలోనే మేఘాలు పర్వతాన్ని ఢీకొని సమాప్త మౌతున్నాయన్న సంగతి గోచరించింది. అందువల్ల పర్వతాలను ప్రార్థించసాగాడు. క్రమంగా రోజు తన గొడ్డళ్ళతో ముక్కలు చేయబడుకున్న ఈ పర్వతం కంటే తనే గొప్పవాడినన్న సంగతి స్ఫురణకు వచ్చింది. వెంటనే ఆలోచనా విధానం మారింది. తన పురుషార్థంతో అనతి కాలంలోనే ప్రముఖ వ్యక్తిగా గుర్తించబడే స్థాయికి చేరుకున్నాడు.* *– ప్రజ్ఞా పురాణం నుండి*

**ఆత్మ జ్ఞానానికి, ఆత్మ విశ్వాసానికి అవినాభావ సంబంధం ఉన్నది.**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## విశాఖపట్నంలో

పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది సమయాన వారందించిన సందేశాలను ఆంధ్రప్రదేశ్‌లో ఇంటింటా చేర్పించెడి కార్యక్రమాలలో భాగముగా ఈ క్రింద కార్యక్రమాలను యుగశక్తి గాయత్రీ కేంద్రము, విశాఖపట్నం చేపట్టినది.

ప్రైవేటు మరియు ప్రభుత్వ గ్రంథాలయాలకు యుగశక్తి గాయత్రి మాసపత్రికను అందించుటకై ఏర్పాట్లు చేశారు. అదేవిధముగా కార్పోరేట్ ఆస్పత్రులలో, స్వస్థత నిమిత్తం రోగులు గురుదేవుల మాసపత్రికను చదివేలా ఏర్పాటు చేయుట. ఇంకా కళాశాలల, పాఠశాలల మరియు వసతి గృహాల లైబ్రరీలలో మాస పత్రిక లభించేలా చేశారు, 25 పత్రికలకు చందాదారులనుగా చేర్పించిరి.

పై కార్యక్రమాలతోపాటు దాదాపు రూ. 1990/-ల సాహిత్యాన్ని విక్రయించుట జరిగినది. దీనిలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహించిన వారందరికి గాయత్రీమాత ఆశీస్సులు లభించుగాక.

**19.12.2010** గురుదేవుల జన్మశతాబ్ది సందర్భంగా విశాఖపట్నంలో శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేది, ఇతర శాంతికుంజ్ కార్యకర్తల మరియు శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్‌గార్ల ఆధ్వర్యంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. సుమారు 1200 మంది హాజరైన ఈ కార్యక్రమంలో ముగ్గురు స్టీల్ ప్లాంట్ డైరెక్టర్స్, గాజువాక ఎమ్మెల్యే శ్రీ సి. హెచ్. రామకోటయ్య కూడా పాల్గొన్నారు. శ్రీ జ్యోతిశ్వరరావు గారు ఈ కార్యక్రమానికి సహాయ, సహకారాలు అందించారు.

**10.01.2011** విశాఖపట్నం ఉక్కు క్లబ్ స్టీల్ ప్లాంట్ ఏరియాలో శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ బ్రిజ్‌మోహన్ గౌర్ గారు "Personality Development through Spirituality" అనే విషయంపై ఉపన్యసించారు. సుమారు 100 మంది విశిష్ట వ్యక్తులు పాల్గొన్నారు. వీరిలో శ్రీ పి.కె. చంద్, శ్రీ ఉమేశ్‌చంద్ర - స్టీల్ ప్లాంట్ డైరెక్టర్స్ కూడా పాల్గొని లాభాన్వితులయ్యారు.

## సిర్పూర్ కాగజ్‌నగర్‌లో

జిల్లా వెంకట నారాయణ ఆధ్వర్యంలో ఈ క్రింది కార్యక్రమాలు జరిగినవి.

06.02.2011 కాగజ్‌నగర్‌లో ప్రజా సత్సంగము

07.02.2011 108 మందితో కలశయాత్ర

08.02.2011 15 కుండముల గాయత్రీ మహా యజ్ఞము

ఈ యజ్ఞ కార్యక్రమంలో సుమారు 650 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గాయత్రీ పరివార్ విశిష్ట కార్యకర్తలైన శ్రీమతి శాంతి పాండే, శర్మ, భరత్ ప్రజా, రవి మరియు లక్ష్మారెడ్డిగార్లు విశిష్ట సేవలందించి కార్యక్రమ విజయానికి తోడ్పడిరి.

## అమలాపురంలో

**19.01.2011** పత్తిపాడు మండలం రాచపల్లి దగ్గరంలో ఉన్న ఒమ్మంగి గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయమందు పౌర్ణమి సందర్భమున పంచకుండీ గాయత్రి మహా యజ్ఞమును శ్రీ రామానందస్వామి ఆధ్వర్యంలో నాగమణి, గాయత్రి గార్లు నిర్వహించారు. శ్రీ రామానందస్వామి గాయత్రీ మంత్ర దీక్ష, ప్రాణాగ్ని హోత్ర విధిని నేర్పించారు. ఈ కార్యక్రమానికి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ అధికారి శ్రీ శ్యాంసన్ గారు సహాయ సహకారాలందించారు.

**08.02.2011** అమలాపురంలోని శ్రీ గౌతమ మహర్షి గోశాలలోని యాజ్ఞవల్క్య సంస్కారశాలయందు శ్రీ చక్రి రాంబాబు గారి కుమారుడు సత్యనితిన్ జన్మదిన సందర్భంగా పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞమును పి.ఎన్. దుర్గ, ఎన్. కుమారి గార్లు నిర్వహించారు. సుమారు 50 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**10.02.2011** అమలాపురంలోని శ్రీ గౌతమ మహర్షి గోశాల యందుగల శ్రీ ఎ. మల్లేశ్వరరావుగారి కుమార్తె శ్రీ ప్రణతి, చరణ్‌సాయి, ఆదిత్యల జన్మదిన సందర్భమున శ్రీ రామకృష్ణరావు గారి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రి మహా యజ్ఞము నాగమణి, దుర్గ, కుమారి గార్లు నిర్వహించారు. 100 మంది పరిజనులు పాల్గొన్నారు.

**13.02.2011** అమలాపురం మండలం సమనస గ్రామం నందు శ్రీ గుబ్బల సత్యనారాయణ గారి నూతన గృహములో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞమును శ్రీ పి. రామకృష్ణారావు, దుర్గ, కుమారి గార్లు నిర్వహించారు. సుమారు 50 మంది పరిజనులు పాల్గొన్నారు.

**20.02.2011** అమలాపురంలో శ్రీ సత్యనారాయణ

**ఆవేశాన్ని అదుపులో ఉంచుకోవాలి.**

అనసూయ దంపతుల స్వగృహమునందు పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞమును నాగమణి, రామకృష్ణారావు, దుర్గ, కుమారి గార్లు నిర్వహించారు. సుమారు 100 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరందరికి గాయత్రీ మంత్ర దీక్షనిచ్చి, ప్రాణాగ్ని హోత్ర విధి నేర్పించబడినది.

**27.02.2011** పశ్చిమగోదావరి జిల్లా తణుకు గ్రామం నందు శ్రీ కె. రామమోహన్‌రావు గారి ముని మనుమరాలి అన్నప్రాసన సందర్భమున మూడు కుండముల గాయత్రీ మహా యజ్ఞమును శ్రీ రామనందస్వామి, గాయత్రి గార్లు నిర్వహించారు.

**27.02.2011** పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట గ్రామం నందు శ్రీ విద్యాసాగర్ గారి స్వగృహం నందు పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞమును శ్రీ రామానందస్వామి, గాయత్రి గార్లు నిర్వహించారు.

**ప్రచారం :** వివిధ గ్రామములలో (అమలాపురం, రంగాపురం, మంగాపురం, కాత్రేని కోన, రాజోలు, జగన్నపేట) గురుదేవుల గురించి, గాయత్రీ మంత్ర విశేషత గురించి, గాయత్రి నేటి పరిస్థితులలో ఆవశ్యకత గురించి సత్సంగములు నాగమణి గారిచే నిర్వహించబడినవి. మంత్రలేఖనం వ్రాయుట, జపం ఆసన ప్రాణయామములు నేర్పించుట జరిగినది. యుగశక్తి గాయత్రి మాస పత్రికకు 8 మంది చందాదారులను చేర్పించుట జరిగింది.

## నెల్లూరులో

2010 ఆగస్టు నుండి 2011 జనవరి వరకు జరిగిన యజ్ఞ కార్యక్రమాలు

| తేదీ | స్థలం | కుండముల సంఖ్య |
|---|---|---|
| 01.08.2010 | నెల్లూరు గాయత్రీ పరివార్ ఆఫీసు | 5 |
| 22.08.2010 | నెల్లూరు ప్రగతి నగర్ | 5 |
| 05.09.2010 | నెల్లూరు గాయత్రీ పరివార్ ఆఫీసు | 5 |
| 03.10.2010 | నెల్లూరు గాయత్రీ పరివార్ ఆఫీసు | 5 |
| 10.10.2010 | నెల్లూరు గాయత్రీ పరివార్ ఆఫీసు | 5 |
| 17.10.2010 | నెల్లూరు, పటేల్ గారి సా మిల్లు | 3 |
| 05.012.2010 | నెల్లూరు గాయత్రీ పరివార్ ఆఫీసు | 5 |
| 17.12.2010 | నెల్లూరు జిల్లా, కావలి డివిజన్ అల్లూరులోని శ్రీ కాశీనాథుని ఆశ్రమం | 3 |
| 21.12.2010 | తటవర్తి గ్రామం, సిద్దేశ్వరస్వామి ఆశ్రమం | 5 |
| 02.01.2010 | నెల్లూరు గాయత్రీ పరివార్ ఆఫీసు | 5 |

## తాళ్ళదుమ్మలో

10.03.2011 తాళ్ళదుమ్మ గ్రామంలోని శ్రీ గాయత్రీ ప్రజ్ఞాపీఠ సప్తమ వార్షికోత్సవ శుభ సందర్భమున పంచకుండీ గాయత్రి మహా యజ్ఞం నిర్వహించబడినది. 09.03.2011 సాయంత్రం 2001 దీపములతో దీపయజ్ఞం, 10.03.2011 ఉదయం 7 గం॥లకు 200 కలశములతో శోభాయాత్ర, తదనంతరం 9 గం॥లకు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడినది. సుమారు 150 మంది పాల్గొన్న కార్యక్రమమును శ్రీ అగ్నిహోత్రి, సంతోష్‌కుమార్ నాగమణి దంపతులు నిర్వహించగా శ్రీ లక్ష్మణరావు, పాపారావు, చిన్నం నాయుడు, హరి నారాయణగార్లు సహకరించారు.

### అందరికీ ఆహ్వానము

### 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞము

వాతావరణ కాలుష్య నివారణార్థం, సద్బుద్ధి ప్రవర్ధనార్థం, విశ్వ కళ్యాణార్థం అఖిల విశ్వగాయత్రీ పరివార్ శాంతికుంజ్, హరిద్వార్ వారి ఆశీస్సులతో; గాయత్రీ శక్తిపీఠము, నారాకోడూరు మరియు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ, బృందావన్ గార్డెన్స్, గుంటూరు వారి ఆధ్వర్యంలో; భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్, గుంటూరు, శ్రీ బొల్లేపల్లి సత్యన్నారాయణ శ్రీమతి లలితా దంపతుల ప్రోత్సాహము సహాయ సహకారములతో 2011 మే నెల 6,7 మరియు 8 తేదీలలో 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞము నిర్వహించ సంకల్పించడమైనది.

**యజ్ఞవేదిక :** శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ధార్మిక పరిషత్ ప్రాంగణము, బృందావన్ గార్డెన్స్, గుంటూరు.

**కార్యక్రమ వివరములు :**

**06.05.2011** సా॥ 4.30 గం॥ల నుండి కలశయాత్ర

**07.05.2011** ఉ॥ 9 గం॥లకు 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞము
సా॥ 4 గం॥లకు సాంస్కృతిక కార్యక్రమాలు, భజన పోటీలు, దీప యజ్ఞము

**08.05.2011** ఉ॥ 9 గం॥లకు 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞము, పూర్ణాహుతి


వివరములకు సంప్రదించండి :
**డా॥ శ్రీరామ్ - 9959136722**

ఆత్మ నిగ్రహం అంటే విచ్ఛిన్నకర ఆవేశాలను అదుపులో ఉంచుకొనడమే.

అక్షరాల ఆట

# పదగాయత్రి-7

నిర్వహణ : సాధన నరసింహాచార్య



## పదగాయత్రి-6 సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 మ | హా | శి | 2 వ | 3 రా | 4 త్రి | X | 5 ప్ర |
| హా | X | X | 6 ము | ళ | రా | మ | X |
| 7 భా | 8 ను | 9 డు | X | క | X | X | ము |
| 10 ర | డి | పే | X | X | 11 గ | 12 ము | న |
| త | X | X | 13 ము | క్తి | X | ర్గ | 14 వ |
| ము | X | 15 సం | వా | X | 16 ము | మా | న |
| X | 17 వి | వ | క్ష | X | 18 న | ర్మ | ద |
| 19 క్షీ | ర | సా | గ | ర | మ | థ | 20 నం |

పేరు : ..................................................

చిరునామా : ..........................................

.................................................................

..................... పిన్ కోడ్ : .......................

ఫోన్ నెం : ...........................................

**ఆధారాలు**

**అడ్డం**

1. ధర్మాన్ని నీవు కాపాడితే, అది నిన్ను కాపాడుతుంది (8)
7. విధము (3)
8. భూమి (3)
10. ............ భీరామ వినురవేమ (3)
12. కంచర్ల గోపన్న పేరు లోని మొదటి రెండక్షరాలు (2)
14. చాపలను తయారుచేయడం, చివరి అక్షరం లోపించింది (అటునుండి) (2)
16. సప్త స్వరాలలోని మూడు స్వరాలు (3)
17. పుష్ప వర్షాన్ని కురిపించేవారు (ఏకవచనం) (3)
18. చెట్టు (3)
19. ఇల ............. (3)
20. సంస్కృత ఆర్యోక్తి 'మాతృమూర్తి మరియు మాతృదేశం' (స్వర్గం కన్నా గొప్పది) (8)

**నిలువు**

1. భూమి, చుక్కలనంటుతున్న వస్తువు విలువ (2)
2. 1 అడ్డంలోని సూక్తిని కర్మకు ఆపాదిస్తే (మొదటి రెండక్షరాలు) క్రింద నుండి (2)
3. చంద్రగుప్తుని తల్లి క్రింద నుండి (2)
5. రాత్రి (3)
6. రాజ భవనమే ........... పురం క్రింద నుండి (2)
8. తిరగబడ్డ అది గుర్రమే (3)
9. అష్ట పదుల కవి (క్రింద నుండి) (5)
10. కృష్ణణ్ణి ఇలా ప్రార్థించాలి - కృష్ణ శతకంలోని రెండవ పద్యంలోని మొదటి పాదం (5)
11. మధ్య అక్షరం లోపించిన అన్నదమ్ముల పిల్లలు (ఏకవచనం) (2)
12. అక్షరం లోపించినా, అయోధ్యను ఇలా పిలుస్తారు (5)
13. అరిషడ్వర్గాలలో అయిదవది (3)
16. గొప్ప (క్రింద నుండి) (2) విరాళాల విషయంలో వాడతారు
20. దగ్గుతోబాటుగా ఉండేది, తిరగబడి చివరి అక్షరం మాయం (2)
21. మరోజన్మకు ఆద్యంతాలు (2)

**నిబంధనలు :**

1. *సమాధానాలు "కీ"తో సరిపోవాలి.*
2. *కూపన్లు చేరవలసిన చివరి తేది 18-05-2011*
3. *పత్రికలో పైన ఇచ్చిన కూపన్‌నే పంపవలెను.*
4. *దిద్దుబాట్లు / కొట్టివేతలు / తుడుపులు ఉండరాదు.*
5. *తెల్లకాగితాలు / జిరాక్స్ కాపీలు అనుమతించబడవు.*
6. *అన్ని కరెక్టు అయిన ఎంట్రీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నచో లాటరీ ద్వారా ఎంపికచేసి **ప్రథమ బహుమతి రూ. 100/-లు, ద్వితీయ బహుమతి రూ. 50/-లు** ఇవ్వబడును.*
7. *తపాలశాఖవారి ఆలస్యానికి పత్రిక బాధ్యత వహించదు.*
8. *బహుమతుల విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే. ఎలాంటి వివాదాలకు తావులేదు.*
9. *పేరు, చిరునామాలు స్పష్టంగా, పిన్‌కోడ్‌తో ఫోన్‌నెంబరుతో సహా వ్రాయాలి.*

**పదగాయత్రి-6 విజేతలు**

మొదటి బహుమతి : **జి. పార్వతి,** చీరాల

ద్వితీయ బహుమతి : **యు. నాగమణి,** ఈపురుపాలెం

**ఎంట్రీలు పంపవలసిన చిరునామా**

**పదగాయత్రి C/o. యుగశక్తి గాయత్రి, అశ్విని హౌస్ ప్రక్కన, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18.**